ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

28-3-56



నేనూ, తమ్ముడూ

—ఫొటో : ఎస్. కె విఠల్.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder . K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 30
28.3-56

మన్మథ ఫాల్గుణ బహుళ ద్వితీయ బుధవారం




"సర్వం ప్రియే చారుతరం వసన్తే"
(శ్రీనగర్‌లో నిషాత్, షాలిమార్ ఉద్యానవనాలలో వసంతరామణీయకం)

విషయానుక్రమణిక

ముఖచిత్రం : సుమగుంఫనము.

చిత్రకారుడు: కల్యాణప్రసాద్ శర్మ—విజయనగరం.




శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

జనరల్ రోమెల్ గొప్ప సేనాని అనిచెబుతారు. కాని అతగాడిలో ఒక లోపం ఉంది వేసినఎత్తే మళ్ళీ వేస్తూవుండేవాడు పాకిస్తాన్ వ్యవహారం కూడా అలాగే వుంది రాగం మాత్రం మార్చి పాతపాటే పాడుతోంది

కొన్నేళ్ళక్రితం భారత ప్రధానికి అమెరికా ఆహ్వానం పంపించింది పాకిస్తాన్ ప్రధాని లియాకత్‌కు ఆహ్వానం రాలేదు అప్పుడు పాకిస్తాన్ మోజు రష్యామీదికి తిరిగింది లియాకత్ మాస్కో నుంచి ఆహ్వానం తెప్పించుకున్నాడు పాకిస్తాన్ నాయకులు కమ్యూనిజమూ, దేవుడూ కలిస్తే ఇస్లామ్ అవుతుందన్నారు అప్పుడు లయనల్ ఫీల్డెన్ లాంటి ప్రచారకులు కొందరు పాకిస్తాన్ చాలా సుస్థిరరాజ్యమనీ, ఇండియాపని అఖరేననీ రేడియో ప్రసంగాలు చేశారు దీంతో అమెరికా లియాకత్ మహాశయునికి కూడా ఆహ్వానం పంపించడం జరిగింది సరే దరిమిలా, సైనిక, ఆర్థకసహాయం కూడా పాకిస్తాన్‌కు లభించింది

కరాచీలో ఆగ్నేయాసియా రక్షణకూటమి సమావేశానికి ముందుగా పాకిస్తాన్ మరొక చిన్న తమాషా చేసింది "రష్యాతో వ్యాపారం ఒడంబడిక కుదుర్చుకునేందుకుగాను సంప్రదింపులు ప్రారంభించాలని ఆర్థిక వ్యవహారశాఖ ఇచ్చిన సలహాను పాకిస్తాన్ మంత్రివర్గం ఆమోదించింది ఆర్థికశాఖ ప్రతినిధులు టోక్యోనుంచి రాగానే ఏప్రిల్ ప్రారంభంలో వ్యాపారప్రతినిధి సంఘం ఒకటి మాస్కో వెళ్ళవచ్చును" అని ఒక తమాషావార్త కరాచీలో ప్రకటించబడింది ప్రభుత్వ సమాచారశాఖకూడా వ్యాపింపజెయ్యలేనంత వేగంగా ఈ విషయం బయటికి పొక్కి వ్యాపించిందట ఆతరవాత ఆగ్నేసియా రక్షణకూటమి సమావేశం జరిగింది కాశ్మీర్ సమస్యను చర్చిస్తేనేగాని వీల్లేదని పాకిస్థాన్ పట్టుబట్టి, సమావేశంలో పాల్గొననికూడా బెదిరించింది జనరల్ గ్లబ్ తొలగింపబడినందుకే బాధపడిపోతున్న



ఆంధ్రగవర్నరు శ్రీ త్రివేదీ, మార్చి 15 వ తేదీ సాయంత్రం శ్రీ కందుల ఓబులరెడ్డిచే మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీ ఓబులరెడ్డి ఆంధ్రమంత్రివర్గంలో ఎనిమిదవ మంత్రి. ఈయన ఆటవీ వ్యవసాయ పశువైద్యశాఖలను నిర్వహిస్తారు.

★ న్యూఢిల్లీ లేఖ ★

పశ్చిమరాజ్యాలు పాకిస్థాన్ ఎదురుతిరిగితే అది రష్యాకు ఇంకో విజయం అవుతుందని భావించాయి. అందుచేత ఆ కూటమి కాశ్మీర్ ప్రసక్తికి అంగీకరించి, ఐక్యరాజ్య సమితిద్వారాగాని, ఇండియా పాకిస్థాన్‌లు ముఖాముఖి చర్చించుకోవడంద్వారాగాని కాశ్మీర్ సమస్య పరిష్కృతం కావాలని తీర్మానించింది. ఆ సిమ్యులేట అంతా నాటకం లాగా జరిగిపోయింది. డల్లెస్ మహాశయుడు ఢిల్లీ వచ్చి సీటో కూటమిద్వారా కాశ్మీర్ సమస్య పరిష్కరించాలనే ఆలోచనలేదని చెప్పి చెప్పారు. కాశ్మీర్ విషయమై నిర్ణయం చేసే అధికారం ఆగ్నేసియా కూటమికి లేదని ఫ్రెంచి విదేశాంగమంత్రి పినో చెప్పారు. ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి కేసీ పాకిస్థాన్ పక్షానా మాట్లాడినా, కాశ్మీర్ తగాదాపై నిర్ణయం చేయాలనే యోచన కూటమికి లేదన్నారు. కూటమి కాశ్మీర్‌ను చర్చించడానికి తగినసంస్థ కాదని బ్రిటిష్ విదేశాంగ మంత్రి సెల్విన్‌లాయిడ్ అంతకుముందే ప్రకటించారు.

ఇక పాకిస్థాన్ ఎలా వ్యవహరిస్తుందో చూడాలి. పాకిస్థాన్ రష్యా వ్యాపార చర్చల సంగతి కూడా ఎలా నడుస్తుందో చూడాల్సిందే.

* * *

డల్లెస్ న్యూఢిల్లీకి తొందరగా, హడావుడి లేకుండా వచ్చి వెళ్ళారు. ఆయన రాక జయప్రదంగా జరగడానికి అమెరికన్ రాయబారి షెర్మన్ కూపర్ కూడా కారకుడే. పాకిస్థాన్ దురాక్రమణచేస్తే అమెరికా భారతదేశం పక్షం వహిస్తుందని డల్లెస్ హామీ ఇచ్చారు. అయితే దురాక్రమణ జరిగిందో లేదో [illegible] అవుతుందీ అని. కాశ్మీర్‌లో జరిగిన తంతు మన కెరిగినదే. పాకిస్థాన్ కాశ్మీర్‌పై దాడిచేసిందని భారతదేశం సమితికి ఫిర్యాదుచేసి 8 ఏళ్ళయింది. ఈ ఎనిమిదేళ్ళలోనూ పాకిస్థాన్ దురాక్రమణ చేసినట్లు ప్రకటించడం తప్ప సమితి మిగతాదంతా చేసింది.

పాకిస్థాన్ భారతదేశంపై దాడిచేస్తుందనుకుందాం. కాశ్మీర్ విషయంలో దురాక్రమణ జరుగలేదని వాదించినట్లే పాకిస్థాన్ మళ్ళీ బుకాయించవచ్చును. భారతదేశమే దురాక్రమణ చేసిందని కూడా ఎదురు బుకాయించవచ్చును. ఈ వాద ప్రతివాదాలు జరుగుతుండగానే పాకిస్థాన్ భారతదేశాన్ని ఆక్రమించివేయవచ్చును. దురాక్రమణ సంగతి తేలేదాకా పాకిస్థాన్ కమ్యూనిస్టు దురాక్రమణ ఎదుర్కోడం కోసం తెచ్చుకున్న అమెరికన్ ఆయుధ సామగ్రిని హాయిగా వాడేస్తుంది.

కనుక ఈ అస్పష్ట సహాయం విషయమై అమెరికా తన వైఖరిని మరింత విస్పష్టం చేయవలసిఉంది.


* * *

రాజ్యసభకు ఏటా జరిగే ఎన్నికలు దగ్గర పడ్డాయి. మళ్లీ సెలెక్టు కానివారందరికీ రాజ్యసభలో కూర్చోవడం ఇదే ఆఖరుసారి. వీరిలో కొందరు లేనిలోటు తెలిసివస్తుంది కూడాను.

బేగం కుద్సియా ఐజాజ్ రసూల్ కేంద్రశాసనసభకు పదేళ్ళక్రితం ఎన్నికైంది. పూర్వపు రాజ్యాంగసభలోను, రాజ్యసభలోను ఆమె మొదటినుండి సభ్యురాలుగా ఉంటోంది. ఆమె సమర్థురాలనిపించుకుంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆమెను ఈ సారికి సెలెక్టు చేయలేదు. బేగం కిద్వాయ్‌ను సెలెక్ట్ చేశారు. దీన్నిబట్టిచూస్తే ఒక ప్రశ్న ఉదయిస్తోంది. ముస్లిములకు స్థానాలు కేటాయించారా? కేటాయిస్తే ఎన్ని కేటాయించారు? మత ప్రాతినిధ్యపు పద్ధతి, అల్పసంఖ్యాకులకు స్థానాల కేటాయింపుపద్ధతి ఇంకా కొనసాగుతున్నాయా? ఎందుకంటే బేగం రసూల్ స్థానే బేగం కిద్వాయ్‌ను సెలెక్టు చేసినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ముస్లిములకు కొన్ని సీట్లు అంటూ కేటాయించారనుకోవలసి వస్తుంది. అంటే స్థానాల కేటాయింపు పద్ధతిని దొడ్డిదోవన ప్రవేశపెట్టారన్నమాట.

* * *

కాంగ్రెస్ - అకాలీ పక్షాలు ఇటీవల సమాధానపడడం సంతృప్తి కలిగిస్తున్నది. దేశ విభజనకుముందు కాంగ్రెసుచరిత్రను పరిశీలిస్తే ఒకటి అనిపిస్తుంది కాంగ్రెసు



స్వతంత్రభారతానికి మొదటి గవర్నరు జనరల్‌గా పనిచేసిన మౌంట్‌బాటెన్ ప్రభువు, ఆయన సతి ఇటీవల ఢిల్లీ వచ్చి రాష్ట్రపతిని, ఉపరాష్ట్రపతిని సందర్శించారు.

ఇప్పుడు కనబరచిన వాస్తవిక దృక్పథాన్ని అప్పుడు కూడా కనబరచిఉంటే, భారత దేశం ఇలా విభజింపబడేది కాదేమో. కాంగ్రెస్ - అకాలీ ఒడంబడికను బట్టి చూస్తే, కాంగ్రెసు సిక్కులకు ప్రాతినిధ్యం వహించడంలేదని, కాంగ్రెసులోని సిక్కు సభ్యులకు తమ మతస్థులలో పలుకుబడి లేదని కాంగ్రెసే ఒప్పుకున్నట్లు అనుకోవలసి వస్తుంది. విభజనాత్పూర్వం జరిగిన ఎన్నికలు కూడా, కాంగ్రెసుముస్లిములకు సంబంధించినంతవరకూ ఇటువంటి నిజాన్నే బయటపెట్టాయి. కాని కాంగ్రెసు మాత్రం ముస్లిములకు ముస్లింలీగే ప్రాతినిధ్యం వహిస్తోందని అంగీకరించడానికి ఇనకాడింది. ఇప్పుడు అకాలీలే సిక్కులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఒప్పుకుంటోంది.

హిమాచల్ ప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ పార్మార్‌కు పెద్ద ఆశాభంగం కలిగింది. హిమాచల్ ప్రదేశ్‌ను పంజాబుతో కలపకుండా ఉంటే తన ముఖ్య మంత్రిత్వం స్థిరంగా ఉంటుందని ఆయన భ్రమించినట్లున్నారు. అకాలీ సిక్కుల మూలంగా హిమాచల్ ప్రదేశ్ విడిగానే ఉండబోతున్నది. కాని ఆ ప్రాంతం శాసన సభగాని, మంత్రివర్గంగాని లేకుండా కేంద్రపాలిత ప్రాంతంగా ఉండిపోతుందని శ్రీ పార్మార్‌కు తెలియజేయబడింది. శ్రీ పార్మార్‌కు ఇకముందు ఏ ఉద్యోగం ఇవ్వబడుతుందో తెలియదు.

*　　*　　*

భారత చరిత్రలో 57 సంఖ్యగల సంవత్సరం ఏదో రకంగా ప్రత్యేకత గల సంవత్సరం లాగా కనిపిస్తోంది. 1557 లో అక్బరు భారత చక్రవర్తిగా స్థిరపడ్డాడు. 1657 లో ఔరంగజేబు తండ్రి షాజహాన్‌ను ఖైదులో పెట్టేశాడు. 1757 లో ప్లాసీయుద్ధం జరిగింది. 1857 లో సిపాయి విప్లవం జరిగి, మొగల్ పాలన అంతరించింది. 1957 లో దేశమంతటా కొత్త ఎన్నికలు జరుగుతున్నాయి.

ఢిల్లీ నగరానికి, దానికి విదేశీయ పాలకులకు కూడా ఇలాంటిదే ఏదో ప్రత్యేకత కనబడుతోంది. పాత ఢిల్లీ కట్టించిన షాజహాన్ కారాగారంలో మరణించాడు. కలకత్తానుండి రాజధానిని ఢిల్లీకి మార్చిన హార్డింజ్ ప్రభువు ఢిల్లీలోకి ప్రవేశిస్తూనే చాందినీచౌక్‌లో బాంబు ప్రమాదానికి లోనైనంత పని జరిగింది. ఇర్విన్ ప్రభువు న్యూఢిల్లీలో నివసించడానికి మొదటిసారిగా వస్తూఉండగానే పురానాఖిల్లా వద్ద ఆయన రైలు బాంబు చేయబడి, చావు కొద్దిలో తప్పింది. ఢిల్లీకి రాజధాని మార్చిన అనతికాలంలో కాశ్మీర్ గేటువద్ద సెంట్ జేమ్స్ చర్చి పైకప్పు కూలిపోయింది. ఢిల్లీ మొదటి చీఫ్ కమీషనర్ హేలీప్రభువు ఏకైక పుత్రిక ఎలుక విషం వల్ల చనిపోయింది. ఢిల్లీకి రాజధాని మార్చిన 35 ఏళ్ళలోనే ఇండియాలో బ్రిటిష్ పాలనకు స్వస్తి చెప్పబడింది. ఈ స్వస్తివాక్యం పలికిన మౌంట్‌బాటెన్ ప్రభువు మళ్ళీ ఇప్పుడు ఢిల్లీ వచ్చారు. ఈసారి ఆయన వచ్చింది భారతదేశానికి ఒక విమానవాహక నౌక అమ్మేందుకు. ఆయన గొప్ప వ్యక్తి అనడంలో సందేహమక్కర్లేదు. ★

కవిపక్షపాతి

ప్రాచీన గాథాలహరి

౧

ఆనాటి అర్ధరాత్రివేళ ఉజ్జయినీ నగరం అంతా శిశిరఋతు హిమవర్షంలో లేత లేత వెన్నెల వెలుగుల్లో తెల్లని దుప్పటి కప్పుకొన్నట్టుగా తళతళ మెరిసింది. రాజప్రసాదంలో హర్ష విక్రమాదిత్య చక్రవర్తి హంస తూలికా తల్పంపై నిద్రిస్తున్నాడు. అలాగ కొంతకాలం గడిచేసరికి జివ్వుమనే చలిగాలి గవాక్షాల తెరలు తొలగించుకొని రివ్వుమని లోపల ప్రవేశించింది. ఆ చలిగాలికి చక్రవర్తికి మెలకువ వచ్చింది. ఆ శయనాగారంలో హసంతికలు జాజ్వల్యమానంగా వెలిగిపోతున్నాయి. కాని ఆ శయనాగారంలో వెలుగుతున్న దీపాల కాంతులు కొంచెం మందగించాయి. నూనెపోసి ప్రజ్వలింపజేసే పరిచారకులు పార్శ్వ భవనాలలో గాఢంగా నిద్రపోతున్నారేమో అనుకొన్నాడు చక్రవర్తి. లేకపోతే ఆ దీకపిలలాగ ఎందుకు సన్నగిల్లిపోతున్నాయి? ఆ సమీపంలో ఎక్కడా ఆ పరిచారకుల అలికిడే వినిపించలేదు.

"ఎవరక్కడ?"

అని పిలిచాడు హర్ష చక్రవర్తి. వెంటనే ఒక వ్యక్తి శయ్యాగారంలో ప్రవేశించి దీపకల ప్రమిదలలో నూనెపోసి తిరిగీ ప్రజ్వలింప జేశాడు. మళ్లీ అవి జాజ్వల్యమానంగా వెలిగాయి. చక్రవర్తికి లోపలికివచ్చిన వ్యక్తి సామాన్య పరిచారకుడులా కనిపించలేదు.

"ఎవరా వచ్చినది?" అని ప్రశ్నించాడు.

"మహాప్రభూ! నేను! మాతృగుప్తుణ్ణి!"

అన్నాడా నూతన వ్యక్తి.

"మాతృగుప్త కవీశ్వరులా?" అని చక్రవర్తి లోలోపల కొంచెం ఆశ్చర్యపోయాడు. ఆకాశంలో తారకలు దట్టంగా కమ్ముకొన్న మంచుతెరలు తొలగించుకొని లేత లేత వెన్నెలలో సన్న సన్నని చిరునవ్వులు చిలకరించాయి.

చక్రవర్తి ఒక నిట్టూర్పువిడిచి—

"ఇప్పటికి ఎంత రాత్రి గడిచింది?" అని ప్రశ్నించాడు.

"రాత్రి చాలావరకు గడిచిపోయింది. ఇక మిగిలింది సరీగా ఝాముస్నరమాత్రమే" అని సమాధానం ఇచ్చాడు మాతృగుప్తకవి.

చక్రవర్తి ఆ దీపకాంతిలో కవి ధరించిన దుస్తులు జాగ్రత్తగా పరకాయించి చూచాడు. అతడు ధరించినవన్నీ మలిన జీర్ణ వసనాలే!

"ఎముకలు కొరికే చలిలో ఎలాంటిచింకిపాతలు కట్టుకున్నాడో!" అనుకున్నాడు హర్ష విక్రమాదిత్యుడు. కాని అభావమేమీ ముఖంమీద కనబడనీయలేదు. చక్రవర్తి ఏదో ప్రశ్నించే ధోరణిలో ఉన్నాడని గ్రహించి మాతృగుప్తుడు అతని శయ్యకు దగ్గరగా నిలుచున్నాడు. చక్రవర్తి ప్రశ్నించాడు.

"ఇంత రాత్రివేళ మీకింత స్పష్టంగా కాలమానం ఎలాగ తెలిసింది?"

మాతృగుప్తుని కాక్షణంలో చక్రవర్తి కవితాభిమానం స్ఫురణకు వచ్చింది. ఒక క్షణం సేపుండి అతడడిగిన ప్రశ్నకు సమాధానంగా ఒక శ్లోకం చదివాడు.

చలి ఎముకలు కొరికివేస్తున్నదనీ అదే పనిగా హసంతిక లూదడం వల్ల పెదవులు బిరడుకట్టుకుపోయాయనీ ఆకలిమూలాన గొంతెండిపోయినదనీ, ఆయా కారణాల వల్ల నిద్రాదేవత అవమానితయైన ప్రియురాలివలె దూరదూరంగా తొలిగిపోయినదనీ సత్పాత్రదత్తమైన వసువువలె రాత్రి ఎంత సేపటికీ గడవడం లేదనీ ఆ శ్లోక తాత్పర్యం.

ఆ విధంగా నిద్రపట్టకపోవడం వల్లనే అంత విస్పష్టంగా కాలమానం తెలుసుకోవడం జరిగినదని మాతృగుప్తుడా శ్లోకంద్వారా చక్రవర్తికి ధ్వనింపజేశాడు.

హర్ష విక్రమాదిత్య చక్రవర్తి ఎంతో శ్రద్ధగా ఆ శ్లోకం విని ఒక్క చిరునవ్వు నవ్వి మళ్లీ హాయిగా కళ్లు మూసుకొని నిద్రపోయాడు.

ప్. గణపతిశాస్త్రి

మాతృగుప్తుడు చిరిగిపోయిన ఉత్తరీయంతో ఒళ్లంతా కప్పుకుని చలిలో గజగజ వణికిపోతూ ఆ శయ్యాగృహం ద్వారం దాటి ఇవతలికి వచ్చివేశాడు. అక్కడే వటికి కటికినేల మీద చదికిలపడి ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టాడు. తనికి తన దుర్దశ తలుచుకుంటూంటే కళ్ళంట కవోష్ణబాష్పాలవిరళధారగా ప్రవహించాయి.

మాతృగుప్తకవి ఉజ్జయినికి వచ్చినతరవాత అప్పుడే ఒక సంవత్సరం గడిచిపోయింది. హర్ష విక్రమాదిత్యుడు ఆ కాలంలో భారతవర్షానికంతటికీ చక్రవర్తి. అంతటి మహా చక్రవర్తి ఆస్థానంలో ప్రవేశం లభించినా మాతృగుప్తకవికి దారిద్ర్యపీడ తొలగలేదు. అది నానాటికీ ప్రతిఘటించిపోయింది. అతనికి అప్పుడే నలభైఏళ్లు నిండాయి. ఇంతకు పూర్వం అతడు ఎన్నెన్నో రాజాస్థానాలు సందర్శించాడు. ఎన్నెన్నో రాజసభలలో తన కవితాచాతుర్యం ప్రదర్శించాడు. ఇక దేశసంచారం విరమించుకొని మిగిలిన జీవితం అంతా ఒకే ఒక ఆస్థానంలో గడిపి వెయ్యాలని నిశ్చయించుకొన్నాడు. వెంటనే సకుటుంబంగా ఉజ్జయినీ నగరం చేరుకొన్నాడు.

అదృష్టవశాత్తు త్వరలోనే అతనికి చక్రవర్తి ఆస్థానంలో ప్రవేశం లభించింది. మొదటలో చక్రవర్తికి మాతృగుప్తకవియెడల కొంతవరకు గౌరవాదరాలేర్పడ్డాయి. తరవాత కొంతకాలానికి ఆ గౌరవాదరాలన్నీ నశించిపోయి కేవలం తటస్థ దృష్టిమాత్రమే మిగిలింది. ఇటీవల కొంచెం అనాదరణకూడా ప్రారంభమైనది.

మాతృగుప్తుని అనంతరం విక్రమాదిత్యుని ఆస్థానం సందర్శించిన విద్వాంసులకు, కవీశ్వరులకు చక్రవర్తి ఎన్నెన్నో సత్కారాలు చేశాడు. మొదటగాని, అటుపిమ్మటగాని మాతృగుప్తుని కటువంటి సత్కారం ఎన్నడు జరగలేదు. మొదట ఏదో కొంచెం గౌరవభావం ఉండేది. ఇప్పుడది కూడా పూర్తిగా నశించిపోయింది. ఈ దురదృష్ట పరిణతికి కారణమేమో మాతృగుప్తుని కవగాహన కాలేదు. పోనీ చక్రవర్తి కఠిన హృదయుడేమో అను

టుంటే అదీ నిజంకాదు. ఆస్థాన విద్వాంసులు, కవీశ్వరులు, చక్రవర్తి ఆదర కటాక్షానికి పాత్రులై ఎన్నో విధాల వైభవైశ్వర్యాలతో తులతూగుతున్నారు. మాతృగుప్త కవి అంటే సాటి విద్వాంసులు, కవీశ్వరులు ఎంతో ఆప్యాయంగా ఆదరించేవారు. కాని ఒక్క చక్రవర్తికే అతని యెడల కర్కశమైన కాఠిన్యభావం ఏర్పడింది.

చక్రవర్తి అంతటితో ఆగలేదు. సామాన్య పరిచారకులు నిర్వహింప వలసిన పనులు కూడా మాతృగుప్తునికే అప్పజెప్పేవాడు. చిట్ట చివరికి చక్రవర్తి శయ్యాగారంలో దీపికలు, హాసంతికలు జ్వలింపజేసే నీచ దాస్యంకూడా మాతృగుప్తకవి మీదేపడింది. అయినా అతడేమీ చలించక తన కప్పజెప్పినది ఎలాంటి చిన్నపని అయినా ఎంతో జాగ్రత్తగా నిర్వహిస్తూండేవాడు. అది చక్రవర్తి దాసదాసీజనం చెయ్యవలిసినపని అయినా మాతృగుప్తుడు తనకది ఒక తలవొంపుగా భావించలేదు. మిగిలిన విద్వాంసులు, కవులు చక్రవర్తి మాతృగుప్తుని యెడల వహించే కాఠిన్యానికెంతో కుంగిపోయేవారు. కాని ఎవ్వరికీ దీనికి హేతువేమో అంతు చిక్కలేదు.

ఇక మాతృగుప్తుని కుటుంబ పరిస్థితులు కూడా నానాటికి అధ్వాన్నమయిపోయాయి. ఆరు మాసాలకు పూర్వం అతని ఏకైక పుత్రుడు రోగంతో తీసుకుని తీసుకుని చిక్కి శల్యమైపోయి హఠాత్తుగా చనిపోయాడు ఆ విచారంతో అతని గృహిణి సర్వమంగళకు కూడా ఏవో దీర్ఘరోగ చిహ్నాలు ప్రారంభమైనాయి ఆమె పరిస్థితి కూడా నానాటికీ తీసికట్టుగానే ఉంది అయినా మాతృగుప్తుడు చక్రవర్తి సేవలో ఏమరలేదు

అతడా చలిలో ఏవేవో ఆలోచనా పరంపరలలో మునిగి తేలుతూంటే తిరిగీ రివ్వన చలిగాలి వీచింది కవి చిరుగుల ఉత్తరీయం మళ్లీ గట్టిగా కప్పుకున్నాడు. ఆ ప్రయత్నంలో అది మరింత చిరిగింది. అతడొక్క నిట్టూర్పు విడిచి ఆ లేతవెన్నెలలో తారకావకుంఠనంతో సాగిపోయే విభావరి కేసి తిలకించాడు. ఆ విభావరి అతని భావనా నేత్రాలకొక రమణీ గాభిసారికగా భాసించింది. ఆ భావనతో అతని హృదయంలో కవితావాహిని పొంగి పరవళ్లు దొక్కింది.

౨

అలాగ మరికొంత కాలం గడిచిపోయింది. హర్ష విక్రమాదిత్య చక్రవర్తి తనరహస్యభవనంలో మహామాత్యునితో కలిసి రాజ్య వ్యవహారాల మంతనాలలో మునిగిపోయాడు అది కాశ్మీరరాజ్య వ్యవహారం. ఆ కాలంలో అది హర్ష విక్రమాదిత్య చక్రవర్తికి లోబడిన సామంతరాజ్యం. అయినా చాలావరకది సర్వస్వతంత్ర రాజ్యమే. అందువల్లనే ఆ కాలంలో కాశ్మీరరాజన్యులు చక్రవర్తి బిరుదంవహించేవారు. ఆరోజుల్లో హిరణ్యుడనే రాజు ఆ రాజ్యం పరిపాలిస్తూండేవాడు. అతని సోదరుడు తోరమాణునికీ అతనికీ మక్కెదురు! అంగువల హిరణ్యుడు తోరమాణునికి ఆజన్మ కారాగార శిక్ష విధించాడు. చిరకాలంగా అతడా కారాగారంలోనే కృశించి కృశించి చివరికొకనాడా దుఃఖంతోనే కాలధర్మం చేశాడు. అతని రాణి, ఏకైకపుత్రుడు ప్రవరసేనుడు ఆ దుఃఖాఘాతం భరించలేక తీర్థయాత్రకై వారణాశికి వెళ్ళిపోయారు. అటుపిమ్మట కొన్ని సంవత్సరాలకు హిరణ్యుడు కూడా క్రమక్రమంగా రోగగ్రస్తుడై స్వర్గస్థుడయినాడు. ఆ పరిస్థితులలో కాశ్మీర మహామాత్యుడే రాజ్యాధికారం చేపట్టి రాజ్య పరిపాలన సాగించవలసిన అవాంతరం ఏర్పడింది. అలాగ కొన్ని నెలలు గడిచినా కాశ్మీర రాజ్యం ఉత్తరాధికారి ప్రవరసేనుడింకా శ్రీనగరం చేరుకోలేదు. అంతలో అతని జ్ఞాతులు యశోవర్మ, విక్రమవర్మ ఆ రాజ్యాధికారం ఆపద్ధర్మదృష్ట్యా తమఒక్కరికే సంక్రమించవలెననీ, ఆవిషంగా ధర్మనిర్ణయం చెయ్యవలసిందనీ ప్రార్థిస్తూ హర్ష విక్రమాదిత్య చక్రవర్తికి వేరువేరుగా విజ్ఞప్తులు పంపించుకొన్నారు. ఆ ధర్మనిర్ణయమే చక్రవర్తికొక విషమ పరీక్షగా పరిణమించింది. కొంతగాఢంగా ఆ మథన పడిన తరవాత చక్రవర్తి మహామాత్యునితో ఇలాగన్నాడు:

"న్యాయంగా కాశ్మీర రాజ్యానికి ఉత్తరాధికారి ప్రవరసేనుడు. ఆయనకీ రాజ్యాధికారం విషయంలో ఇంతటి ఉపేక్ష ఏల?"

"అధికార విషయంలో ఆయన కంతటి ఉపేక్షాభావమేమీ లేదు కాని జనకులు తోరమాణులా విధంగా దుర్మరణం చెందడంతో సంసారంమీద విరక్తిచెంది తీర్థయాత్రకు వెళ్ళిపోయారు." అన్నాడు మహామాత్యుడు

"ఇంతవరకు శ్రీనగరానికి తిరిగి రాకపోవడానికి కారణం?"

"అదే నా కవగాహన కావడంలేదు. ఎప్పటికి తిరిగివచ్చేదీ కూడా నిశ్చయంగా తెలియదు"

చక్రవర్తి తిరిగీ కొంత గాఢంగా ఆలోచించి—

"మరి యశోవర్మ విక్రమవర్మల అర్హతానర్హత లెట్టివి?" అన్నాడు.

"ప్రవరసేనుల తరవాత కాశ్మీర రాజ్యానికి ఉత్తరాధికారులు వారే?"

"ఇద్దరూ ఎలాగ కాగలరు?"

ఇద్దరు సమాన దాయాదులే.

"మరి వారి ప్రత్యేక సామర్థ్యా లెట్టివి?"

"నా దృష్టికి యశోవర్మే సర్వవిధాలా సమర్థులని అనిపించింది."

చక్రవర్తికి నిర్ణయం రుచించలేదు. కొంతవరకు విక్రమవర్మే సమర్థుడేమో అని సూచించాడు. మహామాత్యుడు దానికేమీ సమాధానం చెప్పక కొంతసేపూరుకుని నెమ్మదిగా—

"చిత్తం! అలాగే నిర్ణయించవచ్చును" అన్నాడు. అంతేగాని ఆ నిర్ణయానికి అవుననిగాని, కాదనిగాని నిష్కర్షగా సమాధానం చెప్పలేదు

దానిమీద చక్రవర్తి నాలుగైదు నిమిషాల వరకు ఏమీ అనలేదు మహామాత్యుడు చక్రవర్తి ముఖభంగిమ పరీక్షిస్తూ—

"త్వరగా ఏదో ఒక నిర్ణయం చెయ్యకపోతే కాశ్మీరంలో కల్లోలం సంభవించవచ్చును!" అన్నాడు.

చక్రవర్తి దానికేమీ సమాధానం చెప్పలేదు. అలాగే ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూ పరిసరోద్యానం వైపు దృష్టి

కవి చక్రవర్తి

ప్రసరింపజేశాడు. ఆ ఉద్యానవనంలో అక్కడక్కడ వసంతర్తు సౌందర్య సూచనలు స్ఫురించాయి. ఎక్కడో మూల మూలల దాగిన ఒక కోకిల వచ్చిరానట్టుగా పంచమస్వరం ఆలాపించింది. అది వినగానే చక్రవర్తిముఖం ఒక్కసారి గావికసిరించిందిది. ఆ ముఖంలో డోలాందోళన భావం అంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. అటు పిమ్మట నెమ్మదిగా అడుగులు వేస్తూ అంతఃపురంవైపు వెళ్ళిపోయాడు.

3

మాతృగుప్తునిగృహిణి సర్వమంగళ రుగ్మత ఆరోజుకారోజుకు బాగా చెయ్యిదాటిపోయింది. మాతృగుప్తుడామె కనేకవిధాల చికిత్స చేయించగా చేయించగా కొంతవరకు ప్రాణభయం తప్పినదని అనిపించింది. అలాంటి విషమఘట్టాలలోకూడా అతడు తన సేవావిధులన్నీ నిర్వర్తిస్తూనేఉన్నాడు. అయినా చక్రవర్తికతని విషయంలో ఏర్పడిన అనాదరణలో మార్పేమీ గోచరించలేదు.

ఒకనాడతడుదయమే నిద్రలేచి కవితా వ్యాసంగంలో ఉండగా చక్రవర్తి కంచుకి అతనికెదురుగా ప్రత్యక్షమైనాడు. వెంటనే నిలుచున్నపాటుగా చక్రవర్తి సన్నిధికి రావలసిందని సవినయంగా విన్నవించాడు. మాతృగుప్తుడు తొందర తొందరగా తాతలకాలంనాటి కాశ్మీరశాలువపైన కప్పుగుని కంచుకితో కలిసి చక్రవర్తి సన్నిధికి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి తన రహస్య భవనంలో సింహాసనంమీద కూర్చుని దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. కొంతసేపటివరకు హర్షవిక్రమాదిత్యుడు కవి రాకకూడా గమనించలేదు. కవి అలాగే నిలబడిఉన్నాడు. చక్రవర్తి ఉపేక్షాదృష్టితో అతని ముఖభంగిమ గమనించి నెమ్మదిగా ఇలాగడిగాడు.

"మీరెప్పుడైనా కాశ్మీరం సందర్శించారా?"

"చిన్నతనంలో మానాయనగారితో కలిసి ఒకసారి కాశ్మీరాస్థానం సందర్శించాను."

"అయితే కాశ్మీరం మీకు సుపరిచితమే నన్నమాట!"

"చక్రవర్తీ! అది సాక్షాత్తు భూతల స్వర్గమే!" అన్నాడు కవి.

"నేనొక అత్యంతముఖ్యమైన దౌత్య వ్యవహారంలో మిమ్మల్ని వినియోగిస్తున్నాను."

ఈ దౌత్య వ్యవహారమేమైఉండునా అని కవి లోలోపల మథనపడ్డాడు.

"ఒక లేఖ మీ చేతి కందిస్తున్నాను. అది అత్యంత భద్రంగా తీసుకుపోయి కాశ్మీర మహామాత్యుల కందించాలి."

కవి అలాగే అత్యంత శ్రద్ధాభక్తులతో అతని మాటలు వింటున్నాడు.

"ఆ లేఖావ్యవహారం అత్యంత రహస్యం!" అన్నాడు చక్రవర్తి.

కవి నిర్ఘాంతపోయాడు.

"లేఖా రహస్య భంగానికి శిరశ్ఛేదమే శిక్ష!" అని ముగించాడు చక్రవర్తి.

మాతృగుప్తుడింకా ఆ ఆఘాతంలో నించి కోలుకోలేదు. కొంత సేపటివరకు అలాగే మాట్లాడకూరుకుని తలవంచుకొని అతి వినయంగా—

"చిత్తం! అలాగే! అయితే తమకింకా నామీద విశ్వాసం కలగలేదే అని కించపడుతున్నాను." అన్నాడు.

"విశ్వాసం కుదరకపోతే మిమ్మల్ని దౌత్యంలో వినియోగించే ఉండనుగదా! లేఖాప్రాముఖ్యం తెలుపుడు చెయ్యడానికే నేనింతగా నొక్కినొక్కి వక్కాణిస్తున్నాను. తక్షణం మీరు కాశ్మీరం వెళ్ళిపోవాలి!" అన్నాడు చక్రవర్తి.

"తమ ఆజ్ఞప్రకారం నేనీసాయంకాలమే కాశ్మీరానికి బయలుదేరి పోతున్నాను" అన్నాడు మాతృగుప్తుడు. వెనువెంటనే చక్రవర్తిదగ్గర సెలవుతీసుకుని స్వగృహానికి మరలిపోయాడు.

మార్గంలో అతనిహృదయంలోఎన్నెన్నో ఆలోచనావల్లికలల్లుకుపోయాయి. "చక్రవర్తికి దౌత్యం నిర్వహించడానికిక తగిన అధికారులెవరు లభించనేలేదా? ఇంతటి సామాన్య దౌత్యకృత్యానికి నేను తప్ప మరెవరు దొరకనేలేదా?" అని ఎన్నెన్నో విధాల మథనపడ్డాడు మాతృగుప్తుడు. అతని గృహిణి సర్వమంగళ ఆరోగ్యం ఇంకా కోలుకోనేలేదు. ఆమె అతని దృష్టికి చిక్కిశల్యమైపోయిన చంద్రరేఖలా స్ఫురించింది. కవి నెమ్మదిగా ఆమెకు తనకాశ్మీరప్రయాణ విషయం తెలియజేశాడు. ఎంతోకాలంనించి కాశ్మీరం చూడాలని ఉన్నదనీ తానుకూడా వెంటవస్తాననీ ఆమె పట్టుపట్టింది.

"ఇంతటి నీరసస్థితిలో నీవెలాగ రాగలవు సర్వమంగళా!" అన్నాడు మాతృగుప్తుడు.

"ఎప్పుడు మీరింతే! నన్నెప్పుడు వెంట తీసుకునివెళ్ళనే వెళ్లరు!" అన్నది సర్వమంగళ. తరవాత బుడిబుడి దీర్ఘాలు ప్రారంభించింది.

అంతటి అనారోగ్యస్థితిలో ఆమెను విడిచిపెట్టి కాశ్మీరం వెళ్ళడం అతని కిష్టంలేదు. అయినా వెళ్లక తప్పదు!

"మళ్ళీ ఒక మాసంలోపుగానే తిరిగి వచ్చేస్తాను. అప్పుడు తిరిగీ మనమిద్దరము కాశ్మీరం వెడదాము" అని అతడామె నోదార్చాడు.

"మీరు మళ్ళీ వచ్చేసరికి నేను బ్రతికి ఉంటేగా!" అని ఆమె అతనికేసి జాలిగా చూసింది. వెంటనే ఆమె కళ్లల్లో కన్నీరు మున్నీరుగా ప్రవహించింది. ఆమాట అతనికి శుభసూచనగా స్ఫురించలేదు. అయినా ఎంతో ఆప్యాయంగా ఆమె నోదార్చి, ఆమె చికిత్సకు, గృహ నిర్వహణకు తగిన సౌకర్యాలేర్పాటుచేసి మాతృగుప్తుడు కాశ్మీరానికి ప్రయాణమైనాడు.

అతడు కనిపించినంతవరకు ఆమె అలాగే నిశ్చలంగా అతనికేసి చూసింది. ఆ కనుచూపులోనే ఆమె ప్రాణాలన్నీ నిలబడ్డాయి. ఆ దృష్టి కవి హృదయం చీల్చివేసింది. మాతృగుప్తుడు జీవచ్ఛవంలా అడుగులు వేసుకుంటూ అక్కడినించి కదిలి వెళ్లిపోయాడు. కాశ్మీరానికి అతి త్వరితంగా వెళ్ళిపోవడానికి వీలుగా అతనికి గజాశ్వాందోళికాది వాహనాలెన్నో ఏర్పాటు చేశారు. చక్రవర్తి తలుచుకున్నప్పుడిలాంటివాటికేమి కొదవ! కాని అతని ప్రయాణ సన్నాహం తిలకించిన ఉజ్జయినీనగర పౌరులందరు "చక్రవర్తి ఎంతటి కఠినాత్ముడు! సామాన్య రాజ్యాధికారులు నిర్వహింపవలిసిన దౌత్య వ్యవహారమేదో కవీశ్వరుని నెత్తిమీద పడవేయడం ఏమి న్యాయం! ఏమైనా మాతృగుప్తుడు చాలా దురదృష్టవంతుడు!" అని తలకొక విధంగా చక్రవర్తిని నిందించారు. మాతృగుప్తుడా అవమానభారంతోను, గృహిణీ చింతతోను కుంగిపోతూ క్రమక్రమంగా కొంత కాలానికి కాశ్మీరదేశం చేరుకొన్నాడు.

౪

కాశ్మీర సౌందర్యం తిలకించేసరికి మాతృగుప్తుని ప్రయాణఖేదం చాలావరకు సన్నగిల్లిపోయింది. నిర్మల స్వచ్ఛ జలాలతో కలకలలాడే సరోవరాలు, దూర దూరంగా స్ఫురించే ధవళ హిమవన్నగశిఖరాలు సందర్శించేసరికి అతని హృదయం నిశ్చలమానస సరోవరంలా కలకదేరింది. దానిలో సర్వమంగళ సువర్ణ విగ్రహచ్ఛాయచాయగా ప్రతిఫలించినట్లయింది.

శ్రీనగరం చేరుకోవాలంటే అతడింకా చాలాదూరం ప్రయాణం చెయ్యాలి. అలాగలాగ కొంతదూరం సాగిపోగా తలవని తలంపుగా అతనికొక అదృష్టం కలిసి వచ్చింది. కాశ్మీర మహామాత్యుడు అనతి దూరంలో ఒక సమీపనగరంలోనే ఉన్నాడనీ రాజ్యవ్యవహార పర్యవేక్షణ నిమిత్తం అక్కడికి వచ్చాడనీ తెలిసింది. మాతృగుప్తుడు శ్రీనగర ప్రయాణం మానివేసి తిన్నగా ఆ సమీపనగరానికే ప్రయాణమై రెండురోజులలోనే ఆ నగరం చేరుకొన్నాడు.

మహామాత్యుని విడిది చేరుకోగానే హర్ష విక్రమాదిత్యచక్రవర్తి దూత దర్శనానికై వేచిఉన్నాడనీ తక్షణమే దర్శనం ఇప్పించవలసిందనీ ప్రతిహారుల ద్వారా సందేశం పంపించాడు.

మహామాత్యుడా సందేశం వినీ వినగానే ద్వారందగ్గరకు వచ్చి సగౌరవంగా మాతృగుప్తుని తన రహస్యభవనంలోనికి తోడుకుపోయాడు.

కవికి అక్కడ మహామాత్యుడే కాక కొంతమంది సైన్యాధిపతులు, దండనాయకులు మొదలైన ఉన్నతాధికారులు కూడా కనిపించారు. వారందరి సమక్షంలోను కవి చక్రవర్తి తనకిచ్చిన సువర్ణపేటిక సగౌరవంగా మహామాత్యునికి సమర్పించాడు. అది చక్రవర్తి ముద్రాంకితమైన స్వర్ణపేటిక. చక్రవర్తి తన లేఖ అతిజాగ్రత్తగా దానిలో భద్రపరిచాడు.

మొదట మహామాత్యుడా లేఖ చదువుకొన్నాడు. చదువుతూనే నిలువునా నిర్ఘాంతపోయాడు! అలాగ కొంతసేపుండి తరవాత అది ఇద్దరుముగ్గురు దండనాయకులకు కూడా చూపించాడు. వారు మొట మొదట తమ కన్నులే నమ్మలేకపోయారు! మాతృగుప్తుడక్కడ చక్రవర్తిదూతకుచితమైన ఒక సింహాసనంలో కూలబడిపోయి ఒక వేడినిట్టూర్పు విడిచిపెట్టాడు.

మహామాత్యుడు సవినయంగా అతనిని సమీపించి సగౌరవంగా ఇలాగడిగాడు:

"తమరేనా మాతృగుప్తులు!"

(55-వ పేజీ చూడండి)

నన్ను మార్చిన మమత

గడియారం ఎనిమిది గంటలు కొట్టింది... తెల్లవారిందనిపించింది......

'లేవండీ! మీరు లేవక పోవడం వల్ల ఈవేళ పనులన్నీ ఎలా ఆగిపోయాయో చూస్తున్నారుగా' అంది ఉష. నేను సిన్సియర్‌గా నిద్రపోవడం లేదని ఉష గ్రహించింది. హతోస్మి!

'ఇక లేచి తీరవలసిందే' అనుకున్నాను. కాని లేవ బుద్ధికాలేదు.

కొద్దిగా కళ్లు తెరిచి "ఆదివారం కదూ. హాయిగా నిద్రపోనిద్దూ. బంగారు తల్లివి కదూ" అన్నాను. "ఆదివారం కాఫీకి సెలవు రోజు కాదుగా. అప్పుడే ఏడుసార్లు కుంపటి మీంచి దించెయ్యడం, తిరిగి ఉంచడం జరిగాయి. లేవండీ ఎవరేనా చూస్తే బాగుండదూ" అంది ఉష. లేవబోతున్నాను. నేను కొంచం చురుకుగా కదులుతాననుకుందేమో "అన్నట్లు ఈవేళ మీ పుట్టిన రోజు" అంది ఉష.

నేను తిరిగి మేనువాల్చి 'అయితే ఇంకేం! ఈవేళ కన్సెషన్. మరోగంట పడుకుని...." అన్నాను ఉత్సాహంగా.

"పుట్టిన రోజున చక్కగా ముస్తాబై ఊరంతా తిరగాలి స్నేహితులతో కలిసి ఇలా మొద్దబ్బాయిలా..." "ఉషా! నుప్ఫై ఏళ్ళ క్రితం, సరిగా ఇదే రోజున సృష్టికర్త చేయకూడని పాడుపని ఒకటి పొరపాటున చేశాడు. ఈ రోజుకి పెద్ద ప్రాముఖ్యం

'జ్యేష్ఠ'

అంటకట్టడం బాగుండలేదు" అన్నాను. ఉష విసుగెత్తి చివరి ప్రయత్నం చేసింది. "ఛీ! అవేం మాటలండీ. మీరు నా కోసమే పుట్టారు కదూ! లేవండీ" ఓర్పు విషయంలో స్త్రీ జాతిదే పైచేయి. 'ఈ పాడు పెరపంచకాన్ని' అనది కనుక భూదేవి మోస్తోంది. అదే ఎవరేనా మగవాడి నెత్తిన పెడితే వాడు ఈ భూగోళాన్ని ఎత్తికి విసిరి చేతులు కడుక్కునేవాడే.

ఉషని లోలోపలే అభినందిస్తూ, నా దురదృష్టాన్ని నిందించుకుంటూ లేచాను. ఉష విజయోత్సాహంతో గబగబా నడిచి టూత్ పేస్టు, బ్రష్, నీళ్లూ అన్నీ అమర్చింది......

"అమ్మాయీ! లేచాడమ్మా?" అంటున్నారాయన పేపర్లోంచి తల పైకెత్తి. ఆయన ఉష మేనత్తకొడుకు తోడల్లుడి పినతండ్రికి బావ అవుతారు. ఆయనకి నా అలవాట్లమీద అకారణ మమకారం జనించినట్లుంది. ఎవరిలోనైనా హేళన చేయడానికి తగిన వస్తువు కనిపిస్తే చాలు బెల్లంచుట్టూ చీమలు మూగినట్టు తయారౌతాయి కుశలప్రశ్నలు! "ఏమోయ్! రాజేశ్వరావ్! మీ కాదివారం ఆఫీసుండి కేవిటి?" ఆయన ఎంతో ఆప్యాయంగా అడిగేరు. ఏవిటా ప్రశ్న! "ఉండ.. ఉండదండి" అన్నాను తర్వాత పడే అశనిపాతం ఏమిటో ఊహించ ప్రయత్నిస్తూ.

"నేనూ అదే అనుకున్నానులే. ఉంటే ఇంత ఆలస్యంగా ఎందుకు లేస్తాడూ అని కూడా అనుకున్నా" అన్నారాయన. అసలు అనదల్చుకున్నది కొరడాతో కొట్టినట్లు ఎంత నేర్పుగా అంటించాడూ! ఇవన్నీ లెక్కచేస్తే బతికినట్టే.

వీళ్ళ నేర్పు ఇలాగే ఉంటుంది. ఒక తను పంచె కట్టుకున్న తీరు చూస్తే ఎవరికేనా వెంటనే చచ్చే నవ్వొచ్చే మాట వాస్తవమే. కాని ఆ విషయమే సూటిగా ప్రస్తావిస్తే బాగుండదని ఈయనే ఆ అమాయకుణ్ని "నాయనా! నువ్వెప్పుడూ పంచలే కడతావా? లేక పాంట్లు వేస్తావా" అని అడిగాడు. అతనికే ప్రశ్నలో అంతర్యం బోధపడక "సాధారణంగా పేంట్లే వేస్తానండి అన్నీ లాండ్రీలో.. అంటుంటే "నీ పంచె కట్టుకున్న తీరు చూసి నేనూ అదే అనుకున్నాన్లే" అన్నాడీయన. అది విని అందరూ సుఖంగా నవ్వుతున్నారు. ఇప్పుడదే తెలివిని నా మీద ప్రయోగించాడాయన.

ఆయన తన ఉద్యోగనరకపు మధుర స్మృతులు మనోవీధిలో నర్తించగా కొద్దిగా నవ్వేరు. "అప్పుడు మా ఆఫీసులో కల్లా నేనే చిన్నవాణ్ణి" అని ప్రారంభించారు. నాకు చిన్ననాటి నుంచీ "బద్ధకావతారం" అనే

బిరుదు ఉండనే ఉంది. కాని ఆయన ఉపన్యాసపు చురుకుల్ని, చెణుకుల్ని తలుచుకోగానే చురుకుపుట్టి పెరట్లోకి పరుగెత్తాను, దంతధావనపరికర సహితంగా. అక్కడికీ ఏమాత్రం ప్రమత్తతతో ప్రవర్తించినా ఆయన తరుముకొచ్చే ప్రమాదం ఉందని గుర్తించి రాతి మెట్టుమీద కూర్చొని భక్తి ప్రపత్తులతో పళ్లుతోమడం మొదలుపెట్టాను. అంత ఏకాగ్రతతో దంత ధావన చేయడం నా జీవితంలో అపూర్వం. ఏపాత పేపరో చదువుకుంటూ, పళ్లుతోముకోడం నేను సాధారణంగా చేసే పని. అదేమి అదృష్టమో కాని ఆసమయంలో నేను కలల్లో కూడా ద్వేషించే రాజకీయాల మీద ఎక్కడలేని ప్రేమా పుట్టుకొచ్చేది. వార్తలు చదువుతూ ఒళ్లు మరిచేవాణ్ని. అంతర్జాతీయ వ్యవహారాల మధ్య, పళ్లుతోముకోడం ఓ అల్పవిషయమై కూర్చునేది. బ్రష్ నిద్రపోయేది. కాని ఈ రోజున ఆ పెద్ద మనిషి అధర్మమాః అని......

నేను...అంటే మిస్టర్ రాజేశ్వర్రావ్ టూత్ బ్రష్‌తో అలా సతమతమౌతుంటే తెలుపుసందునుంచి, ఆ దృశ్యాన్ని కనులారగాంచి ఆనందించిన మాస్టర్ రాజేశ్వర్రావ్ మిసెస్ రాజేశ్వరరావ్‌తో ఇలా అంటున్నాడు. "అమ్మ ఈ వేళ మనింట్లో ఓ అనర్థం జరిగింది" అన్నం వారుస్తున్న ఉష "ఏమిట్రా అది?" అంది. "నాన్న శ్రద్ధగా చమటలు కక్కుతూ పళ్లు తోముతున్నాడు. కాస్త ఓవల్టీనేనా ఇయ్యవే" అని, సకాలంలో హెచ్చరించి తన కర్తవ్యం నిర్వహించుకున్నాననే ధీమాతో వాడు దర్జాగా వెళ్లిపోయాడు వీధులు సర్వే చేయడానికి.

వాడు ఈ విషయంలో ఉత్ప్రేక్షు ఎందుకు వాడాలీ అని కోపం వచ్చేసింది. రచయిత అన్న అపకీర్తి నాకు ఉండనే ఉంది. పదిహేనేళ్లనుంచీ. "నీ కథలు పడుతున్నప్పట్నుంచి పత్రికల అమ్మకం తగ్గిపోతోందిరా" అని వాపోతూ ఉంటారు నా మిత్రులు. "అంటే వాటివిలువ హెచ్చిందన్నమాట. పరిమాణం తగ్గిందంటే ప్రమాణం హెచ్చిందని 'అర్థం అది మీకూ తెలుసు" అంటాను. వాళ్లు ఒప్పుకోకపోతేనేం అలాగే అంటూంటాను మరి. దానికేంగాని...'విద్యాసాగర్ కూడా ఓ రచయిత అయిపోతాడన్న ఊహ నా మనస్సులో మెదలడం, నా ఎడంకన్ను అదరడం ఏకకాలంలో జరిగాయి.

"కాఫీ! కాఫీ" అని ఘోషిస్తోంది నాలో ప్రతి అణువూను. ఒక కప్పుతో దేశదుర్భిక్షహేతువైన ఆ అమృతాన్ని (నావులేనిది) సేవించి, తడిముఖం తుడుచుకుని రెండోకప్పు పరిగ్రహించ నుద్యుక్తుణ్ణౌతుండగా ఆయన పిలిచారు. పిల్లిలా ఆ గదిలోకి నడిచాను. "నాయనా! నాకు ఆత్మకథ వ్రాసే (May God Forbid!) అదృష్టం పట్టే సూచనలేం కానరావు. కాని నా నియమబద్ధమైన జీవితం మీ అందరికీ మార్గదర్శకం అవుతుందన్న ఆశతో మీ కిష్టం ఉన్నా లేకపోయినా చెప్పేస్తున్నా." అన్నారు. నేను మర్యాదకైనా 'చెప్పండి' అనలేదు. ఇంట్లో వస్తువులంటే చాలా శ్రద్ధ ఉన్నట్లు, ఎంతో బాధ్యత వహిస్తున్నట్లు కాళ్లు తుడుచుకునే పీచునుద్దేశించి "దీన్ని ప్రతీవాళ్లూ తొక్కేయడమే. చూడు ఎలా దుమ్ము కొట్టుకుపోయిందో!" అన్నాను. ఉష కిలారున నవ్వింది అది విని. "అది...అది...కాళ్లు తుడుచుకునేందుకే కొన్నాం. తలగడగా వాడుకునేందుకు కాదు. దుమ్మంతా మీరు తెచ్చిపెట్టిందే" అంది మధ్యమధ్య నవ్వుతూ.

అదేం అదృష్టమో గాని నేను ఇంట్లో ఏ పనిలో వేలుపెట్టినా అది హాస్యాస్పదంగానో, అనర్థదాయకంగానో తయారవుతుంది. నాకీరోజున ఆపీచు యోగక్షేమాల మీద అంత శ్రద్ధ కలగడమేమిటి! ఉష దెప్పి పొడవడానికి వీలు కలిగింది. (నేను ఒకరోజున రాత్రి ఆఫీసుఫైళ్ళమీద "హోం వర్కు" చేస్తూ ఆ బద్ధకంలో కాళ్ళు తుడుచుకునే పీచుమీద తల వాల్చి గుర్రుకొట్టిన మాట నేను కాదనలేను)

నాకు ఏ పనిలోనైనా ఏకాగ్రత సున్న అని ఆయనకు బోధపడి వుంటుంది, తన ఉపన్యాసాన్ని ద్విగుణీకృతోత్సాహంతో కొనసాగించారు. "తెల్లవారు ఝామున నాలుగు గంటలకే లేచేవాణ్ని. గంటలో స్నానాదులు పూర్తయ్యేవి. ఆహా!—ఆ ప్రశాంత నిశాంత సమయంలో ఎంత మధురంగా వుండేది జీవితం—" ఆయన ఆనందం కనపర్చలేక ఉక్కిరి బిక్కిరౌతున్నారు. వెర్రి మేస్టారు అదే చెప్తారు. వేమనా అదే చెప్తాడు. కాని నీతులా నన్ను మార్చేది.

"తెలుపుసందుల్లోంచి సూర్యుడు వచ్చే సూడుల వాడినిబట్టి ఎనిమిది దాటి ఎంతసేపైందో అంచనా వేయ ప్రయత్నించడం "ఆఫీసు ఫైళ్ళు అలా పరిశుభ్రంగా ధవళవర్ణంతో భాసిస్తున్నాయి. ఇంటివద్ద కూడా నిద్రేనటయ్యా!" అని ఆఫీసరు అడగబోయే ప్రశ్నకు పరువుమీదే సమాధానాన్ని వెతకడానికి కృషి చెయ్యడం, మధ్య మధ్య ఎవరేనా లేపడానికి వస్తే కళ్లు మూసుకుంటూ ఉండడం...వీటిల్లో మజా మీకేం తెలుసులెండి!" అనుకున్నాను.

ఆయన చాలాచాలా చెప్పేరు. 'స్టాప్ వాచీ' చేతిలో ఉంచుకుని తనెలా ఆఫీసుకు వెళ్ళేదీ, ఒక్క క్షణం నిద్రపోకుండా తనెలా పనిచేసిందీ, తనని ఆఫీసరు ఎలా చీవాట్లు పెట్టిందీ ఆయన అభినయంతో సహా వివరించారు...అలా ముప్పై ఏళ్లు క్రమబద్ధంగా పనిచేశారాయన. కర్తవ్య నిర్వహణంలో ఆయన శ్రద్ధాసక్తులు చూసి ఎంతయు సంతసమంది సర్కారువారు బహుమానంగా "ప్రమోషన్" అనేది లేకుండానే ఆయనకు పింఛనిచ్చారు. అదో జాలి గాథ.

హఠాత్తుగా తోకతొక్కిన తాచులా లేచారాయన (కోపం కాదది! తొందర) "అబ్బాయి ఏదో!...మిమ్మల్ని చూడాలనుకున్నాను. చూశాను. మరి వెళ్లాలి. ఇప్పుడే బండి ఉంది?" అన్నారు. "ఆరుగంటలబండి ఉందండి" అన్నాను. "వెళ్లిపోవాలమ్మా. ఏం చేయను" అని ఆయన వెళ్ళిపోయారు...

ఉష వంట ఇంట్లో తన ఆదర్శాలను, లక్షణాలను ఒక్కటి పోనీయకుండా పుట్టిన విద్యాసాగర్‌తో చెప్తోంది. "తాతగారు ఎలా ఉండేవారో విన్నావా? నువ్వుకూడా ఆయనలాగే నాలుగు గంటలకి లేవాలి రోజూను" దానికి వాడు దిగులుపడి ఉండాలి, కాని పైకి మాత్రం "మెళుకువ రాదేమో" అన్నాడు. నేను గుండెలు చేత్తో పట్టుకొని వింటున్నాను. "నాన్నని అలారం టెంపీసుకొనమందాం. గ్లాసుపట్టు; అన్నం తినగానే మంచినీళ్లు తాగాలి" అంటోంది ఉష. "నాన్న తాగడేం" అని గొణుగుతూనే విద్యగాడు నీళ్లు తాగి లేచాడు.

నన్ను మార్చిన మమత

ఇప్పుడీ మాతాసుతులు ఏకలక్ష్యంతో ద్విముఖ దండయాత్ర సాగిస్తే ఈ జీవుడు ఓ పట్టాన బైటపడడం అసాధ్యం అని గ్రహించాను. నిన్ననో మారు కూరగాయల మార్కెట్‌కు వెళ్ళాలెనంది ఉష. ఈ అవకాశం జారవిడుచుకోకూడదనుకున్నాను. కూరలసంచి తీసుకుని వీధిలో పడ్డాను. ఎకాఎకిని గాంధీ బొమ్మదాకా 'లెఫ్ట్ రైట్' కొట్టి టక్కున ఆగాను—ఏం కూరలు తేవాలి? ఎంతెంత తేవాలి. ఉషకు కోపం తెప్పించగల పుచ్చువంకాయల (ఏరి కోరి ఎన్నిక చేసినవి) కనీసప్రమాణ మెంత? విద్య బీరకాయలలో చేదు ఎంతవరకుభరించగలడు?—ఈ ప్రశ్నలు నన్నెదుర్కొన్నాయి ఏం చెయ్యను? ఏడుపొచ్చింది. ఉసూరుమంటూ ఇంటి మొగం పట్టాను.

దారిలో 'పండఘరుడు' తారసిల్లాడు. వాడు చేతికర్ర పైకెత్తి 'గుడ్‌మార్నింగ్ రాజేశ్! ఈ వేళ నీ బర్త్‌డే కదూ బెస్ట్‌విషెస్' అన్నాడు. 'టీ పార్టీ చేయమంటాడు కాబోలు దైవమా!' అనుకున్నాను. అప్పుడే నా పర్సు (దాదాపు ఖాళీది) టీలో కరిగిపోవడం నా ఊహాపథంలో మెరిసింది. వీడికెలా తెలిసింది ఈ కరువురోజుకీ, నాపుట్టుకకీగల సంబంధం? వాడు తెగవాగాడు. ఆఖరికి "ఉషని నీఅదృష్టంకొద్దీ సంపాదించుకున్నావురా!" అన్నాడు. వాడు అప్పుడే మా ఇంటిని పావనం చేసి ఉషఇచ్చిన కాఫీసేవించి వస్తున్నాడన్న మాట! దేవాంతకుడు అని సంతోషించాను. వాడు వాచీ చూసుకుని తుపాకిదెబ్బతిన్న వాడిలా "వెళ్ళొస్తా" అని వెళ్ళాడు...విడివడి మరేడకో, వడివడి మరేడకో.

ఇంటికెళ్ళాక ఎక్కడకు దయచేశారు? అని ఉష అడిగితే ఏంసంజాయిషీ ఇచ్చుకోవడం? అందుచేత ఏ యే సినీమాలు ఏ యే హాలుల్లో ఏ యే వారాలలో ఆడుతున్నదీ క్షుణ్ణంగా తెలుసుకుని అవే వల్లిస్తూ ఇంటికెళ్ళాను ఉష మాట్లాడేందుకు వీలు లేకుండా 'ఈ వేళ మేటినీకి వెళ్దాం' అన్నాను.........

మూడుగంటలకి అశోకాటాకీస్ పరిసరాల్లోగల మురికికాలువ పక్కని నిలబడి ఉండాలని ఉష నిర్ణయం. ఆ మురికికాలువ వెలువరచే సుగంధం ఉత్తేజకరంగా ఉంటుందనీ, ఆ సువాసనే లేకపోతే నేను ఎంతసేపైనా టికెటు తీయకుండా సినీమాకి వచ్చే సీతాకోక చిలుకల సౌందర్యావలోకనంలో మునిగిపోవడం తథ్యమనీ ఉషవిశ్వాసం. నిజం చెప్పాలంటే ఆ మురికికాలువ ఎంతటి బద్ధకస్తుణ్ణైనా ఉత్సాహపూరితుణ్ణి చేస్తుందనాలి.

నేను ఒంటిగంటన్నరకే తయారయ్యాను. మన దినచర్యలో ఏది వృథాఅనుకుంటామో అదే మనకు సంతోషం, శాంతి ఇస్తుంది. నేను నిత్యం తేనెటీగలా బిజీగా ఉన్నాననుకోండి—అహ అనుకోండి, ఉన్నానని కాదు—అప్పుడు సౌందర్యం మొదలైన వాటిని గురించి ఆలోచించడానికి వ్యవధెక్కడుంటుంది? చిన్న సెంటు సీసా గదిలో గాలిలో ప్రతి అణువునీ సుగంధపూరితం చేస్తుంది. అలాగే ఒక మధురభావం తన చుట్టుపక్కల ఉన్న ప్రతీ ఆలోచననీ తియ్యగా చేస్తుంది. నాపుట్టిన రోజును గూర్చిన ఆలోచనలలో తేలిపోయాను.

నా మొదటిపుట్టినరోజూ-నన్ను చూసి నా తమ్ముళ్లూ, చెల్లెళ్లూ పొందినఆనందం—అరే! వాళ్లప్పటికి పుట్టి ఉండరుగా—ఇలా సమయాన్ని సంహరిస్తున్న సమయంలో ఉష ఏంచేస్తోందో నన్న ఆలోచన వచ్చింది పెరట్లోకి పరుగెత్తాను...ముత్యాల లాంటి నీటి బొట్లు తడిసిన ముంగురులనుంచి రాలుతుంటే లోపలికొస్తోంది ఉష

"ఇంకా నీకు చాలా ఆలశ్యముందన్న మాట! నన్ను బద్ధకస్తుడంటావు"-అన్నాను. ఉష హేళనగా ఇకిలించింది "ఏం తెమిలారండీ! అసలు పని ఉండనే ఉంది"అంది. "ఏమిటది?" అన్నాను. డబ్బండీ! డబ్బు. సినిమాకి డబ్బు అంది నాకు గట్టిగా అరవాలనిపించింది. నెలకి ముప్ఫై రోజులుండాలి కాబోలు ఇరవై ఉంటే చాలదూ. ఇంకా ఆరు రోజుల్దాకా జీతంరాదు.

నేను మొదటిసారిగా క్రమబద్ధంకాని జీవితాన్ని గడిపినందుకు పశ్చాత్తాపపడ్డాను. నియమాల నేవీ లేకుండా ఇన్నాళ్లూ బతికినందుకు నన్ను నేను మనసారా తిట్టుకున్నాను. నేను ఇందాకటి బంధువులా తెల్లవారకుండా లేచి ఉంటే ఏ ఎక్. జి. వో. కో నాస్నేహాన్ని జ్ఞాపకంచేసి ఐదో పదో సంపాదించడానికి వ్యవధి ఉండేది. సినిమా ప్రోగ్రాం చిత్తైపోయింది విద్యగాడు నిద్రపోతున్నాడు. లేచి ఏం హంగామా చేస్తాడో.

గడియారం మూడు మార్లు మొట్టింది. డబ్బుంటే ఇప్పుడెక్కడ ఉండేవాళ్లం! మురికాలవ పక్కన 'క్యూ' లో జనసంఖ్యని అంచనా వేస్తూ...వాల్ పోస్టర్లు చదువుతూ... మేకప్‌లో అందాన్ని ఆస్వాదిస్తూ...ఎడిసన్‌ని తల్చుకుంటూ. ఇప్పుడు ఏడుస్తూ ... పుట్టిన రోజుని ఇంత బాధాకరంగా గడుపుతూ...తల ఎత్తడానికి సిగ్గపడుతూ...ఛీ...

"నేనింతవరకు సాధించిందేమిటి?" డైరీ తీశాను. మొదటి పేజీలో x జి బి జి గా రాసుంది! నా డైరీలు ఎలాగూ లోకానికి ఉపయోగపడవు. ఎందుకంటే నేను మహావ్యక్తిని కాలేను. (నా ఎత్తు అయిదడుగుల రెండంగుళములు మాత్రమే) నామీద నాకే అపూర్వమైన జుగుప్స కలిగింది.

ఆలోచిస్తూ చాపమీద పడుకున్నాను. ఉష ప్రక్కనే కూర్చుంది.

"ఏమండీ! తల నొప్పిగా ఉందా.... అమృతాంజనం రాస్తే ... మాట్లాడరేం... మిమ్మల్నే ... ఓహో అదా ... పోన్లెండీ వెధవ సినీమా...అందుకోసం ఇంత బాధ పడతారా...ఆ సినీమా ఏం బాగుండలేదుట...?" నోరు నొప్పెపుట్టి ఉష మాట్లాడలేదు.

ఉషని చూస్తే జాలి కలిగింది నా దినచర్య అంత వంకరటింకరగా ఉన్నా ఉష ఒక్కనాడూ చీదరించుకోలేదు ఆలస్యంగా లేచి కాఫీ తాగుతూ భోజనం చేసినా ఏం విసుక్కోలేదు...రాత్రి పది గంటలకు స్నానం చేస్తానన్నా వేణ్ణీళ్ళు కాచి ఇచ్చేది...తొమ్మిది గంటలవరకూ నిద్రపోయి ఇప్పుడేం బజారుకెళ్ళను అంటే ఓ చిరునవ్వు నవ్వి పక్కింట్లో అప్పుతెచ్చి అన్నీ ఆఫీసు వేళకు అమర్చేది నా పాలిట దేవత నేను పాడైపోతున్నా నా ఆటలన్నీ సాగనిచ్చింది. కావంటే నేను బాధ పడ్తానేగా ఇక ఆమె ఇష్టానుసారం కానివ్వాలనుకున్నాను.

"ఇహిహ్హీహిహి! టైం టేబిల్ వంటింట్లో కడతారా!" విద్య నా దినచర్య కాగితాన్ని చూసి నవ్వుతున్నాడు నేను కళ్ళు తెరిచేటప్పటికి నేనే రాత్రి ఆ కాగితం అంటించాను

నిజానికి ఆ టైంటేబిల్ ప్రకారం నేనీపాటికి స్నానాదులు ముగించి న్యూస్ పేపరు చదువుతూ ఉండాలి...ఇంకా మంచం దిగలేదు. "ఇక నేను మారేదేమిటి?" అనుకున్నాను. ఆ ఉద్దేశంతో నిద్రని పొడిగిద్దామనుకుంటున్నాను...

"విద్యా! స్నానం చెయ్యమ్మా!" ఉష అంది. చెయ్యనన్నాడు విద్య. "తప్పు. చూడమ్మా, ఆ కాగితంలో ఏముందీ"

"ఏముంటే నేం. ఇందులో ఆరు గంటలకు లేవాలనుంది. నాన్న ఇంకా లేవలేదు. నాన్న పదింటికి స్నానం చేస్తాడు. నేనూ అప్పుడే..."

నా గుండెలు ఝల్లుమన్నాయి. ఇన్నాళ్ళూ నేను వక్రంగా నడిచి విద్యని కూడా వక్రమార్గంలో నడిపిస్తున్నాను. ఇక అలా జరగడానికి వీల్లేదు.

"నాన్నా నువ్వు పావుగంట ఆలస్యంగా లేచావు. పది గుంజీలు తియ్ ఒకటి... రెండూ...ఎనిమిదీ" ఉష నవ్వుతోంది. విద్య గెలుస్తాడని తెలుసు ఉషకి! ★



10

కొన్ని మాసాలు గడిచిపోయాయి—

సర్వజయ భువనముఖర్జీగారి నూతికి నీళ్ళకి వెళ్ళొచ్చింది. వెనకాలే ఆమె కొంగు పట్టుకుని అపూ కూడా వచ్చాడు. సర్వజయ అరుగుమీద బిందె దింపి, "నా కొంగు పట్టుకుని కూడాకూడా తిరుగుతున్నావేమిటి? ఎందుకో చెప్పు. ఇంట్లో పనికానియ్. తరవాత ఏటికి వెడదాం. ఇంట్లో పనులు చూసుకో వద్దంటావా?" అన్నది.

"పనులు ఆనక చేసుకో కూడదేం? ముందు ఏటికే వెడదాం" అని, ఆ పైన చల్లగా తల్లి సానుభూతి సంపాయించటానికి "అయితే నాకేం ఆకలీ, అదీ ఉండదనుకున్నావా? పాలుగరిటెఝాల్నుంచి ఏమీ తిననేలేదు" అన్నాడు.

"తినకపోతే నేనేం చేసేది" ఎండలో తిరిగి తిరిగి జ్వరం తెచ్చుకుంటావ్ కాని నేను చెపితే వింటావా ఏమన్నానా? చేతులో పనికానియ్, వస్తాను. నేనేం ఊరికే కూర్చోలేదు. వెళ్లు. అలా పెంకితనం చెయ్యకు నీ పురమాయింపుల ప్రకారం నే నెక్కడ చెయ్యగలను?"

అపూ తల్లి కొంగు విడిచిపెట్టకుండా, ఇంకా గట్టిగా పట్టుకుని, "ఏమైనా సరే నిన్ను పనిచేసుకోనీయను. రోజూ చేసుకుంటూనే ఉంటావుగా పనులు, ఒక్క రోజుకి మానెయ్యకూడదా యేం మహా? ఇప్పుడే రావాలి ఏటికి — ఇంక నేనేం చెప్పినా వినను...నువ్వు ఎలా చేసుకుంటావో చూస్తాను" అన్నాడు.

సర్వజయ కొడుకు కేసి చూసి నవ్వుతూ— "అలా మొండితనం చెయ్యకురా మరి! ఛా ఇదుగో, అయిపోయింది, ఎంతసేపు ఇహ! ఒక్క నిమిషం ఓపిక పట్టు. ఏటికే వస్తాను, మళ్లీ చప్పున వచ్చేసి, అన్నమూ వండుతాను. పెంకితనం చేస్తారా ఎక్కడైనా! కొంగు విడిచిపెట్టు. పొట్లకాయ నీకిష్టంగా! ఎంత కూరకావాలి చెప్పు అయినా?" అన్నది.

ఇంకొక గంటలో అపూ ఎంతో సంతోషంతో అన్నం ముందు కూర్చున్నాడు.

గ్లాసు ఎత్తుకుని సగం నీళ్లు గడ గడ త్రాగేసి, తర్వాత ఇంకో రెండు ముద్దలు తిని, కొంతపారేసి, ఆ మిగిలిననీళ్ళు కూడా త్రాగేసి లేచా డక్కడినుంచి

"ఏదీ, ఏంతిన్నావ్ నీమొహం! అన్నం అన్నం అని ఊపిరాడ నివ్వలేదు. పొట్లకాయో అని ఒట్టిరంధేకాని, వేసిన కూరంతా పారేశావ్! ఏం తింటావ్ ఇంకమరి?"

సర్వజయ అన్నంలో కాసిని పాలుపోసి కలియపెడుతూ—"ఏదీ, నోరు తెరు - నీ తలకాయ ఓ పాలు అక్కర్లేదు, పరమాన్నం అక్కర్లేదు, ఎప్పుడూ ఒట్టి గొడ్డుమెతుకులు కావాలంటావు. రోజూ ఒట్టిఅన్నం తింటే, అడగక్కర్లా అబ్బాయితీరు. ముఖం పీక్కుపోతుంది. ఏంతిని బ్రతుకుదామని? బ్రతుకుదామనా, నా కడుపులో చిచ్చు పెడదామనా? అలాగే వుంది చూస్తే వరస. అలా మొహం పక్కకి తిప్పుకోకు. 'ఆఁ' అను. మంచివాడివికదూ! ఈ ముద్ద కాస్తా తినేస్తే

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరం పెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీ వింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది.

అనువాదం:

మద్దిపట్ల సూరి

★ పథేర్ పాంచాలి ★

అయిపోయినట్టే. మళ్లీ సాయంత్రం టునూ వాళ్ళ ఇంట్లో అమ్మవారి ఓలాడింపువుంది. చప్పచప్పన తినేసెయ్ మరి. మన మందరం వెడదాం అక్కడికి"—అన్నది.

దుర్గ ఇంటికి వచ్చింది. ఎక్కడెక్కడో తిరిగివచ్చిందాపిల్ల. కాళ్ళనిండా దుమ్ము. ముందరజుట్టు పాయ పీచు లేగిపోయింది. ఆ పిల్ల తన యిష్టంవచ్చినట్లు తిరుగుతూ ఉంటుందెప్పుడూ. మళ్లీ ఇరుగుపొరుగున తన ఈడు పిల్లలతో కలిసి అంతగా యెప్పుడూ ఆడుకోదు! ఎవరిచెట్లని లేగుకాయలు వుండాయో, ఎవరితోటలో మామిడిపిందెలు వేస్తున్నాయో - ఇలాంటివన్నీ ఆ అమ్మాయికి గోటిచివర నుంటాయి. దారే నడుస్తూంటే యే మొక్కమీద నయినా రంగురంగుల సీతాకోకచిలుక లేమైనా వ్రాలాయేమోనని చూస్తూవుంటుంది. వాకుడుపళ్లు కన్పించాయంటే, బొమ్మరింటి అన్నాలాటలో కూరకోసమని వాటిని తక్షణం కోసుకు వచ్చేది. దారిలో ఎక్కడపడితే అక్కడ చతికిలపడి, కన్పించిన రాళ్ల ముక్కలన్నీ పోగుచేసి, వాటిలో 'గంగా యమునా' ఆటకి పనికివచ్చేవి ఏరుతూ కూచునేది. పనికివచ్చేదేదయినా ఉంటే తక్షణం కొంగున మూటకట్టుకుంటుంది. బొమ్మరిల్లు, బొమ్మల పెట్టె సరంజామాలోనే ఎప్పుడూ మునిగి తేలుతూ ఉంటుంది దుర్గ.

ఆ పిల్ల లోపలికి వచ్చి, ఏదో తప్పుచేసిన దానిలా తల్లికేసి చూసింది—"వచ్చావా? రా, వండి వార్చి ఉంచాలే. రెండు మెతుకులు తిని తరింపచెయ్యి నన్ను—తర్వాత మళ్లీ నీ చిత్తం వచ్చిన చోటుకి ఎక్కడికో వెంచేద్దువుగాని. వేసవిరోజులు—ఊళ్లో పిల్లలంతా చూడు. ఏ కన్నె నోములో పూజలో చేసుకుంటారు! ఈడు పైబడినా నువ్వు మాత్రం రాత్రింబగళ్లు బలాదూరు తిరుగుతూంటావు. ప్రొద్దున పాచి మొహంతో వెళ్లినదానివి, ప్రొద్దు నడినెత్తి మీదికి వచ్చాక ఇప్పుడా వచ్చావు! ఆ తల చూడాలి. ఓ నూనె రాసుకోవటమా! దువ్వుకోటమా! బ్రాహ్మణపిల్లవని ఎవరైనా అనుకుంటారా చూస్తే!—యే డోమ్మరిపిల్లో ఉప్పరిపిల్లో అనుకుంటారుగాని! చివరకు పెళ్లి కూడా ఏ డోమ్మరింట్లో రాసిపెట్టి ఉందోలే! కొంగున మూటకట్టుకొచ్చావు ఆ మూటె ఏమిటి? ఏదీ చూపించు"—అన్నది సర్వజయ.

దుర్గ బెదురుతూ, కొంగు మూటవిప్పుతూ—"రాయ్ వాళ్లాయ్‌గారింటి కెదురుగా కసిందచెట్టుమీద—" అని ఓ గుటక మింగి, "ఇన్ని రాబందులు..."

రాబందుల, పేరు చెప్పినా ద్రవించని కఠినగుండెలు కలవాళ్లు కూడా చాలా మంది ఉంటారు. సర్వజయ మండిపడుతూ—"నిన్ను అవి భయపెడుతూ వాకాలూదారేం? ఒట్టి కల్లబొల్లి మాటలు చెపుతూ తిరగమంటే రాత్రింబగళ్లు తిరుగుతావా ఉండు. ఇవాళ నీ బొమ్మలపెట్టె విసిరి పుచ్చుకుని, వెదుళ్ళతోపులో బురదగుంటలో పారెయ్యకపోతే—సర్వజయ మాట పూర్తికాకముందే ఓ సంఘటన జరిగింది. ముందు భువన ముఖర్జీగారి వదినగారు, ఆవిడ వెనుక ఆమె కూతురు టునూ, మరిది కొడుకు సతూ - వాళ్ల వెనుక మరో నలుగు రయిదుగురు పిల్లలు—అంతా కలిసి వీధిగుమ్మాన ఇంట్లోకి వచ్చిపడ్డారు. ఆవిడగారు అటూ యిటూ చూడకుండా, యింట్లో ఎవర్నీ పలకరించకుండానే సరాసరి లోపలికి వచ్చేసింది. తన పిల్లలకేసి చూస్తూ "ఏదీ? ఎక్కడుందో ఆ బొమ్మలపెట్టె బయటికి లాగండి, చూద్దాం—" అన్నది.

ఈ ఇంట్లోవాళ్లెవరూ ఇంకా ఒక్కమాట మాట్లాడక ముందే, టునూ - సతూ ఇద్దరూ లోపలికి వెళ్ళి దుర్గబొమ్మలపెట్టెను వసారాలోకి పట్టుకు వచ్చి, క్రింద పెట్టారు. టునూ పెట్టె తెరిచి కెలికి కెలికి ఓ పూసల పేరు బయటికి లాగింది: "ఇదుగో చూడు, మన పూసలపేరే అమ్మా, యిది. నువ్వా రోజు ఆడుకోటానికని ఇచ్చావ్?—ఆ రోజునే దొంగతనంగా ఎత్తుకు వచ్చేసింది" అన్నది.

సతూ పెట్టె మరోమూల ఉన్న మామిడి పిందెలు బయటికి తీసి, "ఇవిగో చూడు, పెద్దమ్మా! మన 'సువర్ణరేఖ' చెట్టువే; ఎవరూ చూడకుండా కోసుకొచ్చుకుంది" అన్నాడు.

ఈ గొడవంతా హఠాత్తుగా జరగటంతో ఇంట్లోవాళ్ళ కందరికీ అయోమయంగా ఉంది. ఒక్కరికీ నోట మాట రాలేదు. చివరికి సర్వజయ కొంచెం తెప్పరిల్లి, "ఏమిటి పిన్నీ? ఏం జరిగింది?" అని అడుగుతూ వంటింటి వసారాలోంచి లేచి ఇవతలికి వచ్చింది.

"ఏం జరిగిందో నువ్వే చూడరాదూ ఆ ప్రతాపం. మీ అమ్మాయి ఆ రోజు ఆడుకోటానికి వచ్చి మా టునూ బొమ్మలపెట్టెలోంచి ఈ పూసలదండ దొంగతనంగా ఎత్తుకువచ్చింది. వెదికి వెదికి విసిగిపోయింది పిల్ల. ఆతర్వాత సతూ వచ్చి చెప్పాడు; నీ పూసలదండ దుర్గాదీదీ బొమ్మలపెట్టెలో చూశానని. తెలిసిందా ఇప్పుడు! మీ అమ్మాయి ఏం తక్కువ దనుకుంటున్నావేమో! అది దొంగ, గజదొంగ. అందాకా యెందుకు. తోటలో మామిడిపిందెలు వెయ్యటం తరువాయి; దొంగతనంగా తెచ్చుకుని పెట్టెలో పెట్టుకుంది చూడరాదూ!"

ఒక్కసారి రెండు దొంగతనాలు హఠాత్తుగా వచ్చి మీదపడటంతో దుర్గ గోడకి అంటుకుపోయింది. ముచ్చెమటలు పోస్తున్నాయి ఆ పిల్లకి. "నువ్వు వాళ్లఇంట్లోంచి ఆ పూసలు తెచ్చినమాట నిజమేనా?" అని అడిగింది సర్వజయ.

దుర్గ జవాబు చెప్పేలోపుగానే—"తీసుకురాకపోతే, నేనేం అబద్ధమాడుతున్నాననా? ఈ మామిడిపిందెలసంగతి కన్పడటం లేదా పోనీ! సువర్ణరేఖ గుర్తుపట్టలేవూ? ఇదీ అబద్ధమే నంటావా?" అంటూ మీది మీదికొచ్చిం దావిడ.

సర్వజయ సిగ్గుతో సగం చచ్చి, "ఎవ్వే, మీరబద్ధం చెపుతున్నారని కాదు పిన్నిగారూ: నేనన్నది:—దాన్ని అడిగి చూద్దామని—" అన్నది.

ఆవిడ ఝుఁఇన్‌మని లేచింది. చేతులు ఝాడించుకుంటూ? "ఆడుకో—, మానుకో, ఏ మన్నా చేసుకో. అది నజావయిన పిల్ల మాత్రం కాదు, నేను చెపుతున్నాగా! ఇప్పుడే ఇంత దొంగతనాలు మరిగినపిల్ల, ఇహ ముందు ముందు ఎంతకైనా తగునని వేరే చెప్పటం దేనికి; రారా పోదాం సతూ!

ఆ మామిడిపిందెలు మూటకట్టుకుని కద. ఇలాంటి దరిద్రపు పిల్లలుంటే తోటలో ఒక్క పిందె దక్కనిస్తారా? ఆ పూసలదండ తీసుకున్నావే టునూ?"

సర్వజయకి ఇంక కోపంవచ్చింది. తగవులాటల్లో ఆమె అయినా ఏ మాత్రం వెనక్కి తగ్గేరకం కాదు "పూసలదండ సంగతయితే నాకు తెలియదు. కాని పిన్నిగారూ మామిడి పిందెలు రాలిఉంటే ఓ వేళ తీసుకువచ్చి ఉండొచ్చు. అవి మీవే అని వాటిమీద పేరురాసి లేదుగా. ఏదో పిల్లలు తీసుకొచ్చారే అనుకోండి——"

భువనముఖర్జీ వదినగారు - అగ్గిమీద గుగ్గిలం వేసినట్లయి - "మాట మాట్లాడితే నవ్వేట్లు ఉండాలి - ఊరికే అనేసెయ్యగానే సరా? పిందెలమీద మా పేరు రాసిలేదు నిజమే - కాని మీ జమీలో ఏతోటలోంచి తెచ్చిందంటావో చెప్పు చూద్దాం. డబ్బుమీదా రాసి ఉండదు పేరు; అలా అని అందితే డబ్బయినా ఎత్తుకు రావచ్చునంటావా? ఇదిగో రేపిస్తా మాపిస్తా, అని ఏడాదినుంచి గడుపుకొస్తున్నావు. అనక వస్తాను మళ్ళీ, నా బాకీ ఇచ్చెయ్. ఇంక నేను ఆగేదిలేదు. ఎక్కడో అక్కడ డబ్బు సంతన చేసి ఉంచు" అన్నది. అనేసి, ఆవిడ ఆ ముఠానందర్నీ వెంటపెట్టుకుని బయటికి వెళ్ళిపోయింది. వెడుతూ వెడుతూ వారిలో ఎవరితోనో ఆవిడ బిగ్గరగా అంటున్న మాటలు సర్వజయకి స్పష్టంగా వినిపించాయి. "ఆ రాక్షసి పిల్ల లేదూ. ఆ పిల్ల మా టునూ పెట్టెలోంచి ఈపూసలచేరు ఎత్తుకెళ్లి తన పెట్టెలో దాచుకుంది. ఈ మామిడి పిందెలుచూశారుగా, ఈ ప్రక్కతోటలోనే, ఎలా రాలగొట్టిందో చూశావటమ్మా అని అడగటానికి వెళ్ళాను - దాంతో ఏవో పిల్లలు - ఇలాంటివి తెచ్చుకోక మానతారా, వాటిమీద మీ పేరేమైనా రాసివుందా? అని వెనకేసుకొస్తోంది పైగా" అని గొంతుతగ్గించి-"తల్లి మాత్రం తక్కువదనుకున్నారా? లేకపోతే కూతురికి ఈ దొంగబుద్ధి ఎలా అబ్బిందని? ఆ ఇంటిల్లిపాదీ అందరూ అంతే. ఒట్టి దొంగసజ్జు" అంటోంది.

అవమానంతో, దుఃఖంతో సర్వజయకి కళ్ళనీళ్ళపర్యంతమయింది. ఆమె వెనక్కి వచ్చి, దుర్గను రేగినజుట్టు పట్టుకులాగి, ఆ అంటచేత్తోనే ఢడీ ఢడీ కొడుతూ-"వెధవ 'పీడాకారం' నువ్వెక్కడ సిద్ధమయినావే! ఛస్తే పీడావదిలిపోను. నా ఎముకలు కొరికేస్తున్నావు ఎక్కడో. ఫో, ఇంట్లోంచి, పోవేం-ఊఁ. ఇంక నా ఎదుట ఉండొద్దు ఫో" అన్నది.

దుర్గ తల్లిదెబ్బలకు భయపడి దొడ్డిదారిన పారిపోయింది. పీచులాంటి ఆపిల్ల తలవెంట్రుకలు కొన్ని ఊడివచ్చాయి సర్వజయ గుప్పిట్లోకి. అపూ అన్నంముందు కూర్చుని తెల్లబోయి చూస్తున్నాడు. అక్క పూసల దండ దొంగతనంగా తెచ్చినదీ లేనిదీ వాడికి తెలియదు. అది ఇంతకుముందెప్పుడూ వాడి కంట పడలేదు-కాని మామిడిపిందెలుమాత్రం దొంగతనంగా కోసితెచ్చినవి కావని తెల్సు. నిన్న సాయంకాలం అక్క మామిడి పిందెలు ఏరుకురావటానికి తననుకూడా వెంటపెట్టుకునే వెళ్ళింది. 'సువర్ణరేఖ' చెట్టుకింద రాలివుంటే ఏరింది-తనకి తెలుసు. నిన్నటి నుంచి అక్క తనలో ఎన్నోసార్లుచెప్పింది- 'ఈసారి మామిడిపిందెలతో ఎలాంటి తాయిలం తయారుచేస్తానో చూడరా అపూ-' అని. కాని తల్లి ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఉండటం మూలంగా అక్క తాయిలం చెయ్యటానికి వీల్లేకపోయింది. ఎంతో ఆశపడి తెచ్చుకున్న పిందెలు ఇలా పోవటమే కాకుండా, దెబ్బలుకూడా తిన్నది పాపం. అక్కని అలా జుట్టుపట్టుకుని లాగినందుకు- అమ్మమీద కూడా అపరిమితమైన కోపం వచ్చింది వాడికి. అక్క జుట్టు అలా పీచురేగి ఉండటం చూసినప్పణే వాడికెందుకో అక్కమీద మమకారం పుట్టుకువచ్చింది - 'అక్కకి నా అనే వాళ్ళెక్కడా ఎవరూ లేరు. ఒక్కతే ఎందుకనో ఎక్కడినుంచో వచ్చినట్లుంటుంది. దానికెక్కడా ఎవరూ సావాసులేరు'——అనిపించింది. అక్క కష్టాలు గట్టెక్కించటం ఎలా? అక్కకి ఏ లోటూ లేకుండా చెయ్యటం ఎలా? ఏమైనా సరే, అక్కకి తనంతయినా కష్టం కలగనియ్యను, అనుకున్నాడు.

అన్నం తిన్నాక, అమ్మ ఏమన్నా అంటుందేమో అన్న భయంతో అపూ ఇంట్లోనే కూర్చున్నాడు. కాని వాడి మనస్సుమాత్రం ఎక్కడెక్కడో తిరుగుతోంది. ప్రొద్దువాలేముందు అపూ టునూ వాళ్ళ యిల్లు, పట్టీవాళ్ల ఇల్లు, ఒక్కొక్కటిగా అన్ని ఇళ్లకీ వెళ్లి చూశాడు. అక్క ఎక్కడా కనపడలేదు. రాజకృష్ణపాలిత్ పెళ్లాం ఏటికెళ్లి నీళ్లు తెచ్చుకుంటూ ఎదురయింది. ఆమెని "పెద్దమ్మా, మా అక్క ఎక్కడైనా కన్పించిందా? అది ఇవాళ అన్నమూ తినలేదు, ఏమీ తినలేదు. అమ్మ ఇవాళ దాన్ని గట్టిగా కొట్టింది. దెబ్బలు తిని ఎటో పారిపోయింది. ఎక్కడైనా కన్పించిందా పెద్దమ్మా?" అని అడిగాడు.

అపూ ఇంటిప్రక్క పుంత దగ్గరకి వచ్చేసరికి 'వెదురు తోపులోకి వెళ్లి కూచుందేమో' అన్న ఆలోచన వచ్చింది. అటు వెళ్లి అంతా వెతికాడు. దొడ్డిదారిన మళ్ళీ ఇంట్లోకి వచ్చి చూశాడు. ఇంట్లో ఎవరూ లేరు. అమ్మ

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు.

★ పథేర్ పాంచాలి ★

నీళ్ళలో ఎక్కడికో వెళ్ళినట్లుంది. ఆవరణను_న్నాయి. చటుక్కున వాడి కెందుకో లోకి సంజెనీడలు ప్రాకుతున్నాయి.

ఎదుట గుమ్మం ముందు వెదురు మొక్కలు తలలూపుతున్నాయి. ఒక మొక్కమీద చివర ఒక సన్నచువ్వమీద కూచుని పచ్చపిట్ట రోజూలాగే ఊగుతోంది. ఇంక కాస్సేపటికి సందెపడుతుందనగా ఎక్కడనుంచి వస్తుందో ఆ పిట్ట రోజూ ఆ చువ్వమీదికే వచ్చి వాలుతుంది. ఆ తోట నిండా ఇంకా ఏవేవో పిట్టలు కిలకిల కూస్తున్నాయి...నీలమణిరాయ్‌గారి పాడుపడ్డ యింటిమీదికి చెట్లనీడలు బాగా ప్రాకేశాయి. అపూ వసారా ముందు నిలబడి, దూరాన ఉన్న ఆ రావిచెట్టు చిటారు కొమ్మలకేసి చూశాడు. ఆ కొమ్మల అంచుల్లో ఇంకా కాస్త కాస్త నీరెండ అంటుకుని ఉంది. చిటారు కొమ్మను తెల్లటి దేదో చిక్కుకున్నట్లు కన్పిస్తోంది. అది కొంగయినా కావచ్చు, లేదా ఎవరిదైనా గాలిపటం అక్కడ చిక్కుకుని ఉండొచ్చు. మెల్లి మెల్లిగా ఆకాశాన నీడలూ చీకట్లు అలుముకుంటున్నాయి. ఎటు చూసినా నిర్జనంగా ఉంది. ఎక్కడా ఎవరూ లేరు. నీలమణిరాయ్‌గారి కూడిపోయిన గోడలమీద మొలిచిన ఉత్తరేణి మొక్కల పెద్ద పెద్ద ఆకులు నల్లగా కన్పి

దిగులు కలిగింది. ఎప్పుడనగా వెళ్ళింది యింట్లోంచి! ఆ వెళ్ళటం వెళ్ళటం మళ్ళీ రాలేదు, అన్నం తినలేదు. ఎక్కడికెళ్ళిందీ అక్క?—

భువనముఖర్జీగారింట్లో పిల్లలంతా వాళ్ళ ఇంటిముందు దాగుడుమూతలాడుతున్నారు. అక్కడికి వెళ్ళాడు. అపూని చూసి, రాణూ పరుగెత్తుకు వచ్చి—"అపూ వచ్చాడురా తమ్ముడూ! వాడు నా పక్షం ఉంటాడు, రారా, అపూ!" అంటూ చెయి పట్టుకుంది.

అపూ రాణూ చెయ్యి విదిలించేసుకుని "నేను ఆడను రాణూదీ! మా అక్క కన్పించిందా?" అని అడిగాడు.

"దుర్గా? ఏదీ, నాకెక్కడా కన్పించలేదే! పొగడచెట్టు కింద లేదూ?" అని అడిగింది రాణూ.

పొగడచెట్టు మాటే గుర్తు లేదు వాడికి. బహుశా అక్కడే ఉండి వుంటుంది. అపూ ఆ పొగడచెట్టుదగ్గరకి వెళ్ళాడు. సందెపడింది. ఆ పొగడచెట్టు చుట్టూ ఆ మొక్కలు ఈ మొక్కలూ, కొమ్మలూ— అన్నీ కలసి అదంతా పెద్ద గుబురులా ఉంటుంది. క్రింద అంతా చీకటి. ఎవరూ లేరు అక్కడ. ఒకవేళ ఏ చెట్టుచాటున నక్కి వుంటుందేమో!

"అక్కా! అక్కా!" అని కేకేశాడు.

ఆ చీకట్లో చెట్లమీద కొంగల కదలికలు మాత్రమే తెలుస్తున్నాయి. అపూ భయముతో పైకి చూశాడు. పొగడచెట్టుకి కొంచెము దూరంలో దొరువుగట్టున ఖర్జూరపు చెట్టు ఒకటి ఉంది. దోర ఖర్జూరకాయలు దొరికే రోజులివి. అక్క అప్పుడప్పుడు అక్కడి కూడా వెదుకుతూండటం కద్దు. కాని చీకటి పడిపోయింది. దొరువుకి అటూ ఇటూ వెదురుపొదలు. అక్కడికి వెళ్ళి వెతకటానికి గుండెలు చాలలేదు వాడికి. పొగడచెట్టు దాటి రెండడుగులు వెళ్ళి, మళ్ళీ ఒకటి రెండుసార్లు గట్టిగా కేక వేశాడు. అపూ గొంతు సవ్వడికి అడవిలో ఏదో జరజర కదిలిన చప్పుడయింది.

ఇహ ఇంటిదారి పట్టి తిరిగి వస్తూ వస్తూ హఠాత్తుగా ఆగిపోయాడు అపూ. ఎదుట ఓ పెద్ద లొద్దుగు చెట్టుంది. చీకటిపడ్డాక ఒంటరిగా ఆ లొద్దుగుచెట్టుక్రిందనుంచి వెళ్ళటమే! అమ్మ బాబోయ్! ఇంకేమన్నా ఉందా! ఒళ్ళంతా గగుర్పొడిచింది. ఆ చెట్టుకిందినుంచి వెళ్ళటానికి తన కెందుకు భయమేస్తున్నదో తెలియదు! కారణమేమీ లేదు. ఊరికేనే భయం వేస్తోంది. కారణం లేదు కనుకనే మరింత భయం! తాను ఇంత

ప్రొద్దుపోయేవరకూ ఏ రోజూనా ఇంటికి వెళ్ళకుండా ఉండలేదు. ఇవాళసలు ఆ ధ్యాసే లేదు. పరాకు, దిగులూ రెండూ లేకపోయినట్లయితే తానసలు ఈ దారిని ఒకనాటికి వచ్చేవాడు కాడు.

అపూ కాసేపు చీకట్లో ఆ లొద్దుగుచెట్టుకేసి అలాగే చూస్తూ నుంచుని, వెనక్కి తిరిగాడు. ఇంటికి వెళ్ళేందుకు మరో దారి ఉంది. కాస్త చుట్టు తిరిగి, పటలీవాళ్ళ మెల్లా ప్రక్కగా పడితే, ఈ లొద్దుగుచెట్టు కింది తెలియని భయానకదృశ్యంనుంచి తప్పుకుపోవచ్చు.

పటలీవాళ్ళ బామ్మ సందవేళ వసారాలో చుట్టూ పిల్లల్ని కూచోపెట్టుకుని కథలు చెప్తోంది. పటలీవాళ్ళ అమ్మ లోపల వంట చేసుకుంటోంది. మెల్లాలో మంచె దగ్గిర చేపలమ్మి నుంచుని బాకీ డబ్బులు రొక్కాయించి అడుగుతోంది.

"అక్కను వెదకటానికని వెళ్ళి వస్తున్నాను బామ్మా! పొగడచెట్టుదగ్గిర్నుంచి వస్తూంటే—" అన్నాడు అపూ.

"దుర్గ ఇప్పుడే ఇంటికి వెళ్ళింది. ఎంతోసేపు కాలేదు, ఒక్క పరుగు తియ్. ఈపాటికింకా ఇల్లు చేరిఉండదు" అన్నదా ముసలమ్మ.

అపూ పరుగు పుచ్చుకున్నాడు. పటలీ వాళ్ళ అక్క రాణీ వెనుకనుంచి, "రేప్పొద్దున్నే రా అపూ! గాదె వెనకాల వేపచెట్టు క్రింద ఆడుకుందాం. దుర్గతో కూడా చెప్పు" అని కేకవేసి చెప్పింది.

ఇంటికివచ్చి చూసేసరికల్లా - దుర్గ ఇంట్లోంచి కెవ్వుమని ఏడుస్తూ బయటికి పారిపోతోంది; వెనకాలే వాళ్ళ అమ్మ చేత్తో ఏదో పుచ్చుకుని తరుముకువస్తోంది. అది చూసి హఠాత్తుగా ఆగిపోయాడుఅపూ. దుర్గ ఆ లొద్దుగుచెట్టుకిందనుంచి పరుగు తీస్తోంది. తల్లి గుమ్మంలోకి వచ్చి, "ఫో. మళ్ళీ ఇంక జన్మలో ఈ గుమ్మంలో అడుగు పెట్టకు. పీడవిరగడై పోతుంది. ఒక్క ఏడుపు ఏడ్చి, ఒలుకుల్లో పారేసివస్తా" అని అరుస్తోంది.

ఒలుకులమాట వినేసరికల్లా ఒళ్ళంతా బిగుసుకుపోయినట్లయి బరువెక్కింది వాడికి. తల్లి అప్పుడే వెనక్కి తిరిగి, వసారాలో ఉన్న దీపపు ప్రమిద ఇంట్లోకి తీసుకు వెడుతోంది. అపూ మెల్లిగా పిల్లిలాగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వస్తూండేసరికి తల్లి వాడికేసి తిరిగి- "ఇంత ప్రొద్దుపోయేదాకా ఎక్కడున్నావురా నువ్వు మళ్ళీ; తిండి తిన్నావ్ ఇవాళసలు?" అన్నది.

అపూ మనసులో చాలా ప్రశ్నలు బయల్దేరాయి. 'అమ్మ అక్కను మళ్ళీ ఎందుకు కొట్టింది? అక్క ఇప్పటిదాకా ఎక్క


సొగసులరాణివంటి చర్మ సౌందర్యము మీకున్నూ గలుగును!
దినదినమున్నూ అతి
మనోహరముగా నుండుడు...
అవును. కాంతివంతమైన సొగసగు చర్మ సౌందర్యమును పొంద
గోరు మీ కల నిజము కాగలదు కూడ! మీరు స్నానముచేయు
నప్పుడున్ను చేతులు ముఖము కడుగుకొనునప్పుడున్ను ప్రతి
మాటూ. రెక్సోనాను ఉపయోగించుడు — ఎల్లప్పుడూ
దానియొక్క కేడిల్‌తోగూడిన నురగను మీ
చర్మముమీద మెల్లగా రుద్దుడు తరువాత
కడిగివేయుడు దినదినమున్నూ మీ చర్మ
సౌందర్యము ఇంకా క్రొత్త, మరీ మృదు
వైన, మనోహరత్వమును పొందును.
"మిస్ రెక్సోనా."
1955, రెక్సోనా సౌందర్య
పోటీలో మనోహరమైన
గెలుపుదారు.
Rexona
BLENDED WITH CADYL
...సహజంగా రెక్సోనాతో
ఇది ఒక్కటే కేడిల్ తోగూడిన సబ్బు
పెద్ద సైజులోకూడ దొరకును
RP 139X52 TL

డున్నట్లు? మధ్యాహ్నం ఏమైనా తిన్నావా అక్కా? మళ్లీ ఎక్కడినుంచైనా ఏమయినా ఎత్తుకువచ్చిందా? - కాని 'తల్లి భయం కొద్దీ మరేమీ అడుగకుండా కీలుబొమ్మలా తల్లి చెప్పినట్లల్లా వింటూ లోపలికి వెళ్లాడు. తర్వాత భయపడుతూ భయపడుతూనే దీపం కాస్త హెచ్చించి, తన పుస్తకాలదస్తరం తెచ్చుకుని కూర్చున్నాడు. వాడు చదువుతున్న దింతకీ మూడో క్లాసే - అయినా వాడి దస్తరంలో మాత్రం రెండు లావుపాటి ఇంగ్లీషు పుస్తకాలు, ఓ ఆయుర్వేదమందుల జాబితా, అట్టలు చిరిగిపోయిన దాశూరాయ్ గేయాలపుస్తకం, అరవైయేళ్ల నాటి పాతపంచాంగం - మొదలైనవన్నీ ఉన్నాయి. వాడీ పుస్తకాలన్నీ ఎక్కడెక్కడో సంపాయించి దాచుకున్నాడు. వాటినన్నిటినీ చదవలేకపోయినా, రోజుకొకసారయినా దస్తరంవిప్పి చూసుకుంటూ ఉంటాడు.

కాసేపు గోడకేసి చూస్తూ కూచుని ఏమో ఆలోచించుకున్నాడు. ఆ తర్వాత మళ్ళీ ఇంకోసారి దీపం హెచ్చించి, అట్టలు చిరిగిపోయిన దాశూరాయ్ గేయావళి తీసి, పరధ్యానంగా పేజీలు తిరిగేస్తూ కూచున్నాడు. ఇంతలో సర్వజయ పాలగ్లాసు చేతపట్టుకుని వచ్చి-"ఇలావచ్చి, ఈ కాసినీ త్రాగెయ్" అన్నది.

అపూ మారుచెప్పకుండా ఆ గ్లాసు అందుకొని చప్పరించడం మొదలెట్టాడు-ఇంకెప్పుడయినా అయితే వాడిచేత పాలు త్రాగించటం ఇంత సులభంకాదు. కాసిని తాగి ఆ గ్లాసు కింద పెట్టేశాడు. "అదేమిట్రా? అందులో ఇంకా అట్టే పెట్టావ్? ఆ కాసినీ త్రాగేసెయ్ అవికూడా త్రాగకపోతే ఒంట్లో ఊపిరి ఉండొద్దూ?" అన్నది సర్వజయ.

అపూ ఇంకేమీ మాట్లాడకుండా మళ్ళీ గ్లాసు నోటిదగ్గర పెట్టుకున్నాడు. గ్లాసు నోటిదగ్గర పెట్టుకున్నాడన్నమాటే గాని, వాడు త్రాగడంలేదని సర్వజయ గ్రహించింది... వాడిచెయ్యి, గ్లాసుకూడా వణుకుతున్నాయి. చాలాసేపు అలాగే పట్టుకు కూర్చుని, చటుక్కున గ్లాసు క్రిందపెట్టేసి, తల్లిముఖంకేసి చూసి భయంతో బావురుమన్నాడు. సర్వజయ ఆశ్చర్యపోయి— "ఏమిట్రా? ఏమయింది? నాలికేమయినా కరుచుకున్నావా?" అని అడిగింది.

అపూ తల్లిమాట పూర్తి అవగానే, భయాన్ని లెక్క చెయ్యకుండా "అక్క ఏమైపోయిందో, బెంగగా వుందే అమ్మా!" అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

సర్వజయ ఒక్కక్షణంమాత్రం మెదలకుండా ఊరుకుని, తర్వాత దగ్గరకు వచ్చి, వీపు నిమురుతూ శాంతంగా-"ఏడవకు, అలా ఏడవకు మరి! పటలీవాళ్ల ఇంటికో, ఆ సాతానివాళ్ల ఇంటికో పోయి కూర్చుని వుంటుంది. అంతకంటె ఎక్కడికి పోతుందీ చీకట్లో? అదిమాత్రం తక్కువదిరా, అంత పెంకెతనమా మరీ! మధ్యాహ్నమవగా పోయిందింట్లోంచి - మా అయిపూ - ఆనవాలూ ఉంటేనా, తిండీ తిప్పలు లేకుండా ఆ వీధికెక్కడో పాలిత్ వాళ్ల తోటలోకి పోయి మామిడిపిందెలు, దానిమ్మ పిందెలు తింటూ కూర్చుంది. ఇప్పుడే రమ్మని కబురు చేస్తాలే. పొట్ట ఉబ్బుతుంది, అలా ఏడవకు మరి మళ్ళీ యీ జ్వరమేనా వస్తుందిరా నాయనా! ఛా! ఊరుకో" అంది.

తర్వాత పమిటచెంగుతో వాడికళ్లు తుడిచి ఆ మిగిలిన పాలు తాగించుదామని గ్లాసు నోటికి అందిస్తూ "ఆఁ అను, నోరు తెరు, నా బంగారుకొండవి కదూ, మంచి వాడివి, మీ నాన్న రాగానే వెళ్ళి తీసుకురమ్మని చెపుతాగా! పిచ్చి నాయనా! ఇంత ఒట్టి పిచ్చివాడివి పుట్టావేంరా ఎక్కడో ఇంకొక్క గుక్క ఆఁ అను—" అన్నది.

* * *

రాత్రి చాలా ప్రొద్దోయింది. ఉత్తరపు వైపు గదిలో బల్లమీద దుర్గ—అపూ పడుకున్నారు అపూ ప్రక్కన వాళ్ల అమ్మ పడుకునేచోటు ఖాళీగా ఉంది. తల్లి వంటిల్లంతా సర్దుకుని ఇంకా తెమిలిరాలే దింతలికి. వాళ్ళ నాన్న భోంచేసి ప్రక్కగదిలో హుక్కా త్రాగుతూ కూర్చున్నాడు. నాన్న ఇంటికి రాగానే అక్కను వెతికి తీసుకొచ్చాడు.

ఇంటికి వచ్చిం దగ్గిర్నుంచీ దుర్గ ఎవరితోనూ మాట్లాడలేదు. అన్నం తిని చడీ చప్పుడూ లేకుండా వచ్చిపడుకుంది. అపూ దుర్గ ఒంటిమీద చెయ్యివేసి, "అక్కా! అమ్మ ఏం తీసుకుకొట్టిందే సాయంత్రం నిన్ను? నీ జుట్టు పీకిందా?" అని అడిగాడు.

దుర్గ ఏం మాట్లాడలేదు.

"నామీద కోపం వచ్చిందా అక్కా? నేనేం చేశానే?" అని అడిగాడు మళ్లీ.

"ఏం చెయ్యకపోవటమేం! మరి వాళ్ల సతూకి ఎలా తెలిసింది నా పెట్టెలో పూసలదండ ఉన్నట్లు?" అని అడిగింది దుర్గ మెల్లిగా.

అపూ అక్క మాటని ఖండించే ఆవేశంలో పక్కమీద అమాంతం లేచికూర్చుని, "నాకేం తెలియదే! నిజంగా! నీ మీద ఒట్టు వేసుకుని చెపుతున్నాను అక్కా! నేనసలు చూడందే! నీ పెట్టెలో ఉన్నట్టే తెలియదు నాకు. నిన్న సాయంత్రం సతూ ఆడుకునేందుకని వచ్చాడు. వాడి పెద్దబంతితోనే ఆడుకున్నాం మేమిద్దరం. తర్వాత నీ బొమ్మల పెట్టెతీసి చూసిఉంటాడు. నేనక్కడికీ—

"మా అక్క బొమ్మలపెట్టె నువ్వు ముట్టుకోవద్దు అబ్బాయీ! నన్ను తిడుతుందది' అన్నాను అప్పుడే చూసి ఉంటాడు—" అని దుర్గ ఒళ్లు నిమురుతూ—

"బాగా తగిలాయా? ఎక్కడ కొట్టింది?" అని అడిగాడు—

"అమ్మచేతిలో ఇనపగరిటె విసిరేసిందిలే. ఈ చెవి ప్రక్కగుచ్చుకుని నెత్తురొచ్చింది. ఇంకా చిమచిమలాడుతూనే ఉంది. చెయిపెట్టి చూడు ఇంకా—ఇక్కడా—"

"ఇక్కడా? అవునే గుచ్చుకున్నట్లుంది. కాస్త ప్రమిదలో చమురు రాయనా అక్కా?"

"వద్దులే—రేపు సాయంత్రం పాలిత్ వాళ్ళ తోటలోకి వెడదాం తెలిసిందా! కొమంచిపళ్లు ఎంత బాగా పండాయనుకున్నావ్! ఇంతంతి ఉన్నాయ్. ఎవరితో చెప్పకేం! నువ్వూ నేనూ వెడదాం గప్‌చిప్‌గా. నేను ఇందాక మధ్యాహ్నం రెండు పళ్లు తిన్నాను. తియ్యగా మధురం అనుకో—"

(ఇంకా వుంది)

ఉరిశిక్ష ఉండాలా?

మరణదండన రద్దు చేయాలని బ్రిటిష్ పార్లమెంటు తీర్మానం చేసింది. ఈ నిర్ణయం చేయడంలో, కామన్సు సభ సభ్యులందరికీ ఓటింగ్‌లో పార్టీ ఆదేశాల బెడద లేకుండా, పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడింది. ఏడు గంటల సేపు తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. హత్యానేరానికి మరణశిక్ష రద్దు చెయ్యడానికి అనుకూలంగా 293 మంది ఓటు చేశారు. 262 మంది రద్దు చెయ్యరాదన్నారు.

ఈనాడయితే హత్యవంటి మూడు నాలుగు నేరాలకే ఈ శిక్ష వేస్తున్నారు. కాని 120 ఏళ్ల క్రితం వరకూ, ఏ రకం నేరం చేసినా ఉరిశిక్ష విధిస్తూ ఉండేవారు. అప్పటికి అమలులో ఉన్న జాబితా ప్రకారం, దాదాపు 200 రకాల నేరాలకి ఇదే శిక్ష. ఇది 18 వ శతాబ్దంనుండీ అక్కడ ఆచారంగా ఉంటూ వచ్చింది. 1835 లో ఆందోళన ఫలితంగా, ఈ నేరాల జాబితాను కుదించి, హత్య, దేశద్రోహం, రేవులు భవనాలు మొదలైనవాటికి నిప్పు పెట్టడం, ఓడలను అటకాయించి కొల్లగొట్టడం అనే నాలుగు నేరాలకే మరణశిక్ష అవసరం అని నిశ్చయించారు. దరిమిలా ఇది కూడా ఆచరణలో తగ్గిపోయింది. హత్య చేసినవారికే ఉరిశిక్ష విధించబడుతూ వచ్చింది. అయితే, బహిరంగంగా ఉరితీయరాదన్న నియమం 1868 వరకు అమలులోకి రాలేదు. ఆ ప్రాంతాలలోనే ఈ శిక్ష ఉండాలా కూడదా అన్న విషయం పరిశీలించడానికి ఒక సంఘం నెలకొల్పబడింది. రద్దు చెయ్యాలనే ఆ సంఘం సలహా ఇచ్చింది. అయితే, అటువంటి శాసనం చేసి పూచీ నెత్తిన వేసుకోడానికి ఏ ప్రభుత్వానికా ప్రభుత్వమే జంకుతూ వచ్చింది. ఈ శిక్ష తొలగిస్తే, హత్యానేరాలు చెలరేగుతాయని ఎవరికివారు భయపడ్డారు. 1948 లో కామన్సుసభ ఒక అడుగు ముందుకు వేసి, మరణశిక్ష విధించినా ఐదేళ్లపాటు అమలు జరపకుండా ఆపాలని తీర్మానించింది. దీనికి ఎగువసభ ఒప్పుకోక, ఇంకో సంఘాన్ని నియమించింది.

శిక్షవల్ల భయం లేకుండాపోతే, హత్యలు పేట్రేగిపోతాయని ఎక్కడికక్కడ భయం ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం కూడా మొన్న పార్లమెంటులో తన వైఖరిని సూటిగా స్పష్టంగా వెంటనే చెప్పలేకపోయింది.


"మరణశిక్ష రద్దు చేయడంవల్ల హత్యానేరాలు పెరుగుతాయని గట్టినమ్మకం ఉంటే, ఆ శిక్ష ఉండవలసిందేమరి" అని ప్రభుత్వప్రతినిధి అన్నారు.

ఈ అనుమానంలో ఎంతవరకు నిజం ఉన్నట్టు? మరణదండన రద్దుచేసిన దేశాలలో ఆ శాసనం అమలులోకి వచ్చినతరువాతి నేరాల వివరాలు పరిశీలించితే ఈ నేరాలు అట్టే పెరిగినట్టు కనబడదు. ఈ కోవకు చెందిన నాలుగుదేశాలలోనూ ఇటలీ, హాలెండ్‌లలో శిక్ష రద్దుచేసిన నాటినుండి నేరాలు క్రమంగా తగ్గుతునే వచ్చాయి. ఇటలీలో 1945 లో 368 నేరాలు జరిగితే 1954 లో జరిగినవి 38 మాత్రమే. హాలెండ్‌లో 1946 ప్రాంతాలలో పదిలక్షలమందిలో 1.4 మంది ఈ నేరాలు చేశారు. దరిమిలా తగ్గినా 1952 లో మళ్లా ఆ స్థాయికి వచ్చాయి తిరిగి బాగా తగ్గిపోయాయి. స్విట్జర్లాండ్‌లో 1942 వ సంవత్సరంలో మరణదండన రద్దు చేశారు. 1949 లో జరిగిన నేరాలు 30 కాగా 1952 నాటికి 18 కి తగ్గింది. కాని దరిమిలా రెండేళ్లలోనూ పెరిగింది. అయితే ఈ నేరాలన్నీ హత్యానేరాలే కావు. మొత్తానికి, 1952 లోనే మరణదండన మళ్లా ప్రవేశపెట్టించడానికి ఒక ప్రయత్నం జరిగింది కాని, స్విస్ పార్లమెంటు తిరస్కరించింది. పోతే స్వీడన్‌లో 1921 లోనే మరణదండన రద్దు అయింది. దరిమిలా నేరాలు తగ్గుతూవచ్చాయి. ఈ నేరాల సంఖ్య 1949 లో 12 కాగా, 1950 లో 16 కు పెరిగింది కాని మరుచటి సంవత్సరం 15 జరిగాయి. 1953 లో పన్నెండు, 1955 లో పది జరిగాయి.

వీటినిబట్టి చూడగా మరణశిక్ష రద్దు అయినందువల్ల నేరాలసంఖ్య ఏమంత పెరగలేదని తేలుతోంది. ఆ మాటకొస్తే, ఒక్కరవ్వ తగ్గుతున్నాయనే అనిపిస్తుంది. ★

చెరగని మచ్చ

1950 లో బ్రిటన్‌లో టిమొతీ ఇవాన్స్ అనే యువకుడొకడు ఉరితీయబడ్డాడు. తన స్వంతకూతురు 14 మాసాల పిల్లను అతడు హత్యచేశాడని నేరం మోపబడింది. జాన్ క్రిస్టీ అనే వ్యక్తి సాక్ష్యం ఆధారంగా ఈ నేరాన్ని ఖాయపరచి శిక్షవిధించారు. ఈ సాక్షే తనకూతురును హత్యచేశాడని ఇవాన్స్ ఘోషపెట్టాడు. మూడేళ్లు తిరిగేసరికి, మరో హత్యానేరంపై జాన్ క్రిస్టీ ఉరితీయబడ్డాడు. దరిమిలా బయటబడ్డ కొత్త విషయాలవల్ల, ఇవాన్స్ నిర్దోషి అనీ, అతని కూతురును చంపినవాడు జాన్ క్రిస్టీయేననీ తెలిసింది. ఆదిలో ఇవాన్స్‌పై మరణదండన నిలుపడానికి నిరాకరించిన అధికారి దరిమిలా పార్లమెంటులో మాట్లాడుతూ పొరపాటు జరిగిందని చెప్పుతున్నాడు.



పులి ఎటునించి వచ్చిపడుతుందోనని లేడి జాగ్రత్తగా ఉంటుంది. లేడి ఎక్కడ పారిపోతుందోనని పులి అంతకన్న జాగ్రత్తగా ఉంటుంది. ఈ నాటకమే ఇక్కడాను ఒడుపుచూసి రివ్వున దూసుకువస్తున్న డేగ అంతకన్న ఒడుపుగా తప్పించుకోగల 'ప్రేరీ డాగ్'...

నాగరికతతోపాటు జనపదాలు విస్తరించినకొద్దీ, అరణ్యాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. లక్షలాది జంతువులకు, లక్షరకాల వాటికి ఆశ్రయమై, మనుష్యులకు దుర్భేద్యంగా ఉంటూవచ్చిన అమెరికన్ ప్రేరీ (అడవులవంటి పచ్చికబయళ్లు) ఈ తరహావే. మిసిసిపీనదినుండి రాకీపర్వతాలవరకూ, మెక్సికో సింధుశాఖనుండి కెనడా సరిహద్దువరకూ వ్యాపించిన ఈ విశాల ప్రాంతంలో పెద్దవీ చిన్నవీ, అనేక తరహాల జంతువులు

మానవులకు అమెరి

అసంఖ్యాకంగా ఉన్నాయి. మనుగడకోసం అవి పడేఅవస్థలూ, ఉపద్రవాలు వచ్చిపడ్డప్పుడు ఆత్మరక్షణకూ, స్వజాతిరక్షణకూ ఆ జంతుకోటి అవలంబించే మార్గాలూ, నిత్యజీవన విధానాలూ చూడ



తరిఫీదులేని, మచ్చిక కాని జంతుకోటి జీవనవిధానాలను వెండి తెర మీద మనోహరంగా చిత్రించిన వాల్ట్ డిస్నీ

తెలుసుకోవడం అసాధ్యం సాధ్యం అయితే అదో గొప్ప అనుభవం కార్టూన్ చిత్ర నిర్మాతగా పేరు గడించిన వాల్ట్ డిస్నీ, దీన్ని సాధించి, వెండి తెరకు ఎక్కించారు ఇటువంటి చిత్రం తీయడం డిస్నీకి తొలిసారి కాదు తరిఫీదు లేని, మచ్చికకాని, జంతుకోటి పాత్రలుగా సీల్ ఐలెండ్, బీవర్ వాలీ, నేచర్స్, హాఫ్ ఏకర్ అనే చిన్న చిత్రాలు లోగడ నిర్మించారు నిర్జీవప్రాంతం అనిపించే ఎడారిలో, జీవనరాగాన్ని

దుర్భేద్యమైన న్ ప్రైరీ

మనోహరంగా చిత్రిస్తూ నిర్మించిన 'లివింగ్ డెజర్ట్'తో, డిస్నీ సిద్ధహస్తుడని సర్వత్రా ప్రశంస లందుకున్నాడు.

ఈసారి అమెరికన్ ప్రేరీని అందులో జంతుజాలాన్ని, 'వానిషింగ్ ప్రేరీ'లో చిత్రించారు ఈ పుటలలో చిత్రాలు అందులోనివే.

ఈ ప్రేరీలో అమాంతం పెద్ద పెద్ద ఉపద్రవాలు వచ్చి పడుతూ ఉంటాయి ఏది వచ్చినా అతిగానే వస్తోంది అయితే అతివృష్టి కాపోతే అనావృష్టి అనావృష్టి వస్తే గడ్డి అంతా ఎండి ఉంటుంది ఎప్పుడో ఎక్కడో ఒక నిప్పురవ్వ బయలుదేరుతుంది దావాగ్ని చుట్టు ముడుతుంది. దాంతో జంతుకోటి అల్లకల్లోలం అయిపోతుంది. దిక్కు దారి



ఈ గుడ్లగూబలకి బుద్ధి నిలకడలేదు అవస్థలు తెచ్చిపెట్టుకోడానికి అవస్థపడతాయి. తీరా అవి వచ్చిపడ్డాక చిక్కు మొహం వేస్తాయి.

తోచని ఆ స్థితిలో కొండలంత ఉండే అమెరికన్ దున్నలు సన్నకారు జంతువులకు మరో ఉపద్రవం వాటిని అవే ఎదుర్కొంటూ ఉంటాయి ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని ఏలిన ఈ దున్నల జాతి క్రమంగా అంతరించిపోతోందట. ఈ దున్నలు తలవంచి, తోక పైకెత్తి, దేనిమీదకైనా దూకడానికి సిద్ధపడ్డపుడు, కళ్లు చింత నిప్పులకి మల్లె కణకణలాడుతాయట.

'ప్రేరీ డాగ్' అనే చిన్న జంతువు ఒకటి ఉంది ఉడతలా వుంటుంది. చెవుల పిల్లి అంత ఉంటుంది దీని పళ్లు మహా వాడి, బుద్ధి మహా చురుకు సాహసి బొత్తిగా పెద్దంతరం చిన్నంతరం లేదు. తనను చంపబోయే జంతువుతో సరసాలాడుతుంది. తెలియనితనంవల్ల ఆపదలో పడబోతుంది. కాని పడదు ఇక్కడి భీకర సంగ్రామ రంగంలో ఈ ప్రేరీ డాగ్ చిలిపి పనులు, అమాయకపు చేష్టలు, దానికి ఎలా ఉన్నా, చూసేవాళ్ళకి నవ్వు పుట్టిస్తాయి.

★



ప్రేరీ డాగ్ పళ్లు మహా వాడి. బుద్ధి మహా చురుకు. భయం లేదు. ఉపద్రవాలు తెచ్చి పెట్టుకుంటూ తప్పించుకుంటూ ఉంటుంది ఈ భీకర సంగ్రామ రంగంలో దీని చిలిపి చేష్టలు నవ్వు, జాలీ కూడా కలిగిస్తాయి.

ర స స

ఆవిడ కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నది. మహీధర్ శిలాప్రతిమలా నిశ్చలంగా ఆవిడకేసి చూస్తూ కూర్చున్నాడు. మహీధర్ మనసులో ఏదో కల్లోలంగా ఉంది. మబ్బుకమ్మిన చంద్రుడిలా ఉన్నది మహీధర్ ముఖం.

కలువ రేకుల్లాంటి కళ్ళు, సంపంగిలాంటి ముక్కు, ముత్యాల్లాంటి పలువరుస... ఇంకా ఏమి టేమిటో వర్ణిస్తారు, అందమైన ఆడవాళ్ళను గూర్చి. మహీధర్‌కు కవిత్వం రాకపోయినా ఆవిడను చూసిన క్షణంలో ఎప్పుడెప్పుడో పుస్తకాల్లో చదివి మర్చిపోయిన అందకత్తెల తాలూకు వర్ణనలన్నీ ఒకసారి స్మృతిపథంలో మెరిశాయి.

మిస మిసలాడే పసిమివర్ణంతో ఆవిడ ఎంతో నాజూకుగా సుందరంగా వుంటుంది. ఆమె కేవలం సౌందర్యవతి మాత్రమే కాదు. విద్యావతి కూడా. పసిడికి పరిమళ మబ్బిన చందాన ఆవిడ చదువు ఆవిడ రూపురేఖలకు మరింత అందాన్ని తీసుకువచ్చాయి. మహీధర్ ఆవిడ అందానికి ముగ్ధుడయ్యాడు. చదువుచూసి మురిసిపోయాడు. ఎంతపుణ్యం చేసుకోకపోతే అంత చదువుకున్న చక్కని చుక్క భార్యగా లభిస్తుందని పదే పదే తన అదృష్టాన్ని పొగడుకున్నాడు. నిజానికి మహీధర్ మహామేరువు దొరికినట్లు మహదానంద భరితుడయ్యాడు.

కాని అంత ఆనందంలోనూ అతనికేదో అసంతృప్తి, వెలితి కన్పిస్తున్నది.

అంత అందమైన అమ్మాయికి అందమైన పేరుంటే ఎంత బాగుండేది! కాకపోయినా యింత అసహ్యమూ, దుర్భరమైన పేరు ఉంటుందని ఎవరైనా ఊహించగలరా? ఆ అందకత్తె పేరు సరసమ్మ! చిక్కని పాలల్లో విషపు చుక్క ఒలికినట్టుంది! అది తలచుకుంటేనే మహీధర్‌కు మతిపోతున్నది. ఉల్లాసానికి బదులు మనసు కల్లోలంగా ఉంది.

అందమైన అమ్మాయికి అందమైన పేరు పెట్టుకోకూడదూ? అదేంమాట! అంతంగా లేనివాళ్ళకైనా అదేం పేర్లు? చూడటానికి బాగోకపోతే పేరైనా వినటానికింపుగా వుండొద్దూ? నిజానికి ఆడవాళ్ళకి అందమైన పేర్లు యెన్నెన్నో - కోల్లలు కోల్లలు-అదృష్టవశాత్తు తనకి మంచిపేరు పెట్టినా ఒకోపేరు వింటే మహీధర్‌కు తను ఆడపిల్లై పుట్టలేదే అని విచారంగా వుంటుంది. ఎంచి, ఎంచి యెంత మంచిపేరు పెట్టారు-సరసమ్మా - సరసమ్మ.

మహీధర్‌కు భరించరానంత ఏవగింపుగా వుంది. మహీధర్ చేతో చిటికె వేశాడు. ఆవిడ తలెత్తిచూసింది.

"నీ పేరు అంత అసహ్యంగా ఉందేమిటి? అడిగాడు మహీధర్ సంజాయిషీ చెప్పాలో మన్నట్టు ఆవిడకేసి దీర్ఘంగా చూస్తూ.

ఆవిడ ఓక్షణం మహీధర్ ముఖంకేసి మెల్లిగా తల దించేసుకుంది.

"పోనీ - ఏమని పిలవమంటావో చెప్పు?"

"బాగుంది - అందరూ పిలిచినట్టే సరసూ అనండి" అందావిడ సన్నగా నవ్వుతూ.

"సర్సూ, డాక్టర్! ఆ పేరింక నా దగ్గరెత్తకు-యాక్-ఛీ-తలచుకుంటేనే పరువు తక్కువ. పైగా పిలవటం కూడానా?" అంటూ ముఖం చిట్లించుకున్నాడు మహీధర్.

అసహ్యంతో అష్ట వంకర్లుగా మారిన మహీధర్ ముఖం చూసి ఆవిడ మెల్లగా నవ్వింది.

"నన్నేం చెయ్యమంటారు చెప్పండి! మా నాయనమ్మ పేరని వాళ్ళెంతో ముచ్చటపడి పెట్టుకున్నారు మరి..."

"ఏం నాయనమ్మో! అందరూ ఎంత నవ్వుతున్నారో నీకేం తెలుసు! నాకు నిజంగా తలకొట్టేసినట్టుంది. సిగ్గు—సిగ్గేస్తున్నది. నువ్వు మాత్రం ఏం పట్టనట్టు కూర్చున్నావ్!" అన్నాడు మహీధర్ మండిపడుతూ.

"మాస్టే నీకే పేరు నచ్చినట్టుంది!" రెట్టించాడు.

"బాగానే వుంది. నాకు నచ్చటమేమిటి? ఆ మాటకొస్తే నాకే కాదు. ఎవరికీ నచ్చదు. మీనా, బీనా లాంటి చక్కచక్కటి పేర్లన్నా నాకూ మనసు లేకపోలేదు." అందావిడ నిరాశ ప్రతిధ్వనిస్తున్న కంఠంతో.

మహీధర్ నవ్వాడు.

"అయ్యో రామా! అంతదాకా ఎందుకు? సీత, సావిత్రి, దమయంతి-వగైరా పురాణాల్లోని పేర్లు పెట్టుకున్నా ఇంతకంటె బాగుండునే? ఫ్యాషనుగా లేని పాత పేర్లే అనుకో అయినా ఈ సరసమ్మ, వెంకమ్మ, పుల్లమ్మలా సిగ్గుచేటుగా లేవుగా ఇన్ని మంచి పేర్లు వుండగా వాటి జోలి కెందుకెళ్ళాలో? అసలు వాటిని నిషేధిస్తే బాగుండును." అన్నాడు మహీధర్ కసిగా.

ఆవిడ కిలకిలా నవ్వింది. గలగల పారే సెలయేటి శబ్దంలా తీయగా వినిపించింది మహీధర్‌కి.

"పోనీ-ఓ చదువూ, సంధ్యా లేని పిల్ల అలాంటి పేరు పెట్టుకున్నదంటే అదో దారి. అంతేగాని—బి. ఏ. చదువుకున్న అమ్మాయి పేరు సరసమ్మ! ఎంత ఎబ్బెట్టుగా వుందో మాకు! కాదు కానీ—ఈ పేరుతోటి కాలేజిలో కూడా ఎలా చదువుకొచ్చావ్? రామ రామ! నాకే సిగ్గేస్తున్నది. నేనైతే చదువైనా మానేసే వాడిని కాని—అలాంటి పేరుతో అందరిలో తలెత్తుక తిరగటమే! నిజం చెప్పు! కాలేజిలో—అందులో—అందరి మొగాళ్ళముందూ నీకు చిన్నతనం వేసేది కాదూ?" అని అడిగాడు మహీధర్, ఆవిడ సిగ్గులేనితనానికి మహాశ్చర్య పడుతూ.

"నయం నా పేరు ఆడపేరులాగన్నా వుంది మా క్లాసులో యింకో అమ్మాయి వుండేది. ఆ పిల్ల పేరు బాలకృష్ణ ఆ పేరు విని లెక్చరర్‌తో సహా అంతా విరగబడి నవ్వారు. మరి నా పేరు నయమేనంటారా, కాదంటారా?" అందావిడ కొంటెగా నవ్వుతూ.

మహీధర్ మరి కాస్త ఆశ్చర్యపోతూ యిలా అన్నాడు. "మైగాడ్! ఇది మరీ ఘోరంగా వుంది! అందమైన ఆడ పేర్లన్నీ వదిలిపెట్టుకుని బాలకృష్ణని, బండ కృష్ణని మొగ పేర్ల మీద పడటమెందుకు? మొత్తానికి రెండూ రెండే. ఆడ పేరైతే మాత్రం ఏం ముచ్చట! ఆడ పేరా—అధ్వాన్నం పేరా! నిజంగా—ఈ పేరు బొత్తిగా బాగోలేదు. నువ్వు తక్షణం మార్చుకోకపోతే...!

మందరపు పద్మ, లలిత

వాక్యం పూర్తి చేయకుండానే ఆపేశాడు మహీధర్.

"ఏం చేస్తాను?" ప్రశ్నించిం దావిడ ముత్యాల్లాంటి పలువరుస కనిపించేటట్టు నవ్వుతూ

మహీధర్ సమాధానం చెప్పకుండా "అందులోనూ నాపేరు మహీధరైనప్పుడు - చూడు నరసమ్మా మహీధర్ అంటే పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వు రావటం లేదూ?" అన్నాడు సీరియస్ గా.

ఆవిడకు మహీధర్ ను మరికొస్త ఉడికించాలని బుద్ధి పుట్టింది

"మీది మరీ చిత్రం, ఎందుకు నవ్వుతారు లెద్దురూ? మా ప్రిన్సిపాల్ పేరేమో రంగధామారావు, ఆవిడ పేరేమో పేరమ్మ. అయితే నేం - పేరమ్మా రంగధామారావు అనడం లేదూ అంతా ఆవిడని? మీలా నవ్వుతూ కూర్చుంటున్నారా?" అంది ఆవిడ నవ్వుతూ కొంటెగా.

మహీధర్ మాత్రం ఆ పేరు పదే పదే అనుకుంటూ నిజంగా కాస్సేపు నవ్వుకుంటూనే కూర్చున్నాడు.

మరుక్షణంలో మహీధర్ భరింపరాని బాధపడుతున్న వాడిలా గట్టిగా మూల్గాడు.

"హు! మంచిపోలికే తెచ్చావ్! బి. సి నాటివాళ్ళు అలాంటి పేర్లు పెట్టుకున్నారంటే క్షమించవచ్చు కాని.. ఇప్పటి ఎడ్యుకేటెడ్ వాళ్ళుకూడా ఈ పేడమ్మ, పిడకమ్మలను పుట్టుకు ప్రాకులాడుతూంటే- హు-వాళ్ళి సెలా క్షమించటం? ఉహు! నువ్వు చక్కని పేరు పెట్టుకోవాలి! మహీధర్! ఎంత చక్కటి పేరు! చిత్రం కాకపోతే...దానికి పరిహారంలావుంది నీపేరు." అని నిట్టూర్చాడు మహీధర్.

"అక్కడేవుంది తమాషా అంతా. మా మీనా మొగుడిపేరు ఆంజనేయులు. మీనా ఎంత చక్కటి పేరు మరి! ఆంజనేయులంటే తోక-ఎత్తుమూతి జ్ఞాపకంవచ్చి నవ్వు రాదటండీ? అందరూ 'మనిషికూడా ఆంజనేయుల్లానే వుంటాడా?' అని ఒకటే విరగబడి నవ్వితే అది అసలే సిగ్గుపడుతున్నదేమో, మరికొస్త సిగ్గుపడిపోయి మొగుడికి మెల్లిగా నచ్చచెప్పి ఆఖరికి పేరు మార్పించేసింది."

"ఏమని మార్చుకున్నాడేం" అని అడిగాడు మహీధర్ ఆత్రుతగా.

"మీరు చెప్పుకోగలరో లేదో చూడాలి! నేను చెప్తే ఎలా?" అంది చిలిపిగా.

"వాళ్ళమ్మ కతను కడుపులో వుండగా కోతి కలలో కనిపించాడట. దాంతో ఆపేరె పెట్టేశారతనికి. ఆ పేరు మార్చుకుంటే ఏం పాపమోనని అతను కొద్దిగా తటపటాయించాడు కూడా. మీనా మాత్రం యింతెత్తు ఎగిరింది 'డామిట్! కోతి కనుపించిందని కోతిపేరు, పాము కనుపించిందని పాము పేరు పెట్టేసుకోవడమేనా ఏమిటి అందం చందం లేకుండా' అని, మీనా ఎంతెంత మంచి పేర్లు సెలక్టు చేసిందనుకున్నారు!" అందావిడ కళ్ళు పెద్దవి చేస్తూ.

"అయ్యో! పాపం! చాలా కష్టపడిపోయిందిలే" అన్నాడు మహీధర్ మూతివంకరగా తిప్పి నవ్వుతూ.

"కష్టం కాదుటండీ మరి! ఎన్ని పేర్లు చెప్పినా అతను పెదవి విరచటమే! మధుసూదన్ అని పెట్టుకోమంటే 'ఇదేం పేరు ధన్-ఫన్-దభేల్'మని పడిపోయినట్టుంది' అని ఒకటే వెక్కిరింపు పోనీ గిరిధర్ నచ్చిందా అంటే అదీ లేదు. 'గిరి' అని వస్తే అతని తల గిర్రున తిరుగుతుందట. ఇలా ఎంతెంత మంచిపేర్లు తోసిపారేశాడనుకున్నారూ? చివరకు అతను 'పోనీ! ఆంజనేయులకి అందమైన పేరేమైనావుంటే చూడు' అని చెప్పాడట. మీరు చెప్పండి చూద్దాం. తెలుగులో ఎంత పండితులో ఈ దెబ్బతో తెలిసిపోతుంది" అందావిడ పకపక నవ్వుతూ

మహీధర్ ఒక నిమిషం మౌనం దాల్చాడు.

"కోతి, తిమ్మన, వానరం - ఇవి మినహాయించుకుంటే ఆంజనేయులుకి ప్రత్యేకంగా ఇంక ఒక్క హనుమంతుడనేకదూ వుంటా? ఈ పేరు ఆంజనేయులకంటె ఏం తీసిపోదు మరి?" అని నవ్వాడు మహీధర్.

"ఇంతలోవుంది తెలివి" అని నవ్విందావిడ.

"నేను 'అంజనీ కుమార్' అని పెట్టుకోమని చెప్పాను. అది నచ్చలేదతనికి!' 'అదేమిటి! ఆడపేరుకి కుమార్ తగిలించేశారు! అందరూ 'అంజనీ, అంజనీ' అని ఆడపేరెట్టి పిలుస్తే నాకు ఒళ్ళు చచ్చినట్టుంటుందిసుమండీ' అని అతనంటే మీనా ఒకటే పగలబడి నవ్వింది ఆఖరికి ఆలోచించగా మీనాకే తట్టింది మంచిపేరు. అనిల్ కుమార్! అందాని కందం, అర్థాని కర్థం రెండూ కలిసివచ్చాయి, బాగుంది కదండీ?"

"ఆ - అందంగానూ వుంది, అతనికి తెంగా తప్పింది మరింకే పాపమూ అతనికి అంటుకోదులే." అని నవ్వాడు మహీధర్.

"సరే! వాళ్ళ గొడవలోపడి అసలు విషయం అడుగున పడిపోయింది. ఇంతకీ నువ్వే పేరు పెట్టుకుంటావో చెప్పు?" అని లాలనగా అడిగాడు మహీధర్.

"నే నింతవరకూ ఆలోచించందే! మీరే మైనా సజెస్ట్ చెయ్యండి. బాగున్న పేరు పెట్టుకుంటాను." అంది ముద్దులొలికిస్తూ ఆవిడ.

మహీధర్ ఆలోచన కుపక్రమిస్తుండగా ఆవిడ హఠాత్తుగా "ఇలా నిమిషాలమీద ఆలోచిస్తే కుదరదు. రేపటికి బాగా ఆలో

చించి మంచి మంచి పేర్లన్నీ ఒకచోట రాసిపెట్టండి. నేనుకూడా యీలోపల ఆలోచిస్తాను. మంచిపేరు పెట్టుకోవాలిగా మరి, అదరాబాదరా పెట్టేసుకుంటే ఎలా?" అంది కుర్చీలోంచి లేస్తూ.

మహీధర్ తలూపాడు.


"శేష్! బాగా చెప్పావు! నాదగ్గర బోలెడన్ని పుస్తకాలున్నాయి. వాటిలోని పేర్లూ, నాకు తెలిసిన పేర్లూ అన్నీ ఒకచోట రాసిపెడతాను. నువ్వు కూడా మంచి మంచి పేర్లు జ్ఞాపకం చేసుకుంటూ వుండు"

పిల్లలు పుట్టబోయే ముందు కాని, పుట్టేక కాని భార్యాభర్తలు పేర్లకోసం హైరానా పడటమంటూ వుంది. కాని, పెళ్లానికే నామకరణం చేయాల్సి వస్తుందని ఎవ్వరనుకోగలరు? ఏంచేయటం? మహీధర్ అదృష్టం అలానే వుందిమరి!

మహీధర్ పుస్తకాలన్నీ గాలించిగాలించి పేర్లన్నీ చక్కగా ఓ పెద్ద లిస్టు తయారు చేశాడు. మహీధర్ లిస్టుతో దగ్గరకురాగానే ఆవిడ నవ్వింది.

"రెడీ?"

"ఆఁ రెడీ!" అని సిద్ధంగా కూర్చుంది.



మహీధర్ కాయితాన్ని ఆవిడ ముంగురు తోశాడు.

"ఏహ ఒకొకటితో చెప్పదురూ?"

"నే నవన్నీ చూడలేను" అందావిడ బద్ధకంగా కాగితాన్ని వెనక్కి నెట్టుతూ.

"ఒకే అక్షరంగలపేరు-శ్రీ-" అన్నాడు ఆవిడకేసి పరిశీలనగా చూస్తూ.

ఆవిడ పకపకా నవ్వింది: "ఒక అక్షరంతో పేరేమిటండీ ఎక్కడా వినలేదు. శ్రీమతి అనో, శ్రీదేవనో పెట్టుకుంటారు గాని.. శ్రీ! స్త్రీ అని పెట్టుకుంటే మరీ బాగుంటుంది!"

"శ్రీ అంటే లక్ష్మి. లక్ష్మి అని పెట్టుకున్నప్పుడు శ్రీ అనిపెట్టుకుంటే తప్పేం?" అన్నాడు మహీధర్ హాస్యధోరణిలో.

"తప్పో, ఒప్పో నా కవన్నీ తెలీదు. నాకు బాగోలేదు. సరా! ఊఁ! ఇంకా చెప్పండి."

"రెండక్షరాల పేర్లు బోలెడన్ని. వీణా..." కుతూహలంగా చూశాడు మహీధర్.

"ఆ! బాగుంది! ఇంకా ఫిలేలు, హారోత్ర నియం అని పెట్టుకోమన్నారుకాదు" అంది వెక్కిరింపుగా మూతి తిప్పుతూ.

"వాణీ, మీనా, లత, ఆశా..."

ఆవిడ ముఖం చిట్లించుకుని తల అడ్డంగా తిప్పింది.

"అబ్బబ్బ! ఎక్కడవిన్నా ఇవే కొత్త కొత్త పేర్లూ, సాధారణంగా ఎవరూ పెట్టుకోనివి చెప్పండీ" అంది.

"కొత్త కొత్త పేర్లా-వూ-ఉండు చెప్తా-ఆ-హీరా! హీరా! అందంగాలేదూ! సాధారణంగా ఎవరూ పెట్టుకోరుకూడా" అంటూ మహీధర్ ఆత్రుతగా చూశాడు

ఆవిడకు నవ్వొచ్చింది "హీరా! హీ-హీ-హీ-హీరా! ఏమిటండీ ఇది 'హీరో'లా వుంది? పిలవటానికికూడా ఎంత కష్టమో చూడండి. హీ-రా! హీ-రా!" అంది నొక్కి నొక్కి పలుకుతూ.

మహీధర్ కూడా నవ్వాడు.

"మరి రెండక్షరాలలో యింతకంటె మంచివి లేవు. మూడక్షరాలలో.. భ్రమర?"

"భ్రమర అంటే నాకు బమ్మెర పోతన జ్ఞాపకం వస్తాడండీ" అంది అదేపనిగా నవ్వుతూ.

"పోనీ-ప్రఫుల్ల-మంచిపేరుకదూ?"

ఆవిడ చేతులడ్డం పెట్టుకుని నవ్వినంత సేపు నవ్వేక, "ప్రఫుల్ల-పందుంపుల్ల" అంది వెక్కిరింపుగా.

మహీధర్‌కి నవ్వొచ్చినా నవ్వకుండా లిస్టు జేబులో పెట్టేసుకుని "ఏ పేరుచెప్పినా ఏదో వంకలు పెడతావుమరి. నేనేదైనా స్వయంగా ఆలోచిస్తానుండు" అన్నాడు.

మహీధర్ కాస్సేపు కళ్లు మూసుకుని ఆలోచన సాగించారు

"హియర్! హియర్! అబల అంటే అమోఘంగా వుండదూ?" అన్నాడు మహీధర్ సంతోషంగా.

"నయం ఇంకా 'తబలా' అని పెట్టుకోమన్నారు కాదు. ఇంక మీ కవిత్వం కట్టిపెట్టి నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి" అని ఆవిడ నిశ్చలంగా కూర్చొని ఆలోచించడం మొదలెట్టింది. మహీధర్ మౌనం దాల్చాడు.

మెరుపులా మంచిపేరు- తట్టిందావిడకి. ఒక్కసారి ఎగిరి గంతేసింది.

"భలే మంచిపేరు! నా పేరేమిటి చెప్పండి?" అంది ఆవిడ ఆనందోత్సాహంతో మెరుస్తున్న కళ్లని మహీధర్ వైపు తిప్పుతూ.

"అలా తెలబోతారేం? నా పేరండీ - మీ రసహ్యించుకుంటారే? అది!" అంది ఆవిడ అయోమయంగా చూస్తున్న మహీధర్ నుద్దేశించి

"నరసమ్మ-అదేనా?" అన్నాడు మహీధర్ సందేహంగా చూస్తూ.

"అమ్మ ఎందుకూ?'నరస' అంటురూ."

"'నరస' - అబ్బే' యిదేం బాగుంది! ఇంతా చేస్తే 'అమ్మ' ఒకటి తీసి పారేస్తే తీరిపోతుందనుకుంటున్నావు కాబోలు, ఇన్ని పేరు నచ్చక ఆఖరికి యిదే నచ్చిందీ నీకూ! అదేం వీల్లేదు. ఇక నిమిషంకూడా నేనా పేరు భరించలేను" అన్నాడు మహీధర్ చల్లగా చివాట్లు వేస్తూ.

"చక్కటి పేరు ఆలోచించానంటు... చెప్పేది వినిపించుకోరేం?" అందావిడ కాస్త వినుగ్గా మొహం పెట్టి

"ఏం పేరు?" అని కుతూహలంగా ముందుకు వంగాడు మహీధర్.

"రసన ఎలా వుంది?" ఆవిడ కుతూహలముగా మహీధర్‌ని చూసింది.

రసన! మహీధర్‌కి చాలా బాగుంది. అయినా యింతకీ ఆవిడకి నచ్చింది అంతే చాలు!

"శేష్! ఇంతమంచి పేరెలా తట్టింది నీకూ?" అన్నాడు మహీధర్ ఆవిడ నభినందిస్తూ.

"ఏంలేదు. నా పేరు 'నరస' లోని 'న' ఆఖరున పెడితేసరి - అందమైన పేరుగా మారింది," అందావిడ విజయగర్వంతో.

"రసనా" అని పిల్చేడు మహీధర్ ముద్దుగా.

రసన అంబాలోతికిస్తూ కిలకిలా నవ్వింది.

★

తెగని బంధం

'ఉత్తరం వ్రాయటానికేమండీ మీదంతా మరీ యిది...' సుజాత, మధు పడుకున్న పడక కుర్చీ వెనకవైపు చేతులు ఆనించి అడుగుతోంది

'నాకేమీ పాలుపోవటం లేదే, వుత్తరం రాస్తే ఓ తంటా రాయకపోతే యింకో తంటా' మధు వెనక్కు తిరిగి ఆలోచనగా సుజాత కళ్ళల్లోకి చూస్తున్నాడు.

'మీరు మరీ భయస్థులు, మీరు వూరుకోండి, నేను రాస్తాను వుత్తరం...'

'అమ్మో యింకేమున్నా వుందా! కొంప మునిగిపోదూ...! అసలేమండిపడుతున్నాడు మనమంటే...'

'నిజం చెప్పండి వారి కోపానికి కారణం యేమిటి...'

'నిన్ను పెళ్ళి చేసుకోవటమే...' మధు గబుక్కున అనేశాడు.

'ఒక్క నాటికి కాదు. వారు చెప్పింది మీరు వినలేదని...'

'ఏదయితే యేమయింది కనక...సుజాతా నాకో వుపాయం తట్టుతోంది. నువ్వు పాప వెళ్ళండి, నే నెమో...'

'అమ్మో మే మిద్దరమే, యింకేమన్నా వుందా? కొంప మునిగిపోదూ?'

మధు, సుజాతలు పకపక నవ్వారు.

'నేను యెన్ని విధాల ఆలోచించినా, మా నాన్న, నన్నుకనక చూశాడంటే మండి పడక మానడు. చివరకు తలొక మాట అనాలసి వస్తుంది. ఘర్షణ పెరిగి పోతుంది. ఇప్పుడవుతే తలోనియాల వున్నాం. దాని తర్వాత యీ మాత్రం మనశ్శాంతి కూడా వుభయులకు లేకుండా పోతుంది...' మధు విచారంగా కూర్చున్నాడు.

'అట్లా అని యీ విధంగా యెన్నాళ్ళు కాలం గడుపుతాం...మీ అమ్మ, మీ నాన్న, మీ పెళ్ళివిషయంలో యెంత తాపత్రయ పడ్డారో మీరే చెపుతూ వుంటారు గద!.. ...పోనీ తప్పో వప్పో, పెళ్ళి క్షమించమని కోరితే......' సుజాత యేదో వుపాయం చెప్పినట్లు చెప్పింది.

'క్షమార్పణ కోరుకోవటానికి నేను యెప్పుడైనా సిద్ధమే...ఆనాడు నేను వెళ్ళిపోతుంటే, నా కంఠంలో ప్రాణం వుండగా యీ యింట్లో అడుగు పెటనివ్వను అన్నాడు మా నాన్న, ఆయన మహా పట్టుదల మనిషి. ఓసారి మా బాబాయికి మా నాన్నకు మాటా మాటా వచ్చి, యింతవరకు కూడా వాళ్ళింటికి వెళ్ళలా. మా బాబాయి యెన్నో విధాల బ్రతిమాలుకుని చెప్పాడు. మా నాన్న మాత్రం ఖచ్చితంగా సమాధానం చెప్పేవాడు రానని...నాకు భయంగా వుంటుంది ఆయన దగ్గరకు వెళ్ళటం అంటే...' మధు పిచ్చివాడులాగ అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.

సుజాతకూడా నిర్ఘాంతపడి నిలబడిపోయింది

ఇంతలో పాప లో పై నో మసలుతున్నాడు. గబగబ వెళ్ళి చిచ్చికొట్టింది సుజాత.

సుజాత మనస్సు అనేక విధాలుగా పోతోంది. నలుగుర్లోంచి వచ్చిన మనిషి మళ్ళీ నలుగుర్లో ఉండాలని తాపత్రయ పడుతోంది. భర్త ఆఫీసునుంచి వచ్చేవరకు ఇంట్లో బిక్కు బిక్కుమని, ఆ పాపను పెట్టుకుకూర్చుంటే, ఆమెకు తృప్తిగా లేదు అత్త, మామ, ఆడబిడ్డా అందరూ వున్నారు కాని సుజాత అక్కడికి వెళ్ళటానికి వీల్లేదు. వాళ్ళు ఇక్కడికి వచ్చే అవకాశం కనిపించటం లేదు. సుజాత మథనపడివలిగిపోతోంది. ఉక్రోషం ఎక్కువయిపోతోంది. తనభర్తకు మామగారికి పోట్లాటఅవుతే, తనకు మామగారికి విరోధం ఏమిటి, తానే స్వయంగా వెళ్ళి, వాళ్ళకు నచ్చచెప్పుతాను. అప్పుడు కూడా ఆయన పట్టుదల వదలకపోతే! కొడుకునే వెళ్ళగొట్టినవాడు, కోడలిని స్వీకరిస్తాడా! సుజాత పిచ్చి పిచ్చిగా యేవేవో ఆలోచించుకుంటోంది. పాప, నిద్రనుంచి లేచాడు. ఏడవటం మొదలుపెట్టాడు. పాపను సముదాయిస్తూనే, కళ్లు రెండు తుడుచుకుంది సుజాత.

ఆరుగంటలు కొట్టింది గడియారం. మధు ఇంటికి వచ్చేశాడు సుజాత మూతి ముడుచుకుని గదిలోనే కూర్చుంది.

మధు వచ్చినసంగతి గమనించి కూడా అక్కడనుంచి కదల్లేదు. మధు నాలుగు మూలలా చూస్తూ, గదిలోకి వచ్చాడు.

'ఇంట్లోకి ఇంకెవరు వచ్చినా ఇంతేగా' మధు సుజాతవైపుకు కోరగా చూశాడు.

'మీరు వస్తున్నట్టు చూశాను, అందుకనే తలుపుతీసి ఇక్కడకువచ్చి కూర్చున్నా...' ముభావంగా వూరుకుంది సుజాత.

'ఈ తెలివి తేటలేమిటి...నీకు అక్కడికి వెళ్ళి ఉండాలంటే, ఇవ్వాళే వెళ్ళిపో, గుర్తుకోసం, ఈమె నాభార్య, వీడు నా కుమారుడు అని ఓ ఉత్తరంముక్క రాసిస్తా...' మధు కోపంగా అన్నాడు.

'అసలు మీరు వెళితేనే ఇదిలేదు. ఇక మీ ఉత్తరం...అలాంటి పరిస్థితే వస్తే, మేమే వెళ్ళి, వీరు ఫలానా అని మిమ్మల్ని పరిచయం చేస్తాంలెండి, భయపడకండి...' సుజాత నవ్వుతూ అంది.

మధు కోపమంతా దిగజారిపోయింది.

'నలుగురు నన్ను అడుగుతున్నారండి. మీ అత్తగారు, మీ మామగారు ఎక్కడని. వాళ్ళందరికి సమాధానాలు చెప్పలేక సతమతమయిపోతున్నాను...' సుజాత విసుగ్గా అంది.

'రేపటినుంచి, అట్లా అడిగేవాళ్ళందరిని, నాదగ్గరకు పంపించు. నేను సమాధానం చెప్పి పంపిస్తా...' మధు ధీమాగా అన్నాడు.

'నన్ను అడిగేవాళ్ళు, మీ దగ్గరకు వచ్చి అడుగుతారేమిటి...మిమ్మల్ని అడిగేవాళ్ళు మీకుమాత్రం లేరేమిటి...'

మధు ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

'ఉండరా వకటే యేడుపు నువ్వు... తాతగారిదగ్గరకు తీసుకు వెళతానే...ఏడవకమ్మ ఏడవక...' సుజాత లాలిపాట పాడుతోంది.

'మనం తింటే చాలు చివాట్లు...అర్థం శుభం తెలీని ఆ పసిపాపకుకూడా చివాట్లు పెట్టించాలేమిటి...' మధు పాపను తీసుకున్నాడు.

'నేను యెంతసేపు ఆలోచించినా, వకటే వుపాయం తట్టుతోంది. మనం ముగ్గురం వెళ్ళటం, క్షమార్పణ కోరుకోవటం, అప్పటికికూడా అంత కఠినంగానే వుంటే, తర్వాతసంగతి తర్వాత చూసుకుందాం...' సుజాత నిర్ణయాన్ని ఖచ్చితంగా చెప్పేసింది.

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

★ తెగని బంధం ★

మధుకూడా యీ సలహాకు సమాధాన పడుతున్నా ఓ మూల భయంగానే వుంది.

'తీరా మనం వెళ్ళి, వాళ్లను రెచ్చగొట్టిన వాళ్ళం అవుతామేమోనని భయంగా వుంది....' మధు సందిగ్ధంగా అన్నాడు.

'ఆ పిల్ల పెళ్లియిందండీ...' సుజాత హఠాత్తుగా ఓ ప్రశ్న వేసింది.

'ఏ పిల్ల?...'

'మీ నాన్నగారు కోడలుగా చేసుకుందామనుకున్న పిల్ల...'

'ఏమో యెవరికి తెలుసు? ఆ నాడు పెళ్లిచూపులకంటూ వెళ్లాను. తర్వాత వాళ్ళ విషయమే నాకు తెలీదు...అయినా, ఆ పిల్ల పెళ్ళిమాట యిప్పుడెందుకు వచ్చింది...'

'ఆ అమ్మాయి పెళ్ళికాక అవుతే, మీ నాన్నగారు కొంచెం శాంతిస్తారేమోనని...'

'ఆ అమ్మాయి పెళ్ళి దిగులు మా నాన్నకేం పట్టా నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని మాత్రమే ఆయన పట్టుదల అది కాస్తా యెదురు తిరిగింది...'

'నన్నింతవరకు మావగారు చూడ లేదుగా...'

'ఆ...చూస్తే, నీ అందం చూసి మూర్ఛపోయి, రారా నాయనా, యెంత అందమైన భార్యను కట్టుకున్నావురా అని నెత్తిన యెక్కించుకుంటాడు; అంతేనే నీ వుద్దేశం...' మధు ఆపుకుని ఆపుకుని నవ్వాడు

'నా అందం చూసి మూర్ఛపోవలసిన వారే, మూర్ఛపోవటం లేదు... ఇంకా మిగతా వాళ్ళ సంగతి నాకెందుకు...' సుజాత కోపంతో అన్నది.

'నీకు అంత మోజుగా వుంటే, నీ అందాన్ని గురించి తీరుబడిగా ఓ రోజు పొగడతాలే, నువ్వు భయపడక...'

'ఈ మాటలకేం కానీండి, మనం యెట్లాగైనా వెళ్ళి తీరాలి.' సుజాత గట్టిగా పట్టు పట్టింది.

ఆ రాత్రంతా మధు ఆలోచిస్తూనే పడుకున్నాడు. మధుకు వేరే గత్యంతరం లేక సరేనంటూ ఒప్పుకున్నాడు. అయితే ఓ షరతుమాత్రం పెట్టాడు: 'ఆయన యేమన్నా మనం మాట్లాడకూడదు. అంత పెడసరంగా వుంటే మాత్రం మెదలకండా మన దారిన మనం వచ్చెయ్యటమే గాని ఆయనతో ఘర్షణ పెట్టుకోకూడదు' ఈ రెంటికి సుజాత కూడా అంగీకరించింది.

వాకిట్లోకి బండీ వచ్చి ఆగింది. నాలుగు తలుపులు వేసి, తాళం గట్టిగా వేశానో లేదో అని రెండు మూడు సార్లు లాగి చూసి, మధుకూడా బండీ యెక్కాడు. బండీ యెక్కాడన్నమాటే గాని, మధుకు బెరుకుగానే వుంది జరగబోతాయనుకుంటున్నవన్నీ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయి మధుకు. రైలు స్టేషను వచ్చేలోగా, మధు, సుజాత ఎంతో ఘర్షణ పడ్డారు. ఓ సమయంలో, 'నేను రానులే' అంటూ మధు బండీ కూడా దిగాడు మళ్ళీ యేమనుకున్నాడో యేమో మెదలకండా వచ్చి బండీలో కూర్చున్నాడు. మనస్సు వెనక్కు ముందుకు లాగుతున్నా, బండీ మాత్రం, ముందుకే పోయి స్టేషను దగ్గర ఆగేసింది.

ఇక రైల్లో యెక్కినప్పటినుంచి, మధు ఆవేదన యెక్కువయిపోతోంది. సుజాత పిరికితనాన్ని వెనక్కు నెట్టేసుకుని, హృదయం చిక్కబట్టుకుని, బింకంగా కూర్చుంది. ఓ విధమైన ధైర్యాన్ని తెచ్చుకుంటోంది. ఎంత ప్రతికూల వాతావరణం కృత్రిమంగా కనిపిస్తోందో, అంతగా ధైర్యం తెచ్చుకుంటోంది. మధు పిరికితనానికి తోడుగా అలాంటి భయ సందేహాల్నే తెచ్చుకుంటున్నాడు. రైల్లో మాత్రం, ఇద్దరూ కూడా ఎవరి మనస్సుల్లో వాళ్లు ఆలోచించుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. వచ్చిపోతున్న స్టేషన్ల ఆమాత్రం కూడా మధు పట్టించుకోవటం లేదు సుజాత, బండీ ఆగినప్పుడల్లా కిటికీలోంచి బైటకు చూసి ధైర్యాన్ని తెచ్చుకుంటోంది మధు పరధ్యాన్నంగా వుండటం చూసి, సుజాత ఒకటి రెండు సార్లు మెల్లిగా హెచ్చరించింది, ఇంకా యెన్ని స్టేషన్లు ఉన్నాయో గమనిస్తున్నారా అని. మధుకు ఇంకా పిరికితనం ఎక్కువయిపోతోంది. సుజాత ధైర్యంతోను, మధు పిరికితనంతోను సంబంధం లేకుండానే, రైలు కాస్తా భట్టిప్రోలు స్టేషన్లో వచ్చి ఆగింది మధు గభాలున ఉలిక్కిపడ్డాడు సుజాత, పాపను హృదయానికి గట్టిగా అదుముకుని లేచి నిలబడింది. ఓ కూలిమనిషి చిన్న పెట్టెను, నెత్తిమీద పెట్టుకుని ప్లాటుఫారం మీద నిలబడ్డాడు. రైలు పెద్దకూత వేసి, నడకసాగించింది. పోతున్న రైలువైపు దిగాలపడి చూస్తూ, నుంచున్నాడు మధు కూలీమనిషి నడవండీ అన్నాడు. మధు తత్తరపడుతూ టిక్కట్లు గేటులో ఇచ్చేసి, బైటపడ్డాడు. మధుకు అంతా అయోమయంగా వుంది. ఆ వూరును వదిలిపెట్టి, సుమారు ఏడాదిపైన అయింది. ఆ వూళ్లో అన్నీ తనకు పరిచితాలే. కాని ఈ ఏడాది ఎడబాటుతోను తనలో ఎంతో మార్పు వచ్చేసింది తనకు సన్నిహితులైన వాళ్లెవరూ కనిపించలేదు. తనతో పరిచయం ఉన్నవాళ్లు కూడా, చూసీ చూడకుండా తలలు వంచుకుని వెళ్ళిపోతున్నారు. ఆ రోడ్డు, ఆ కాలవ, ఆ మార్కెట్టు ఇంకా అనేకమైన అచేతనాలు, మధుకు అతి సన్నిహితం అయినాయి. తాను, తన తల్లిదండ్రులకే దూరమయిపోయాడు, ఇంక ఇతరులు తనకు దూరం కావటంలో ఆశ్చర్యమేముంది అనుకున్నాడు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, బండీవెనకాల వస్తున్నాడు.

'ఏమిటండీ, ఈ వూరు వచ్చేసిన తర్వాత కూడా ఇంకా భయమేమిటి, మీరు కూడా బండీ ఎక్కండీ' అన్నది సుజాత.

ఆ మాటలు విని బండీవాడు ఎద్దును ఆపేశాడు. వంకరలు వంకరలు తిరుగుతూ, బండీ కాస్త, మారుమూలగా వున్న మండువా యింటిదగ్గర ఆగింది.

మధు తడబడుతూ దిగాడు. అతని ఆలోచనలన్నీ యింకో విధంగా మారిపోయినాయి ఆ వూరు మాటే మరిచిపోయాడు. తండ్రి అన్న మాటలు, చెవుల్లో గింగురుమన్నాయి

(56 పేజీ చూడండి)

జూల్స్ వెర్న్

ఒకసారి ఒక పెద్దమనిషి ఫ్రెంచి విద్యాశాఖమంత్రిని చూడడానికి వెళ్ళాడు. విద్యాశాఖమంత్రి అతన్ని చూస్తూనే ఒక కుర్చీ చూపించి—

"మీరు ప్రపంచంఅంతా చుట్టివచ్చి బాగా అలసిపోయివుండాలి. దయచేసి ఆ కుర్చీమీద కూర్చోండి!" అన్నాడు.

అతడే జూల్స్‌వెర్న్. నిజానికి అతడు ప్రపంచంఅంతా చుట్టిరానూ లేదు అలసిపోనూ లేదు. అతడెప్పుడు ఇల్లువిడిచిపెట్టి వెళ్ళేవాడు కాదు 40 ఏళ్ళుగా అలాగే ఒకే గదిలో కూర్చుని ఆరేసి నెలల కొకొక్క పుస్తకంచొప్పున రాసిపారేస్తుండే వాడు.


ముందుకాలంలో బయలుదేరబోయే అత్యద్భుత వైజ్ఞానిక విచిత్రాలూహించడంలో జూల్స్‌వెర్న్ గట్టిదిట్ట.

రేడియో రావడానికి ఎంతో కాలంక్రిందటే అతడు టెలివిజన్‌నుఊహించాడు రైట్ సోదరులు విమానాలు కనిపెట్టడానికి 50 ఏళ్ళకు పూర్వమే హెలికాప్టర్ స్వరూపం ఊహించాడు. జూల్స్‌వెర్న్ విక్టోరియా యుగంలో జన్మించిన మనిషైనా అతడు నేటికాలపు జలాంతర్గాములు, విమానాలు, టాంకులు మొదలైన వింతలన్నీ కళ్ళకు కట్టినట్టుగా చిత్రించాడు. వైజ్ఞానిక విషయాలపై మొట్టమొదటగా నవలలు రచించిన గౌరవం జూల్స్‌వెర్న్‌కే దక్కుతుంది.

అయితే వెర్న్ భవిష్యత్కాలంలో విచిత్రాలను గమనించి వ్రాసినవి వట్టి కాకమ్మ కథలు కావు. అతడు వ్రాసిన ప్రతిచిన్న విషయము అతిజాగ్రత్తగా ఊహించి వర్ణించేవాడు. ఆకాలంలో శాస్త్రవేత్తలు, గణిత శాస్త్రవేత్తలుకూడా అతని వర్ణనలు చదివి వాటిని గురించి వారాలతరబడి వాదోపవాదాలు సాగించేవారు.

తరవాత చాలాకాలానికి ఉత్తర ధ్రువం చేరుకున్న ఎడ్మిరల్ బైయర్డ్ జూల్స్‌వెర్న్ రచనలే తన ఘనవిజయానికి దారిచూపించాయని అన్నాడు. విఖ్యాత వార్తాప్రసారం సాధించిన శాస్త్రజ్ఞుడు మార్కొనీ కూడా తాను జూల్స్‌వెర్న్‌కు ఎంతో ఋణపడిఉన్నానని అంగీకరించాడు. జూల్స్‌వెర్న్ జీవితకాలంలో తానూహించిన అత్యద్భుత వైజ్ఞానిక విచిత్రాలెన్నిటినో కళ్ళారా చూచి ఆనందించాడు.

జూల్స్‌వెర్న్ 1828 వ సంవత్సరంలో నాంత్ నగరంలో జన్మించాడు. అప్పటికి నెపోలియన్ చక్రవర్తి చనిపోయాడు. మొట్ట



మొదటగా వేసిన రైల్వేలైను అప్పటికి అయిదేళ్ళకు పూర్వమే పూర్తిఅయింది. అప్పటికి అట్లాంటిక్ సముద్రంలో ప్రయాణంచేసే స్టీమర్లకింకా తెరచాపలు కట్టడం మానలేదు.

జూల్స్‌వెర్న్ 18 వ ఏట లా కాలేజీలో చేరాడు. కాని అతనికి కవిత్వం, నాటకాలు రాయడం అంటే చాలా సరదా. చాలా చమత్కారంగా మాట్లాడేవాడు. ఎంతటి వాళ్ళనైనా లక్ష్యపెట్టేవాడుకాడు.

జూల్స్‌వెర్న్ ఒకనాటి సాయంత్రం టీపార్టీకి వెళ్ళాడు. అక్కడ ఏమీ కాలక్షేపం కాక ప్రాణంవిసిగిపోయి మెట్ల పక్కనే కట్టిన కమ్మీలమీదనుంచి ముళ్ళగా క్రిందికి దిగజారాడు. క్రిందికిజారుతూ ప్రసిద్ధ ఫ్రెంచిరచయిత అలెగ్జాండర్ డ్యూమాస్ మీద విరుచుకపడ్డాడు. అప్పటినించీ ఆ ఇద్దరికీ బాగా స్నేహం కలిసింది.

ఆ తరువాత వారిద్దరు కలిసి ఒక నాటకం రాశారు. అది కొంత పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. అప్పుడే అతడు వైజ్ఞానిక నవలలు రచించాలని నిశ్చయించాడు. ఆటు పిమ్మట కొంతకాలానికి తండ్రి ఆసరా చూసుకుని స్టాక్ బ్రోకర్ వ్యాపారంలో ప్రవేశించాడు. దానితో జూల్స్‌వెర్న్ బాగా పచ్చబడ్డాడు. ఆరోజుల్లో అతడు చిన్నపిల్లలకు తెలిసే తేలిక భాషలో శాస్త్రీయ వ్యాసాలు రాస్తూండే వాడు.

మొట్టమొదటగా జూల్స్‌వెర్న్ 'బెలూన్‌లో అయిదువారాలు' అనే నవల రచించాడు రచన ముగిసిపోగానే అతడదివరసగా 15 గురు పుస్తక ప్రచారకర్తల దగ్గరికి పంపించాడు. వరసగా 15 గురు అది మాకక్కర్లేదని తిప్పిపంపించేశారు. ప్రాణం విసిగి జూల్స్‌వెర్న్ అది మంటల్లోకి విసిరివేశాడు. కాని అతనిభార్య అది పైకితీసి ఇంకొకసారి ప్రయత్నించి చూడమని బతిమాలింది. 16 వ ప్రచారకర్త ఆ పుస్తకాన్ని ప్రచురించడానికంగీకరించాడు.

తరవాత ఆ పుస్తకం బాగా వేడివేడిగా అమ్ముడుపోయింది. అది ప్రపంచంలో చాలా భాషలలోనికి అనువదించుకొన్నారు. 34 సంవత్సరాల వయస్సులోనే అతనిపేరు ప్రపంచం అంతటా మారుమోగిపోయింది.

ఆతరువాత జూల్స్‌వెర్న్ రాసినపుస్తకం 'భూగర్భంలో వింతలు'. ఆ పుస్తకానికి ఫ్రెంచి ప్రభుత్వం జూల్స్‌వెర్న్‌కు ప్రత్యేకంగా ఒక పెద్ద బిరుదంఇచ్చి గౌరవించింది.

అటు పిమ్మట జూల్స్‌వెర్న్‌కు ఒక కుమారుడు కలిగాడు. అప్పుడతడు రెండు చేతులా డబ్బు గడించేవాడు. ఆ సమయంలో అతడొక పెద్ద స్టీమరుకొని దానితోనే నివసించేవాడు. దానిపై అంతస్థు గదిలో కూర్చుని ఆ రచనలు సాగిస్తూండే వాడు. ఆ తరవాత ఇంచుమించుగా అతని నలభైఏళ్ళ జీవితము ఆ స్టీమర్లోనే గడిచిపోయింది. అనంతరం జూల్స్‌వెర్న్

(63-వ పేజీ చూడండి)

1


సాగర గర్భంలో బ్రహ్మాండమయిన జలజంతు ఏదో కనిపించిందనే వార్త నాలుగుమూలలా పాకిపోయింది. అమెరికాలోను, యూరపులోను ఎక్కడ విన్నా దానినిగురించిన వార్తలే! క్రమంగా వర్తకులేకాక నావికులు, నౌకాధికారులు కూడా ఆ విచిత్ర జంతువునుగురించి చర్చించడం మొదలుపెట్టారు. అది అంతటితో ఆగిపోలేదు. ఐరోపా, అమెరికా ఖండాల ప్రభుత్వవర్గాలవారు కూడా ఆ విడ్డూరాన్ని గురించే ఆలోచించడం ప్రారంభించారు.

అది 1886 సంవత్సరం. ఆ సంవత్సరంలోనే ఈ కొత్త వింత ప్రారంభమైంది. సముద్రంలో సాగిపోయే ఓడల కది హఠాత్తుగా ఎక్కడో ప్రత్యక్షమై, ఇట్టే మాయమైపోయేది. చూడడానికా జంతువు చాలా పొడుగ్గా కదురులా కనబడేది. ఒక్కొక్కప్పుడది చిత్రచిత్రంగా మెరిసిపోయేది. అది తిమింగలంకన్నా చాలా పెద్దదనీ దానికన్నా చాలా వేగంగా ప్రయాణం చేస్తున్నదనీ నావికులు పసిగట్టేశారు.

ఆయా నౌకాధికారులు దీనిని గురించి తమ దస్త్రాలలో రాసిన వివరాలు చాలావరకన్నీ ఒకవిధంగానే ఉన్నాయి. ఆ జంతువు విపరీతవేగాన్నిగురించీ ఆ కారాన్ని గురించీ ఎన్నెన్నో చిత్రచిత్రమైన

అనువాదం:

"వినాయక"



విశేషాలు సేకరించి ఆయా ఓడల దస్త్రాల్లో అతి జాగ్రత్తగా భద్రపరిచారు. అది ఒక పెద్ద తిమింగిలమేఅని నిశ్చయించడానికి కూడా వీలుపడలేదు. దాని పరిమాణం సామాన్య తిమింగిలాలకన్న చాలా పెద్దది. అంతవరకు అంత పెద్ద తిమింగిలం ఉన్నదన్న సంగతి జంతుశాస్త్రజ్ఞులెవరికీ తెలియనే తెలియదు. వారంతా స్వయంగా కళ్ళారా చూస్తే తప్ప దాన్నిగురించిన గాలి పుకారులు నమ్మడానికి వీలు లేదని అన్నారు.

కొంతమంది ఆజంతువునుగురించి అతిశయోక్తు లెన్నెన్నో కల్పించి వ్యాపింపజేశారు. అది మైలు వెడల్పు, మూడు మైళ్ళ పొడవుగల పెద్ద జంతువనీ అంతటి పెద్ద జంతు

సంయిల:



వింతకుపూర్వం ఎన్నడూ మానవమాత్రులకు కనిపించలేదనీ ఎంతో వింతగా చెప్పుకోవడం మొదలుపెట్టారు. మరికొంతమంది అది అంతగా నమ్మదగినవిషయం కాదనీ దాని పొడవు 200 అడుగులకంటె ఎక్కువ ఉండదనీ అన్నారు ఈ అతిశయోక్తులు, న్యూనోక్తులు విడిచివేస్తే మొత్తంమీద అంతటి పెద్దజంతు వింతకుపూర్వం ఎన్నడూ జలజంతుశాస్త్రజ్ఞులకు తెలిసి ఉండదని అనుకోవచ్చును. మరికొంతమంది మొత్తంమీద ఇవ్వన్నీ వట్టి గాలికబుర్లేమోనని కొట్టపారేశారు. ఇంకా కొంతమంది అనేకవందలమంది కళ్ళారాచూసిన తరవాత ఆ విషయంఅంత తేలికగా కొట్టిపారెయ్యడానికి వీల్లేదని గట్టిగా వాదించారు. మొత్తంమీద అలాంటి జంతువేదో ఉండిఉండవచ్చునని చాలామంది నిశ్చయించారు అది ఇంతకుపూర్వం ఎన్నడు కనీ వినీ ఎరగనంతటి పెద్ద జంతువై ఉండవచ్చునని కూడా స్థిరపరిచారు. దానితో ప్రపంచంలో అన్ని ప్రధాన నగరాల జనాభా ఆ జంతువును గురించి ఎంతో వింతగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు

ఇలాగుండగా 1886 జూలైలో కలకత్తా బర్మా కంపెని ఓడ హిగ్గిన్సన్ ఆస్ట్రేలియాతీరంలో సముద్రంలో ప్రయాణం చేస్తూండగా 5 మైళ్లదూరంలో హఠాత్తుగా ఆ అద్భుత జలజంతువు ప్రత్యక్షమైంది ఓడ కెప్టెన్ మొట్టమొదట అది సముద్రంలో కొండగుట్ట కావచ్చునని అనుకొన్నాడు అందుచేత ఆ కొండగుట్ట కొలతలు మొదలైనవి తెలుసుకోవడానికి ప్రయత్నించాడు అంతలో ఆ జంతువు నోటిలోనించి రెండు పెద్దజలధారలు పెద్దపెట్టున పైకెగిరాయి ఆ ధారలు ఆకాశంలో నూరు, నూటయాభై అడుగులవరకు పైకి లేచాయి ఓడ కెప్టెన్ మొట్టమొదట అక్కడ ఏదైనా ఒక పెద్ద వేడినీటిబుగ్గ ఉన్నదేమోనని అనుమానించాడు లేకపోతే అది అంతకుపూర్వం ఎన్నడు కని విని ఎరగని పెద్ద సముద్రజంతువైనా అయిఉండాలని అనుకున్నాడు ఆ జంతువే ఆవిరితోను, గాలితోను ఆ జలధారలు పైకి పంపించి ఉండవచ్చునని ఊహించాడు.

ఆతరవాత ఆ సంవత్సరంలోనే మరికొంతకాలానికి అలాంటి దే

★ సాగరగర్భంలో సాహస యాత్ర ★

ఇంకొక సంఘటన జరిగింది. పసిఫిక్ మహాసముద్రంలో కొలంబస్ అనే ఓడలో ప్రయాణంచేసే వారందరు స్పష్టంగా ఆ జలధార లలాగ పైకి లేవడం చూచారు. వాటికి దిగువ ఏదో బ్రహ్మాండమైన పెద్ద జంతువు లాగే కనబడింది. దానినిబట్టి అది ఒకచోటినించి మరిఒకచోటికి చాలా తొందరగా వెళ్లిపోగలదనీ, 3 రోజులలో సుమారు 2 వేల మైళ్ల వరకు ప్రయాణం చేసిందనీ తేలిపోయింది. పదిహేను రోజుల తరవాత వెనక కనబడిన ప్రదేశానికి మళ్ళీ సుమారు 6 వేల మైళ్ళ దూరంలో అది కనబడింది. తరవాత ఇంకా కొంతకాలానికి అమెరికా తీరానికి సమీపంలో రెండు మూడు ఓడలకీ జలజంతువు కనబడింది. ఆ ఓడల అధికారులా జంతువు పొడుపు 350 అడుగులవరకు ఉండవచ్చునని అంచనా వేశారు. ఎంత పెద్ద జలజంతువులైనా 6 గజాలకంటె ఎక్కువ పొడుగు ఉండవని సామాన్యంగా అందరికీ తెలిసినవిషయమే.

ఇలాగ దానినిగురించి ఒకదాని తరవాత మరి ఒకటిగా ఎన్నెన్నో వింతలు విశేషాలు బయలుపడ్డాయి. తరవాత నాలుగైదు పెద్ద పెద్ద ఓడలలో జనము, అధికారులు కూడా ఆ జంతువును స్వయంగా చూచామని అన్నారు. దానితో జనంలో మళ్ళీ అల్లకల్లోలం బయలుదేరింది. ఇలాంటి విషయాలు కొంచెం కులాసాగా తీసుకునే దేశాలలో ఈ విషయాన్ని గురించి చిత్రమైన ఛలోక్తులు బయలుదేరాయి. కాని ఇంగ్లండు, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలో ఈవిషయాన్ని గురించి కొంచెం జాగ్రత్తగా ఆలోచించడం మొదలుపెట్టారు. ప్రపంచంలో అంతటా పెద్ద పెద్ద ఓడరేవుల్లో — ఆ అద్భుతాన్ని గురించి అదేపనిగా మాటాడుకోవడం ఒక పరిపాటిగా తయారయింది. కొన్ని కొన్నిచోట్ల దీనిని గురించి పాటలు, పదాలు కూడా అల్లారు. అయినా కొన్నికొన్ని ప్రసిద్ధ వార్తాపత్రికలు ఇదిఅంతా వట్టి వేలంవెర్రిగా తయారయిందని వేళాకోళం చేశాయి. ఇలాగ దీనినిగురించి ఎన్నెన్నో చిత్రాలు బయలుదేరాయి. ఆ తరవాత వార్తాపత్రికలలో భయంకరమైన పెద్ద సముద్రజీవాల చిత్రాలు ప్రచురించడం మొదలుపెట్టారు. క్రాకన్ అనే బ్రహ్మాండమయిన జలచరం 5 వందల టన్నుల ఓడలను కూడా తన డెక్కలతో పట్టి సముద్రంలోపలికి లాగుకుపోగలదు. పత్రికలలో ఇలాంటి విచిత్రజంతువుల చిత్రాలెన్నెన్నో వెలువడ్డాయి పాతకాలంనాటి సముద్రం వింతలు, విశేషాలు మళ్ళీ పత్రికల్లోకెక్కాయి. అరిస్టాటిల్ మొదలయిన ప్రాచీన గ్రంథకర్తలెందరెందరో తమ గ్రంథాల్లో ఇలాంటి వింత జంతువులుండి ఉండవచ్చునని రాశారు. అవన్నీ ఒకటొకటిగా పత్రికల్లోకెక్కాయి.

అటుపిమ్మట శాస్త్రీయ మాసపత్రికలలో దీనినిగురించి ఎడతెగకుండా వాదోపవాదాలు, చర్చలు బయలుదేరాయి. అందరు ఎడతెరిపి లేకుండా ఆ జంతువును గురించే ఆలోచించడం ప్రారంభించారు. కొంచెం శాస్త్రీయ విషయాలు తెలుసుననుకున్న పత్రికా రచయితలు కొంతమంది దీనిని గురించి దస్త్రాలకొద్దీ రాసిపారేశారు. కొందరసలువిషయం మరిచిపోయి తగాదాల్లోకిదిగి కొట్టుకున్న ఘట్టాలు కూడా లేకపోలేదు.

1867 సంవత్సరం ప్రారంభంలో బయలుదేరిన ఈ గాలిదుమారం ఆతరవాత కొంతకాలానికి కొంచెం

(54-వ పేజీ చూడండి)



ప్రసిద్ధ పంజాబీ ప్రణయగాథ 'హీర్' లో నూతన్, ప్రదీప్ కుమార్.



బాక్సాఫీస్ తార మీనాకుమారి 'బందిష్' తరువాత ఈమె నటించిన చిత్రం'
'ఏక్ హీ రాస్తా' ఇటీవలే విడుదలయింది.



మినర్వాపిక్చర్స్ నిర్మిస్తున్న 'సారంగధర' తెలుగుచిత్రంలో రామారావు, రాజసులోచన.



~~జూపిటర్ వారి ఉషాపరిణయం~~ లో రేలంగి.

ప్రతిభా చిత్రం "ఏది నిజం" సమీక్ష

ఏది అయినా కాకపోయినా, ప్రఖ్యాతమైన స్టార్ వాల్యూ, పెద్ద సెట్స్, పాటిక పాటలూ, ముస్తాబు డాన్సులూ లేకపోయినా కొత్త మంచి కథ, దాన్ని చెప్పవలసిన పద్ధతిలో చెప్పగలదర్శకుడు, స్టార్ వాల్యూ లేకపోయినా ప్రతిభ గల నటీనటులూ ఉంటే, నిర్మాత తన చిత్రాన్ని విజయవంతం చేసుకోగలడన్న మాట నిజం. నిజానికి, లక్షల ఖర్చుతో కూడిన ఈపరిశ్రమలో ఇటువంటి నిజానిజాలను నిరూపించడానికి ఎవరూ కూడా ఉబలాటపడరు. ఇటువంటివి ఉబలాటాలవల్లనే జరిగేవి కావు కూడా. స్వప్రయోజనం కోసమే అయినా, ఇలా చేసి సత్ఫలితాలు సాధించాలన్న సంకల్పం, సాధించగలమన్న ఆత్మ విశ్వాసం, అందుకు తగ్గ దక్షత ఉండాలి.

తక్కువ ఖర్చులో, అతి త్వరితంగా ప్రతిభా పిక్చర్స్ నిర్మించిన చిత్రం "ఏది నిజం?" ఈ నిజాన్ని నిరూపించింది. ఈ దృష్ట్యా, యువనిర్మాత శ్రీ ఘంటసాల కృష్ణమూర్తి అభినందనీయులు.

ఈ చిత్రంలో అనేక విషయాలలో కొత్తదనం కనబడుతుంది. మొట్టమొదటిది కథ. హత్యా నేరాన్ని ఆధారం చేసుకొని, కట్టుదిట్టమైన పద్ధతిలో రూపొందించడం తెలుగు చిత్ర పరిశ్రమలో ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. ఈ దృష్ట్యా, ఈ పంథాలో తయారైన అనేక హిందీ చిత్రాలకన్న ఇది మెరుగే.

ఏది నిజం కథ పూర్తిగా స్వతంత్ర రచన కాదు. 'ప్లాజిటివ్' అనే ఇటాలియన్ చిత్రం ఆధారం. కథావస్తువును మాత్రం తీసుకొని, కథ స్వరూపాన్ని, పాత్రలను బాగా మార్చి దాన్ని మన వాతావరణానికి అనుగుణంగా, అసంగతాలకు సాధ్యమైనంత వరకూ ఆస్కారం ఇవ్వకుండా చిత్రించారు. కథ పొడుగునా సున్నితమైన హాస్యం ఉంది.

కొత్తదనంపట్ల దర్శకుడు శ్రీ బాలచందర్‌కు గల ఆసక్తి, వివిధసన్నివేశాలను, సహజంగా మోతాదుగా చిత్రించడంలో చాకచక్యం చిత్రానికి వన్నె తెచ్చాయి. టైటిల్స్ చూపించడంలో కూడా కొత్తదనం ఉంది. కుండల మీద, బండల మీద, జట్కా బండ్లమీద, గంగిరెద్దు వీపులమీద కూడా పేర్లు చూపించారు. వాటిని పురస్కరించుకొని పల్లెటూరి దృశ్యాలను చూపారు. ఆరుబయట దృశ్యాలను ఇంతగా చూపి సద్వినియోగం చేసుకున్న చిత్రాలు



హేమేన్‌గుప్త నిర్మించిన 'టక్సాల్' లో బల్‌రాజ్ సాహ్నీ, నిరూపా రాయ్

అయినా. కథ చాలావరకు, అడవిలోనూ, కొండలమీదా జరుగుతుంది. పెద్ద పెట్టె అన్నది మునసబుయిల్లు ఒకటే అతిమాత్రం జరిగిందాని భవంతి ధోరణలో ఉంది. కథాచిత్రణలో చెప్పుకోదగ్గ మరొకవిశేషం చాదస్తం లేకపోవడం. తిరుపతి యాత్ర, రాము ఇల్లు వదలిపోవడం, కోటయ్య ఖైదు నించి తప్పించుకోవడం మొదలైన సందర్భాలలో అనవసరమైన దృశ్యాలు చూపించని అందువల్ల అవి బాగా రాణించాయి. ఐతే కథాంతంలో, మునసబు చేతనే, అతని దోషాలు, పశ్చాత్తాపం యీవన్నీ వివరంగా చెప్పించడం యీ పద్ధతికి విరుద్ధంగా ఉంది. అసంగతం, అసహజం అనిపించే వాటిలో నాగుపాము ఉపాఖ్యానం ఒకటి.

అయితే మంచి, చెడ్డ అన్న పద్ధతిలో పాత్రలను మూసపోయడమంటూ ఉండదానికి ప్రయత్నం చేశారు. ఉన్న దుష్టపాత్రలు నూటికిలో మునసబు మాత్రం పూర్తిగా దుష్టుడు. సత్తెకోగా ఉన్న దుష్టబుద్ధివల్ల మొదట దుశ్చేష్టలు చేసినా, ఆ తరవాతనించి, జాలి పట్ల మూలానే ఆ పాత్రను నడిపిస్తాయి ధర్మం కల్పబలంకన్న భయంబలమే ఎక్కువ అవుతుంది. నేరాన్ని మరొకడి నెత్తిమీదకు నెట్టి వెయ్యడంలో మునసబుకు మద్దతు యిచ్చిన ఇద్దరిలో పూజారి మైనపుముద్ద, భయస్థుడు మానసికంగా దుర్బలుడు. అందువల్ల, ఇష్టం ఉన్నా లేకపోయినా అతను మద్దతుఇస్తాడు రెండో వ్యక్తి డాక్టరు మొదట్లో ప్రలోభం, దూరాలోచన లేకపోవడం ఇతణ్ణి తప్పుకు పాల్పడేటట్లు పురికొల్పినా, తరువాత మథన పడతాడు. తన పాపానికి ఖైదునించి పారిపోయివచ్చిన కోటయ్యను, హంతకుడి పేరు చెప్పాలా, మానాలా అని అయోమయంగా అటూ ఇటూ ఊగిసలాడుతూనే ఉంటాడు.

తనకి హాని చేసినవారి అంతుకనుక్కోవాలని వచ్చిన కోటయ్య, ఫ్లాష్‌బ్యాక్‌లో కథానాయకుడికి అడ్డంకులు కల్పిస్తాడు చెయ్యలేకపోతాడు. కాలం కర్మం పోతే మంచి మనుషులా ఎదురు తిరిగిన తరువాతే, హంతకుడు శిక్షకుపడుతాడు

ఈ కథలో ప్రేక్షకులను బాగా ఆకర్షించగల పాత్ర కోటయ్య పాత్రమరది. తిరుగు తిరి అప్పనంగా వచ్చే డబ్బును ఆశించని వాడు. దేనికీ భయపడడు ఎవర్నీ ఖాతరు చెయ్యడు నిత్య చైతన్యవంతుడు ఈ భూమికను నాగారావు బాగా ఒప్పించాడు.

మునసబు భూమిక నిర్వహించిన గుమ్మడి వెంకటేశ్వరరావు తొలిగాని తొణుకు లేకుండా, అతి సౌందర్యంగా నటించాడు. గుమ్మడి నటనవల్ల మునసబు భూమిక బాగా రాణించింది. చివర చివర కొన్నిచోట్ల తప్ప మొత్తంమీద మొదటినుంచి చివరవరకు ఒకే స్థాయిలో, సాగింది.

కథానాయకుని భూమికను మొదటి సారిగా నిర్వహించిన నాగభూషణం, ప్రతిభగల నటుడుగా తన సామర్థ్యాన్ని బుజువు చేసుకున్నాడు. ముఖ్యంగా 'మొల్

"ఏది నిజం"

డ్రామా'కు జారిపోగల సన్నివేశాలలో మితి తెలిసి, నిగ్రహంతో నటించి, ఆ భూమికకు వాస్తవికతను బలాన్ని చేకూర్చగలిగారు.

పూజారిగా శంకర, నాటు వైద్యుడుగా రమణారెడ్డి, రాధిగా జానకి, రామితల్లిగా హేమలత సామర్థ్యంతో నటించి, చిత్రం విజయవంతం కావడానికి తోడ్పడ్డారు

ఈ కోవకు చెందిన కథలలో పాటలకు చోటుండదు అయినా, సాధ్యమైనంత వరకు, కథకు అడ్డురాకుండా చేయడానికి ప్రయత్నిస్తూ నాలుగైదు పాటలు చొప్పించారు. శ్రీ వేణు సమకూర్చిన సంగీతం చక్కగా ఉంది. ★

మద్రాసులో బాల చిత్రోత్సవాలు

మద్రాసు చలన చిత్రాభిమానుల సంఘం మార్చి 6 నుండి వారం రోజులు ఏర్పాటు చేసిన బాల చలన చిత్రోత్సవం క్రిందటి సంవత్సరం జరిగినదానికన్న ఎక్కువ విజయవంతం కానట్లు ఈ సంఘం ప్రచురించిన కరపత్రంవల్ల విశదం అవుతున్నది ఈ ఏడాది 35 చిత్రాలు ప్రదర్శించారు

పిల్లలు మెచ్చిన చిత్రం

మద్రాసు బాలచిత్రోత్సవంలో మొత్తం 35 చిత్రాలు చూపించారు వీటిలో 25 రష్యన్ చిత్రాలు, నాలుగు చైనావి, 6 అమెరికన్ కార్టూన్ చిత్రాలు, 6 భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ చిత్రాలు, ఒకటి బ్రిటిష్ చిత్రం

వీటిలో పిల్లలు ఎక్కువగా మెచ్చుకొన్నది 'సాయియోమీ కల' అనే చైనీస్ చిత్రం పిల్లలు, తలిదండ్రులు కూడా యీ చిత్రాన్ని ముక్తకంఠంతో మెచ్చుకున్నందువల్ల దీనికి ఉత్తమ చిత్రంగా బహుమతి ఇచ్చి గౌరవించ సంకల్పించారు పోతే, రష్యన్ చిత్రం 'చుక్ అండ్ గెక్' భారతీయ చిత్రం 'లిటిల్ ఎంబాసెడర్స్' బ్రిటిష్ చిత్రం 'జీన్స్‌ప్లాన్' ఒక చిత్రం నచ్చిందంటే పిల్లలు అందరూ కూడా నిముషాల తరబడి చప్పట్లుకొట్టి సంతోషం వెల్లడిస్తూ



నరసూవారి 'భలేరాముడు' లో సావిత్రి

వచ్చారు. ఫిలింఫాన్స్ సంఘం ప్రతినిధులు కొందరు పిల్లలను చేరదీసి వారిఅభిప్రాయాలు కూడా అడిగి తెలుసుకున్నారు సుమారు 12 వేల మంది బాలబాలికలు వచ్చి చూచారని అంచనా గత సంవత్సరంలో జరిగిన ఉత్సవానికికూడా దాదాపు ఇంతేమంది వచ్చారు

విజ్ఞానం, వినోదం

ప్రదర్శించిన చిత్రాలలో పిల్లలను సంతోషపెట్టి నవ్వించేవి, వాళ్లకి తెలియని సంగతులు తెలియచెప్పగలిగినవికూడా ఉన్నాయి. కొన్ని కార్టూన్ చిత్రాలు ఉన్నాయి చంద్రలోక యాత్ర, వేసవివిహారం, అడవులలో విహారం మొదలైనవి పిల్లలకు పుస్తకాలు చదివితే తెలియని విషయాలెన్నిటినో, తేలికగా, మనసుకు హత్తుకుపోయేలా తెలియచెబుతాయి మరికొన్ని, చిన్న చిన్న సమస్యలు, వాటని ఎదుర్కొనడానికి చిన్న చిన్న ఉపాయాలూ చిత్రించాయి ఇలాంటివి చూచినపుడు, పిల్లలుకూడా ఉపాయాలు ఆలోచిస్తారు

ముఖ్యంగా, పిల్లల మెప్పులందిన చైనీస్ చిత్రం 'సాయియోవిా' కలలో ఈ తరహా కథాచిత్రణ కనబడుతుంది. పది పన్నెండేళ్లలోపు పిల్లలను ఇది బాగా ఆకర్షిస్తుంది ఇందులో రెండు బొమ్మలు పడే ఇబ్బందులు, అవి పన్నే ఉపాయాలు చక్కగా చిత్రించబడ్డాయి

ఇందులో ఆరేళ్ళ అమ్మాయి ఉంటుంది ఆ అమ్మాయికి వాళ్ళమ్మ రెండు బొమ్మలు కొనిపెడుతుంది వాటితో ఆడుకుంటూ ఉండగా, మొగ బొమ్మ కాలు విరిగిపోతుంది అది చెండుబొమ్మ ఆ అమ్మాయి, చెండులో బొందు గూర్చి కాలు అతకబోయిందికాని, చేతకాదు చివరకి విసుగెత్తి ఆ తొందరలో, ఆ బొమ్మనీ విరిగిపోయిన కాలునీ కట్టేసి బీరువా సొరుగులో పడేసి, నిద్రపోతుంది లేత మనసు, తేట మనసు, మంచిమనసు కాబట్టి, ఆ బొమ్మని అలా కట్టిపడెయ్యడం తప్పుగా, చెడ్డపనిగా ఆ అమ్మాయికి అనిపిస్తుంది అలా అనిపించినపుడు కలిగే ఊహలన్నీ కలలో రూపం ధరించి కనబడతాయి కథల్లో రాజకుమారుడులాగే, ఆ మొగబొమ్మ అమాంతం కట్లు తెంచుకుని, బీరువా సొరుగులోంచి కిందకి ఉరికేస్తుంది ఆడబొమ్మ, ఆ విరిగిపోయిన కాలుని అతికించేస్తుంది అక్కణ్ణించి ఆ ఇంట్లో ఆ బొమ్మలు రెండూ కలయ తిరిగి, ఎన్నో సాహసాలు చేసి, ఎన్నో ఇబ్బందులు పడి, బొమ్మలన్నీ పోగేస్తాయి చెక్క పలకలతో ధవంతిసింహద్వారంవంటిది కడుతూ ఉంటాయి. అవి చిన్నబొమ్మలు కాబట్టి,



'హూంమంతర్' లో ఓంప్రకాశ్.


ఇంట్లో సామానులన్నీ వాటి ప్రాణానికి చాలా పెద్దవిగా కనబడతాయి అటువంటప్పుడు, ఆ సామానులని అటూ ఇటూ జరపడానికి ఆ బొమ్మలు—మొగబొమ్మ చేసే ఉపాయాలు ఎంతో ముచ్చటగా ఉంటాయి

చిట్టి రాయబారులు

భారతప్రభుత్వ ఫిలింస్ డివిజన్ నిర్మించిన 'చిట్టి రాయబారులు' (లిటిల్ ఎంబాసిడర్స్) అనే చిత్రం విశిష్టమైనది 'శంకర్స్ వీక్లీ' అధిపతి శ్రీ శంకర్ పిళ్లై లోగడ ఢిల్లీలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ బొమ్మల ప్రదర్శనం దీనికి ఆధారం దేశదేశాలవారు పంపిన బొమ్మలన్నీ ఇందులో ప్రదర్శించారు వ్యాఖ్యానం తాపీగా, తేలికమాటలలో పాఠాలపంథాలో కాకుండా సరదాగా ఉండేటట్లు చెప్పించారు కేవలం బొమ్మలు చూపించడం వల్ల విసుకు కలగకుండా, మధ్య మధ్య ఒక కుర్రపిల్లని చూపిస్తూ దాని ద్వారా సున్నితమైన హాస్యం చొప్పించారు ఆయా దేశాల ప్రజల కట్టూబొట్టూ చక్కగా తెలుసుకోవడానికి, దీన్ని గేవాకలర్ లో నిర్మించారు. పోతే, ఒక్కొక్క దేశానికి చెందిన బొమ్మలను చూపించినపుడు, సంగీత దర్శకుడు శ్రీ విష్ణుదాస్ షిరాలీ ఆ దేశపు సంగీతాన్నే వినిపించారు.

చూక్ అండ్ గెక్

కథాచిత్రాలలో పిల్లలను ఎక్కువ ఆకర్షించినది 'చూక్ అండ్ గెక్' అనే రష్యన్ చిత్రం ఎనిమిదినుంచి పదిహేనేళ్లలోపు పిల్లలకు బాగా నచ్చుతుంది ఇది నీతికథ చిన్నది చూక్, గెక్ లు ఇద్దరూ అన్నతమ్ములు, ఏడెనిమిదేళ్ళ ఈడుపిల్లలు. వాళ్ల తండ్రి, ఉద్యోగరీత్యా, అడవుల్లో ఒకచోట ఉంటాడు క్రిస్ట్మస్ పండుగకి తన దగ్గరకు రమ్మని ఉత్తరం రాస్తాడు తీరా వీళ్లు బయలుదేరేలోగా రావద్దని టెలిగ్రాం ఇస్తాడు ఇల్లాలు బజారుకి వెళ్ళినవేళ అది వస్తుంది పిల్లలు ఆ టెలిగ్రాం తీసుకుంటారు. అంతలోనే పోట్లాటవచ్చి, ఒకడు



గురుదత్ ఫిలింస్ వారి 'ప్యాసా' లో జానీవాకర్.

★ మద్రాసులో బాల చిత్రోత్సవాలు ★

ఆ టెలిగ్రాంను కిటికీలోంచి అవతలకి విసిరేస్తాడు. మర్నాడు వెంటనే ఇద్దరూ వెళ్ళి వెతుకుతారుగాని అది దొరకదు. తల్లి కోప్పడుతుందన్న భయం కొద్దీ, అసలు టెలిగ్రాం వచ్చిందన్న సంగతే చెప్పకూడదని ఇద్దరూ లాలూచీ అవుతారు. అదిసరే ఈ వైనం తెలియక, ఇద్దరిన్ని వెంట పెట్టుకొని, భర్త ఉన్న చోటుకి ప్రయాణమై వెళ్తుంది అక్కడికి వెళ్ళాక, భర్త వచ్చే రోజులవరకూ రాడని తెలుస్తుంది. దాని వల్ల కొంత అనర్థమే జరుగుతుంది నిజం చెప్పక పోవడం ఎంత తప్పో పిల్లలకు బోధపడుతుంది. క్రిస్ట్మస్ నాటికి తండ్రి వస్తాడు. కథ కాని ఈ కథను, పిల్లల అల్లరితో, ఆటలలో నాలుగు వేల అడుగులలో చిత్రించారు దీనికి దర్శకుడు 'ఒకిన్స్కీ' ఈ చిత్రానికి తేలిక భాషలో ఇంగ్లీషు టైటిల్స్ వేసుకొన్నారు

మార్చి 14వ తేదీన [illegible] ప్రత్యేకం చూపించారు.

పిల్లలకై ఒక థియేటర్

ఈ వారం రోజుల ప్రదర్శనద్వారా మొత్తం రు 2700 వసూలైంది దీన్ని పిల్లల చిత్రాల ప్రదర్శనాలను అభివృద్ధి చేయడానికి వినియోగిస్తారు ఇటువంటి ప్రతి ఆదివారం నగరంలో పిల్లల చిత్రాలు ప్రదర్శించాలని కూడా ఫిలింశాస్త్ర సంఘం నిర్ణయించారు. లోకే, క్రమేపీ, ప్రముఖుల సహాయ సహకారాలతో నగరంలో పిల్లలకై ఒక థియేటర్ నిర్మించాలని, బాలచిత్ర భండాగారం ఒకటి ఏర్పాటు చేయాలని కూడా వారు ప్రకటించారు

డిస్ట్రిబ్యూషన్ వ్యవహారం

ఆంధ్రలో సంబంధం-చిన్నతనకరకూ ఇటు [illegible]

[illegible] కనబరుస్తున్నారు. గత సంవత్సరం విజయవాడలో కొందరు బాలచిత్ర సంఘం ఒకటి నెలకొల్పి, కొన్ని చిత్రాలు ప్రదర్శించారు. పిల్లలు చాలమంది వచ్చి చూచి ఆనందించారు అందరికీ అందుబాటులో ఉండే విధంగా కేవలం పావలా మాత్రమే రుసుము వసూలుచేశారు. ఆదివారాలలో ఉదయపుపూట చిత్రాలు ప్రదర్శించారు. ప్రారంభంలో డాక్యుమెంటరీల వంటివే చూపినా, ఒకటి రెండుసార్లు చిన్న చిన్న కథా చిత్రాలు చూపారు ఒకసారి అమెరికన్ కార్టూన్ చిత్రాలు చూపారు. అప్పట్లో వారు ఎదుర్కొన్న చిక్కులలో చిత్రాల ఎన్నిక ఒకటి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు అక్కడ లేనందువల్ల, నిర్వాహకులు ముందు చిత్రాలను చూచి, వాటిలో కావలసినవి ఏరుకోడానికి వీలు లేకపోయింది. ఆయా విదేశీ సంస్థలు పంపే కరపత్రాలే ఆధారం అయ్యాయి

కేవలం డాక్యుమెంటరీలే ..

పిల్లల బుద్ధి వికాసానికి చలనచిత్రాలు ఉత్తమ దోహదకారులన్న విషయాన్ని అధికార ప్రముఖులు, విద్యావేత్తలూ కూడా గుర్తించారు ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ వారు, తాము నిర్మించే డాక్యుమెంటరీలను, పిల్లలకు చూపే నిమిత్తం విద్యాసంస్థలు కోరితే ఉచితంగా ఇవ్వగలమని ప్రకటించారు అయితే అన్నీ డాక్యుమెంటరీలే చూపిస్తే పిల్లలకు ఆసక్తి కలిగించడం కష్టం మన దేశంలో కథాప్రధాన చిత్రాలు, కార్టూన్లు తగినంతగా తయారుకావటం లేదు కాబట్టి కొంతకాలంవరకూ విదేశాల నుంచి చిత్రాలు తెప్పించుకోవలసిందే ఈ విషయమై కృషిచేసే సంఘాల ప్రయత్నాలు సఫలం కావాలంటే, ఈ వ్యవహారంలో ప్రభుత్వం సహాయం చేయడం అవసరం విదేశీయ బాల చిత్రాల డిస్ట్రిబ్యూషన్ను ఫిలింస్ డివిజన్ గాని, బాలల చిత్ర సంస్థవంటిదిగాని చూసుకోవాలి మరొక ముఖ్యవిషయం ఈ చిత్రాలను గ్రామీణప్రాంతాలలో చూపే ఏర్పాట్లు చేయాలి ఇది చాలా పెద్దపని దీనికికూడా ప్రభుత్వమే పూనుకోవాలి

పిండి వంటలు కావు..!

పిల్లలకు సినిమాలు చూపించడం పిండి వంటలు చేసి పెట్టినంతటిదన్న తరహా ఆలోచనలు పోవాలి పిల్లలకోసారి ఉత్సవం ఏర్పాటుచేసి వాళ్ళను చిత్రాలు చూపించి వదిలి పెట్టడంతో కాక మరొక అడుగు ముందుకు వేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడాలి. [illegible] ఇక్కడ

బొంబాయి సినిమా లేఖ

మే నెలలో ప్రారంభం కానున్న బుద్ధ జయంతిని పురస్కరించుకొని, థాయ్‌లాండ్ సమాచారసంస్థ నిర్మించనున్న 'అంగులిమాల' చిత్రంలో నాయక పాత్రను హిందీనటి 'నిమ్మి' నిర్వహించబోతున్నది. ఈ చిత్రాన్ని హిందీ, ఇంగ్లీషు, చైనీస్, జాపనీస్, సయామీస్ భాషలలో నిర్మించి మే 29 న విడుదల చేస్తారట. నిర్మాణం తలపెట్టిన థాయ్ సంస్థకు, ఆ దేశపు ప్రధాని శ్రీ పిబుల్ సంగ్రామ్ పోషకుడు. భారత ప్రభుత్వం కూడా ఈ నిర్మాణానికి తోడ్పడుతుందట. బాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయంలో పత్రికా వ్యవహారాలు చూచే అధికారి డా॥ ఎం. గంజూ దీనికి పర్యవేక్షణ చేస్తారు. బుద్ధుని ధర్మ ప్రబోధం ఆధారంగా నిర్మించబడే ఈ చిత్రంలో, బౌద్ధమతం వల్ల ఆగ్నేయ ఆసియాలో ప్రవర్తిల్లి వర్థిల్లిన సాంస్కృతిక సమైక్యతను చిత్రిస్తారు.

ప్రధాన భూమిక నిమ్మికి ఇస్తారు. మరి రెండు ప్రముఖ భూమికకు బొంబయి నీటి మంగళనుగాని బెంగాల్ తార సువితా మజుందార్‌నుగాని తీసుకోవాలని ఆలోచిస్తున్నారు. చిత్రానికి శ్రీ హేమెన్‌గుప్త దర్శకత్వం, శ్రీ వి. అవ్‌ధూత్ ఛాయాగ్రహణం, శ్రీ కానూదేశాయ్ కళా దర్శకత్వం నిర్వహిస్తారు.

* * *

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ నివేదిక, దాని వల్ల బొంబాయి, ఒరిస్సా మొదలైనచోట్ల జరిగిన అల్లరులు, మాచినవిూదట, డీలక్స్ ఫిలింస్ నిర్మిస్తున్న 'న్యూఢిల్లీ' చిత్రంలో వై జయంతిమాల, కిశోర్ కుమార్, జబీన్, రాధాకృష్ణన్ మొదలైనవారున్న సన్నివేశాలు చాలమటుకు పూర్తి అయిపోయాయి. కథాస్థలమైన ఢిల్లీ నగరంలో ఇపుడు మరి కొన్ని ముఖ్యభాగాలు చిత్రిస్తున్నారు. ప్రాంతీయ దురభిమానాలు నిర్మూలితమై ఆదర్శభావ సమైక్యత వర్ధిల్లవలసిన ఆవశ్యకతను ఇందులో చిత్రిస్తున్నారట. మాటలు ఇందర్ రాజ్, పాటలు హస్రత్, శైలేంద్రలు వ్రాశారు. సంగీతం శంకర్, జైకిషన్‌లు. దర్శకుడు మోహన్ సెగాల్.

* * *

ఫిలింస్తాన్ ముఖ్య నిర్మాత శ్రీ శశిధర్ ముఖర్జీ తమ సినిమాస్కోప్ చిత్రం 'బాంబే ప్లయిట్ 417' కు సంబంధించినవ్యవహారాలపై లండన్ వెళ్ళారు. ఈ చిత్రం ఇప్పుడక్కడ ఇంగ్లీషులోకి డబ్ చేయబడుతోంది. దీన్ని విదేశాలలో విడుదలచేయడానికి ఏర్పాట్లన్నీ పూర్తిఅయినట్లే తెలుస్తోంది. ఎటొచ్చి, ఇంగ్లాండ్ విడుదల విషయంలో నే కొన్ని చిక్కులున్నాయనీ, అవి పరిష్కరించడానికే ముఖర్జీ లండన్ వెళ్ళారనీకూడా అనుకుంటున్నారు.

* * *

రత్నదీప్ పిక్చర్స్ వారి "జయశ్రీ" మొన్న బొంబాయిలో విడుదలయింది. బాగా విజయవంతంఅయిన ఒక తమిళచిత్రం ఆధారంగా పండిట్ ముఖ్‌రాంశర్మ దీనికి కథ, సంభాషణలు వ్రాశారు. బాలచంద్ర శుక్లా, హర్‌శుఖ్ భట్‌ల సంయుక్త దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో నిమ్మి, ప్రదీప్‌కుమార్, లలితా పావర్, రూప్‌మాలా, జీవన్ ప్రభృతులు నటించారు కథ మొదటి నుండి చివరవరకూ పట్టుగా నడిచే దేఅయినా దర్శకత్వం అవకతవకగా ఉన్నందువల్ల బాగా దెబ్బతింది. కథ మొదట్లో బాగా మంచకొడిగా నడచింది. కొన్ని కొన్ని సన్నివేశాలు అనవసరంగా పొడిగించారు. నిజానికి కథ అతి సామాన్యమైనదే. మామూలుగా ఒక దుర్మార్గుడుంటాడు. అతగాడు ఒక పసిపిల్లవాణ్ణి అపహరించి, చంపించబోతాడుగాని, ఎవరో అతణ్ణి రక్షిస్తారు. ఎక్కడో పెరుగుతాడు. ఈ లోగా ఈ దుర్మార్గుడి కూతురు కూడా అపహరించబడుతుంది. అపహృతుడైన పిల్లవాడితల్లే ఈ పిల్లను పెంచుతుంది. చివరికి ఈ అమ్మాయి ఆ అబ్బాయి ప్రేమించి పెళ్ళిచేసుకుంటారు. ఇందులో నాయికగా నిమ్మి నటన ప్రతిభావంతంగా ఉంది.

'చిత్రగుప్త' సమకూర్చిన సంగీతం శ్రుతి పేయంగా ఉంది. ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

సినిమా వార్తలు


నల్లతంగాళ్' అనే తమిళ చిత్రం ఆధారంగా జూపిటర్ వారు నిర్మిస్తున్న తెలుగు చిత్రం 'ఉమాసుందరి' లో హీరో నాగభూషణాన్ని బుక్ చేసుకున్నారు. ఇందులో నాగభూషణం నిర్వహించే భూమిక 'పిచ్చియుగంధరుడి' తరహాలో రూపొందించబడినట్లు తెలిసింది. లంక సత్యం దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, శ్రీరంజని, నాగయ్య, కన్నాంబ, రేలంగి, సురభి బాలసరస్వతి, పేకేటి శివరాం ప్రభృతులు నటిస్తున్నారు. సి. పుల్లయ్య పర్యవేక్షణ వహిస్తున్నారు. మాటలు పాటలు సదాశివబ్రహ్మం.

* * *

సాయిరాం ప్రొడక్షన్స్‌వారు రామాయణగాథను "సంపూర్ణ రామాయణం" పేరిట వెండితెర కెక్కించ సంకల్పించారు పెద్ద తారాగణంతో త్వరలో నే సెట్స్‌కు వెళ్ళడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యీ చిత్రానికి శ్రీ యోగానంద్ దర్శకత్వం వహిస్తారట.

థియేటర్‌లో ప్రతి శని ఆదివారాలలో ఉదయం పిల్లల చిత్రాలు ప్రదర్శించడానికై ఏర్పాట్లు చేయాలి. ఆయా పట్టణాల ప్రముఖులు, పాఠశాలల పెద్దలూ కలిసి సంఘాలుగా ఏర్పడి ఇందుకు కృషిచేయాలి విద్యాశాఖాధికారుల సహకారం కూడా దీనికి చాలా అవసరం. ఈనాడు పాఠశాలలలో గ్రంథాలయం పేరిట, ఆటలపేరిటా నెలకు పావలా వరకూ వసూలు చేస్తున్నారు. అనేక పాఠశాలలలో గ్రంథాలయాలు సమగ్రమైనవి లేనేలేవు. చలనచిత్రాల విషయంలో ఇలా కాకుండా కట్టుదిట్టంగా చిత్రాలు చూపడానికి, వాటిని పిల్లలు చూడడానికీ ఏర్పాట్లు చేసి, నెలకు కొంత రుసుము వసూలు చేయవచ్చును. మద్రాసులోని తెలుగు బడి 'కేసరీ ఉన్నత పాఠశాల' లో ఒక ప్రొజెక్టరు కూడా కొన్నారు. ఏదో కొంత కనీసపు రుసుము తీసుకొని, అక్కడి విద్యార్థులకు చిత్రాలు చూపుతున్నారు. మద్రాసులో ఆంధ్ర బాలానంద సంఘం వారు కూడా ఒక ప్రొజెక్టరు కొన్నారు. దీనిమీద, 16 మిల్లిమీటర్ల చిత్రాలు ప్రదర్శిస్తున్నారు.

మొత్తానికి ఈవిధంగా, ఊరికో థియేటరులో వారానికొకటి రెండు ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ద్వారానో రాబోయే బాలచిత్రాలకు మంచిమార్కెట్ ఏర్పడడానికి దోహదం చేయడం అవసరం. భారతప్రభుత్వం నెలకొల్పిన బాల చలనచిత్ర సంఘం ఈ ఏడాదినుండి 1961 లోగా (రెండవ ప్రణాళిక క్రింద) పాతిక పెద్ద చిత్రాలుపాతిక చిన్న చిత్రాలు నిర్మించడానికి, 35 విదేశీచిత్రాలను దేశభాషలలో విడుదలచేయడానికి పథకం వేశారు. కాగా, ప్రయివేటు నిర్మాతల సహకారం కూడా స్వీకరించారు. నిర్మాతలు స్వయంగాకూడా చిత్రాలు నిర్మించాలని కోరారు. నిజానికి ప్రభుత్వం మాత్రమే బాలచిత్రాలు నిర్మిస్తూ ఉంటే చాలదు. ప్రయివేటు నిర్మాతలు కూడా పూనుకోవాలి. ఇది జరగాలంటే, వాటికితగ్గ మార్కెట్ కనబడాలి. ★



శరచ్చంద్రుడి నారీజగత్తు

ఇల్లిందల సరస్వతీదేవి

'దీపప్రకాంతి క్షీణించబోయేటప్పుడు కొడిరాల్చి, వత్తిని ఎగద్రోయటానికి ఒక చిన్న పుల్ల అవసరము. ఆ క్షుద్ర వస్తువే పోయినట్లయితే, చమురు ఎంత ఉన్నా, వత్తి ఎంత పెద్దదయినా దీపము ప్రకాశవంతముగా ఉండదు. పురుషుడిలో బుద్ధి ఆత్మశక్తి ఎంత ఉన్నప్పటికీ వాటిని ఉద్దీపింప చేయటానికి ఒక శక్తి అవసరము. అటువంటి శక్తుల సేకము కలది స్త్రీ' అంటాడు శరచ్చంద్రుడు.

శరచ్చంద్రుడు వంగ సాహిత్య స్రష్టలలో ప్రథమ శ్రేణికి చెందినవాడు. వంగ సాహిత్యోద్యానవనములో ప్రముఖ కృషీవలురు ముగ్గురు — బంకించంద్రుడు, రవీంద్రుడు, శరచ్చంద్రుడు త్రిమూర్తుల వంటివారు. బంకించంద్రుడు కవనముకంటె నవలలు అధికముగా రచించాడు. రవీంద్రుడు సాహిత్యపు క్రియలన్నిటిలో సమానప్రజ్ఞ గడించి వివిధ రచనలు చేశాడు. శరచ్చంద్రుడు నవలలు కథలు మాత్రమే రచించాడు. పై యిద్దరికంటె, శరచ్చంద్రుడు ఆధునికుడు కనుక, వారి ప్రతిభను కూడా తనలో జీర్ణింపచేసుకొని, తన రచనలకు మెరుగులు దిద్దుకొన్నాడు.

ఏ దేశములోనయినా రచయితలు తమ జాతి విశిష్టతను, నాగరికతను వేయిముఖాలతో చాటుతూనే ఉంటారు. అటువంటి రచనలే కలకాలము సజీవములై నవనవోజ్వలములై ప్రకాశించ గలుగుతాయి. అటువంటి ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించిన రచయితలే చిరస్మరణీయులు. శరచ్చంద్రుడు తన రచనలలో ప్రజ్వలింపచేసిన భారతీయ సంస్కృతి ఉత్తమోత్తమమైనది, అసామాన్యమైనది. దానికి ఆయువుపట్టయిన నారీలోకాన్ని స్వభావవైచిత్రులలో అనేక జీవిత రంగాలలో లాస్యం చేయిస్తాడు. ఆ లాస్యము, ఆ నడక, ఆ పలుకు, ఆ సోయగము ప్రకృతి సిద్ధమైనవి - స్త్రీ సహజమైనవి — స్వచ్ఛందమైనవి.

ఆహారము, నిద్ర, స్నానము ఏయే సమయాలలో తన కవసరమో యెరుగని బాల సమానుడైన సురేంద్రుడిని, బడీ బహిన్ అనే నవలలో శరచ్చంద్రుడు సృష్టించాడు. మాతృవిహీనుడైన ఆ యువకుడు తండ్రి మీద, సవతి తల్లిమీద అలిగి కలకత్తా చేరుకొని, ధనికుడైన వ్రజబాబు యింట్లో పిల్లలకు చదువు చెప్పుతూ, ఆ యింటనే బసచేస్తాడు. అక్కడకూడా సురేంద్రుడు స్వగృహములో మెలగినట్లే మెలగుతాడు. వేళకు భోజనము చేయవలసినదని చెప్పటానికి, అతడి వస్తువులను వెదకిపెట్టటానికి ఎవరయినా రావలసిందే. పసిబిడ్డను, కనిపెట్టినట్టుగా కనురెప్పలలో పెట్టుకొని, భద్రముగా బడీబహిన్ అతడిని కాపాడుతుంది. అతడు, పసిబిడ్డవలెనే ఆమెను విసిగిస్తాడు. ఆమెకూడా కన్నతల్లివలెనే కోపగిస్తుంది. ఆమెమీద ఆగ్రహించిన సురేంద్రుడు— స్వగ్రామము వెళ్ళి, వివాహము చేసుకొని, సుఖముగా ఉంటాడు. కాని అతడి మనసులో ఏదో వెలితి—అవ్యక్తమైన బాధ పీడిస్తూ ఉంటుంది. అతడు అస్వస్థుడుగా ఉన్నప్పుడు, బడీబహిన్‌కు ఎవరివల్లనో అన్యాయము జరిగినదని తెలుస్తుంది. అది అతడి 'జమీందారీ వ్యవహారాలను నిర్వహించే గుమాస్తావల్ల జరిగినదని అతడికి తెలియగానే, తూలిపోయే దేహముతో, పడవలో ప్రయాణముచేసి, బడీబహిన్‌ను [illegible]లుసుకుంటాడు. ఎంతో కాలమునుంచి [illegible]ల్లి కొరకు పరితపించిపోయే పసిబిడ్డవలె [illegible]మంటూ ఆమెను సమీపిస్తాడు. తన వేళా


అమిత సౌందర్యము కొరకు
మీ చర్మమును యౌవనంగాను, ఉల్లాసితంగాను—శుభ్రంగాను, మనోహరంగాను ఉంచుకొనుడు. మనోహరమైన సహజ సౌందర్యమును రూఢిగా పొందుడు. "'హేజ్‌లైన్' స్నో" మీ చర్మమును చల్లగాను, కాంతివంతముగాను, సుందరముగా నొనర్చును.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్‌లైన్' స్నో" (ట్రేడ్‌మార్క్)
బర్రోస్ వెల్‌కమ్ అండ్ కం. (ఇండియా) లి, పి.బి. బాక్సు 290, బొంబాయి

★ శరచ్చంద్రుడి నారీజగత్తు ★

అను తమించుమని వేడుకుంటూ, ఆమె ఒడిలో ప్రశాంతముగా తల పెట్టుకొని కన్ను మూస్తాడు. బడీబహిన్ కడుపు దుఃఖముతో విలవిలలాడిపోయే మాతృమూర్తివలె ఆక్రందనము చేస్తుంది. ఇంతకూ ఆమెకూ అతనికీ ఏమిసంబంధము? అతను ఆమె తండ్రి యింట చేరిన అనాథ. అతడు ఆ యింట ఉన్నంతకాలమూ ఆమె కులాచారాన్ననుసరించి అతడిని కన్నెత్తిచూడదు. కాని— ఆ అమాయకుడికి కావలసిన సౌకర్యాలను సమకూర్చవలెనని ఆమె హృదయము పరితపించిపోయేది. ఆమె బాలవితంతువు. ఏ సంబంధమూ లేని పరాయివానికొరకు ఆమెకష్టించటాన్ని ప్రపంచముచూసి సహించదు. అనేకఅపవాదులు బయలుదేరాయి. జలమువంటిచంచలపదార్థముతో భగవంతుడు నారీహృదయాన్ని సృష్టించాడని శరచ్చంద్రుడి నమ్మకము. స్త్రీ హృదయము స్వచ్ఛమూ, సరళమూ, స్నేహస్నిగ్ధమూ అయినది. కుటుంబానికి స్త్రీ కల్పవృక్షము వంటిది. భర్తయొక్క స్వచ్ఛమైన అనురాగములో ఓలలాడిన స్త్రీని, ప్రపంచములో ఏ ఇతర వస్తువూ ప్రలోభపరచలేదని రచయిత ఘంటాపథముగా చాటుతాడు. భర్త జీవించియున్న కాలంలో ఆమె తన హృదయసీమలో విరియబూసిన సుమాలను మాలగా గుచ్చి, అతడి కంఠసీమ నలంకరించుతూ ఉండేది. భర్త మరణించిన తరువాత ఆమె ఆ పూలచెట్లను అంతమొందించలేదు. అవి విరియబూస్తూనే ఉన్నాయి. బడీబహిన్ వాటిని మాలగా సంధించక, ప్రోగుచేసి దీనులకూ అభాగ్యులకూ దోసిళ్లతో పంచుతుంది. బడీబహిన్ స్వార్థచింతనమూ, కృపణత్వమూ లేశమాత్ర మెరుగని స్నేహమయి, ఆనందమయి.

భారతదేశములో పన్నెండు సంవత్సరముల బాలిక కూడా వివాహబంధముయొక్క పావిత్ర్యాన్ని అర్థము చేసుకుంటుంది. భారతదేశములోనిదాంపత్యము కేవలము పరస్పర శారీరక వాంఛలను తీర్చుకోవటానికి ఏర్పడినది కాదు; మానసికముగాను ఆధ్యాత్మికముగాను ఒకరినొకరు సంప్రతించుకొంటూ, సంస్కరించుకొంటూ, స్త్రీ పురుషుల జీవితాలను పునీతము చేసుకోవటానికి ఏర్పడిన బంధము. పురుషుడు సంపాదించిన పుణ్యములోను యశస్సులోను భార్యకు పాలుపంచేది హిందూ జీవనపథ మొక్కటే. స్త్రీని ఎంత పవిత్రముగా భావించితే, జాతి అంత పవిత్రవంతముగాను ప్రకాశవంతముగాను ఉండగలదని భారతదేశము విశ్వసిస్తుంది. దాంపత్యధర్మ మెరుగని పన్నెండు సంవత్సరాల బాలికయైన లలిత హృదయములో శేఖరుడు ఆరాధ్యదైవమయినాడు - పరిణీత అనే నవలలో, వినోదార్థము బాల్యచాపల్యముకొద్దీ లలిత శేఖరుడి మెడలో పూలహారము వేస్తుంది. పూలహారము మెడలో వేయటాన్ని గురించి అతను విపులీకరిస్తూ 'ఎంతపని చేశావు లలితా!' అంటూ ఆమెను చుంబిస్తాడు. కాని - యిద్దరి మధ్యనూ, ఆ రెండుకుటుంబాల మధ్యను రెండుమూడుసంవత్సరాలలోనే అనేక మార్పులు కలుగుతాయి. లలితది పేద కుటుంబము. శేఖరుడు పెద్దయింటి బిడ్డ. వారిద్దరికీ వివాహము అసంభవముగా కనబడుతుంది. కాని లలిత ప్రతినిత్యమూ శేఖరుడి యింటికి వెళ్లి అతడి పనులన్నీ చక్కబెట్టి వస్తుంది. అతడిపట్ల భక్తిగౌరవాలతో మెలగటము అలవర్చుకొంటుంది. వీరిద్దరి మనోగతాలు ఎవరికీ అర్థముకావు దగ్గరి బంధువులవలె చనవుగా తిరుగుతున్నట్లే కనబడుతారు. తాను గ్రామములోలేని కొద్ది వ్యవధిలో, లలితకు సంబంధము కుదిరి వివాహమైనట్లు శేఖరుడికి తెలుస్తుంది. వచ్చిన తరువాత ఆమె నడిగి సందేహము తీర్చుకోడు. మనసులో బాధపడిపోతాడు. వివాహము జరుగబోయేముందు వారిద్దరి గంభీర ప్రకృతులు మనోజ్ఞముగా చిత్రింపబడ్డాయి. అతడియెడ ఆమె అనురాగము బహు గంభీరమైనది. అతి పవిత్రమైనది. ఆ ప్రణయమాధుర్యమూ, దాని గాంభీర్యమూ 'పరిణీత' నవలలో ధారావాహికముగా ప్రవహించింది.

సమస్తమైన అనాచారాలూ చేసి ఇంటికి వచ్చినా, స్త్రీ తనను దేవతగా పూజించాలని పురుషుడి అభిమతమట. ఇది అన్యాయమనీ, అసంబద్ధమనీ స్త్రీకి తెలుసు. అయినా పురుషుడికి ఎదురాడదు. సంకుచిత హృదయుల ఎడ హీనముగా ప్రవర్తించటము శరచ్చంద్రుడి నారీలోకానికి గిట్టదు. విశాల మాతృహృదయముతో అనునయించటానికి ప్రయత్నిస్తుంది. భారతరమణి తన భర్తలోని లోపాలను బయట పెట్టటానికి అంగీకరించదు. అతడిని నిత్య యౌవనుడిగాను, ఆదర్శపురుషుడిగాను భావించుతుంది. సాంఘికాచార వ్యవహారాలను పురుషుడు అతిక్రమించటానికి ప్రయత్నించినప్పటికీ, స్త్రీ వాటిని నిలబెట్టటము తన విధ్యుక్తధర్మముగా భావిస్తున్నది.

'భైరవి' నవలలో షోడశి అసాధారణ పరిస్థితులలో విసరివేయబడ్డది. చండీఘడము లోని చండీ దేవతకు ప్రధాన సేవకురాలు భైరవి. ఈ పదవికి స్త్రీలు తప్ప పురుషులు యోగ్యులు కారని దేవి ఆజ్ఞాపించినదట. స్త్రీలలో కూడా అందరూ యోగ్యులు కారు. వైవాహిక జీవిత మెరుగని స్త్రీ కావాలి. దీనికి వివాహము కాని కన్యలు గాని, వితంతువులుకాని యోగ్యులు కారు. దేవికి భైరవిగా ఉండతగిన స్త్రీ అపవిత్రము కాని సుమంగలియై ఉండాలి వివాహానంతరము ఆమెకు భర్త నీడయినా సోకకూడదు. అతడిని గురించిన ఏవిధమయిన దుర్వార్తగాని ఆమె చెవిన పడకూడదు. ఈ నియమాలను సాధించటానికి, వివాహానంతరము వరుడికి కొంత ధనమిచ్చి, దేశాంతరగతుని చేసి, ఆ వధువును భైరవిగా నియమించేవారు. కర్మవశాత్తు ఆమె వితంతువు కావటము తటస్థించితే, వెంటనే మరొక భైరవి నియమింప

ఎవేది. ఈ పరిస్థితులలో ఒక అర్ధరాత్రివేళ, కులగోత్రాలు తెలియని ఒక పిల్లవాడిని తీసుకొనివచ్చి, తొమ్మిది సంవత్సరాల వయసుగల షోడశిని యిచ్చి వివాహము చేస్తాడు ఆమె తండ్రి తారాదాసు. ఆ రాత్రికి రాత్రి, వరుడిచేతిలో రెండుసంచుల రూపాయలు పెట్టి దేశాంతరము పంపివేసి ఆమెను భైరవిగా తండ్రి నియమిస్తాడు. ఇది జరిగిన పది పన్నెండు సంవత్సరాల తరువాత ఒక నాటి సాయంత్రము, జమీందారు ఆ గ్రామములో బసచేసి, భైరవి తండ్రి చెల్లించని పన్నులకు, అతడు చేసిన అపరాధానికి ఆమెను నిర్బంధిస్తాడు. పైకము తెచ్చి కట్టమని బాధిస్తాడు. ధనము లేకపోయినా మరొకవిధంగా తన బాకీ తీర్చుమంటాడు. ఆమెను ఒక గదిలో బంధిస్తాడు. దుర్మార్గుడయిన జమీందారుకు అకస్మాత్తుగా గుండెపోటు వస్తుంది. ఆ సమయములో అతడి పెట్టె తెరచి ఔషధముతీసి యివ్వటానికి భైరవే దిక్కవుతుంది. తనను దుర్భాషలాడి గదిలో బంధించిన జమీందారుకు భైరవి జాలితో ఔషధమిచ్చి ఉపచారము చేస్తుంది. షోడశి రూపలావణ్యములతోపాటు ధైర్యసాహసములు కలది. ఆ గ్రామములో అనేకమంది గుంటరులు ఆమెను వంచించాలని ప్రయత్నించి విఫలులయ్యారు ఆమె ఎంత స్వేచ్ఛగా గ్రామములో సంచరించేదో అంత భయంకరముగా ప్రవర్తించేది. ఆమె స్వభావము తెలిసికొన్న తరువాత ఆమె జోలికి పోవటానికి అందరూ జంకేవారు. కాని జమీందారుచే బలవంతముగా పట్టి తెప్పించబడిన భైరవి, అపవిత్రమయిపోయినదనే అందరూ భావించారు. సమయానికి గుండెపోటు రాకపోతే ఆ జమీందారు ప్రవర్తన ఏవిధముగా ఉండేదో – కాని షోడశిచేతి ఔషధము సేవించిన తరువాత – బాధతో మూలుగుతూ 'అలకా!' అంటాడు. ఆమె త్రుళ్లిపడుతుంది. అలక ఆమెచిన్నప్పటి పేరు. అర్ధరాత్రివేళ, తనకు మంగళసూత్రము కట్టగానే అజ్ఞాతవాసము పంపబడిన ఆ బాలుడే, జమీందారు వంశీయులకు దత్తపుత్రుడయి దుర్మార్గప్రవర్తనవల్ల గౌరవము పోగొట్టుకొంటున్నాడని ఆమె గ్రహిస్తుంది. ఆ బాధలో-ఆమెచేత ఉపచారము చేయించుకుంటూ అతడు 'ఆనాడు గత్యంతరములేక జరిగిన వివాహాన్ని ఇప్పుడు గుర్తించి-నిన్ను జమీందారుల కుటుంబములోకి వధువుగా తీసుకొని వెళ్లటము నాకు ధర్మముగా తోచదు' అంటాడు. దానికామె చలించదు నీతులనుగాని, ధర్మాలనుగాని ఏకరువుపెట్టదు. అతడిని బ్రతిమిలాడదు-ప్రాధేయపడదు. కాని తన విధ్యుక్తధర్మమనుకొని, పోలీసులబారినుండి రక్షించి, అతడి గౌరవము కాపాడుతుంది. జమీందారుతో ఆమెకు సంబంధమున్నదని గ్రామస్థులందరూ శంకిస్తారు. ఆమెను బహిష్కరిస్తారు. అయినా ఆమె చలించదు. వధువుగా ఆమెను స్వీకరించటానికి అయిష్టము తెలిపిన జమీందారు, ఆమె శీలాన్ని గురించి ఒక కంట కనిపెట్టుతూనే ఉంటాడు. తన సచ్ఛీలాన్ని అతడి ఎదుట బుజువుచేయాలని ఆమె ప్రయత్నించదు. నిలవటానికి నీడకూడా కరవైపోయినకాలములోనయినా, ఆమె భర్తను మనసులోతప్ప పైకి గుర్తించదు; ఆత్మవంచన చేసుకోదు. ఆమె హృదయౌన్నత్యాన్ని గ్రహించటానికి అతడికి కొంతకాలము పట్టింది. హఠాత్తుగా ఒకనాడు వచ్చి 'అలకా! నీవు లేనిదే నా జీవితనౌక నడవదు' అని చెయ్యి చాపుతాడు. ఆ పతినే జాలిగా తీసుకొని, అతడివెంట బయలుదేరి వెళ్ళుతుంది. 'నా హృదయము మాలిన్య మెరుగనిది. నా కదే చాలు!' అంటుంది భైరవి.


స్త్రీ తనంతటతాను చనువు ఇవ్వనిదే ఏ పురుషుడూ ఆమెను సమీపించలేడని శరచ్చంద్రుని విశ్వాసము. స్త్రీలకు స్త్రీత్వాన్ని ప్రసాదించి, పురుషుల మానసిక యంత్రాలకు అధీనము చేయించవలెనన్న మతిభ్రమ, సృష్టికర్తకు ఎవరు కలిగించారని ఆ రచయిత ప్రకృతిని ప్రశ్నిస్తాడు.

అమృత సమానమూ మాతృహృదయమూ గల స్త్రీ స్వభావములో మిక్కుటమైన స్వాభిమానమూ ప్రతీకారవాంఛ ఉంటాయట. మనోదౌర్బల్యమువల్ల వాటిని ఎప్పుడైనా భర్త ఎదుట కనబరచినప్పటికీ, తిరిగి

★ శరచ్చంద్రుడి వారి జగత్తు ★

పశ్చాత్తాపముపొంది తనకు తానే శిక్షించుకొంటుందట. వాసకసజ్జికయై, పుష్పహారము చేతబట్టుకొని ఆత్మేశ్వరునికొరకు ప్రతిక్షణమూ జీవితములోని చివరి వెలుగు రేఖలు సన్నగిల్లేవరకూ ప్రతీక్షిస్తూ ఉంటుంది.

స్వగ్రామములో తగవులవలన విసిగి, జన్మభూమిని వదలిపెట్టి వెళ్ళిపోవలెనను కొన్న యువకుడిని 'రొట్టెతో పెంచిన దేహాన్ని పారిపోవటానికి ఉపయోగిస్తావా?' అంటుంది 'పల్లీయులు' నవలలో విశ్వేశ్వరి అనే గృహిణి 'అవ్యక్తముగా ప్రవర్తించేవారినీ, దుర్బలులనూ కోపించి సాధించేదేమిటి?' అంటుందొక ఇల్లాలు.



'జాతి భేదాలు ద్వేషానికి హేతువులు కావు. గ్రామాలలో తగవులు అజ్ఞానమువల్లనే బయలుదేరుతాయి. వాటికి జ్ఞాన ప్రబోధమే విరుగుడం'టుంది ఒక వనిత. 'మిథ్యను కెలకినకొద్దీ దాని ఆయువు పెరుగుతూ ఉంటుంది. ఓపికతో దాని ఆయువును పెంచిన దానికంటె మహాపాపము మరొకటి లేదు' అని తీర్పు చెప్పుతుంది ఒక వృద్ధురాలు. 'నీకు అనుభూతిగాని విషయాలను ఇతరులకు చెప్పవలెనని ప్రయత్నించకు' అంటుందొక మానికమణి తనకెదురయిన ఒక రచయితతో.

ఎన్నికష్టాలు వచ్చినా శరచ్చంద్రుడు సృష్టించిన స్త్రీలు సత్యానికీ ధర్మానికీ బద్ధులవుతారు. ఎటువంటి అవినీతిపరులైనా సునాయాసముగా, ఇతరులను నొప్పించకుండా, తాము నొచ్చుకోకుండా, సంస్కరించగల నైపుణ్యము చిత్తశుద్ధిగల వారా స్త్రీలు. శ్రీకాంత, విప్రదాసు, దేవదాసు నవలలలో నవతాంశగల స్త్రీగణము మనకు ప్రత్యక్షముగా కనబడుతుంది.

'దేహ సమర్పణవల్ల స్త్రీ జీవితాంతమూ గౌరవింపబడదు ఆత్మసమర్పణా, త్యాగం వల్ల ఆజన్మాంతమూ స్త్రీ కీర్తింపబడుతుంది. నిరవరుద్ధ కళ్యాణమయమైన ఆనందమే ఆమె జీవితానికి శోభనిస్తుం' దని పాత్రలచేత శరచ్చంద్రుడు పలికిస్తాడు.

దౌర్బల్యమువల్ల మానవుడు అనేకములైన పొరబాట్లను చేయవచ్చు — సంఘములో చేసిన పొరబాటును సరిదిద్దుకునే అవకాశాలను మనకెవరూ కల్పించరు. మానవుడు తనను తాను పరిదిద్దుకొంటూ క్రమముగా అనుభవము గడించి పరిపూర్ణుడవుతాడు. మానవుడి క్రమవికాసానికి దోహదమిచ్చే మార్గాలను మూసివేయటము అభ్యుదయ లక్షణము కాదు' అని వాదిస్తుంది ఒకసాధ్వి. మంచికి చెడు ఎప్పుడూ శత్రువు కాదు. దానికి మించిన మంచితనమే శత్రువు. కాలముతోపాటు వేదాంతతత్వాలు కూడా పరివర్తన పొందాలి అప్పుడే మానవుడికీ దేశానికీ విజయము చేకూరుతుంది' అని ఒక నవలలో స్త్రీ పాత్ర నిర్ణయిస్తుంది.

'స్త్రీలకు స్వాతంత్ర్యము కావాలి-ముక్తి కావాలి' అని నోటితో ఆర్భాటము చేస్తూ స్త్రీ పురుషులు ఒక్క అడుగైనా ముందుకు జరగటము లేదు. స్వాతంత్ర్యము తత్వవిచారము వల్ల రాదు 'అన్యాయము-అధర్మము' అని ఎలుగెత్తి ఏడ్చినందువల్ల రాదు-సభలలో వేలకు వేలు గుంపులుగా చేరి మగవారిని దూషించి, తీర్మానాలుచేసి తగవులాడినా రాదు. స్త్రీ స్వాతంత్ర్యము ఒకరు ఇస్తే తీసుకొనేది కాదు. మనః పరిపూర్ణతవల్లను, ఆత్మవైశాల్యమువల్లను స్త్రీ తనంతటతానే స్వాతంత్ర్యాన్ని పొందగలుగుతుం'దని ఆ స్త్రీలు వేనోళ్ళతో చాటుతారు.

శరచ్చంద్రుడు సృజించిన స్త్రీ పాత్రలకు పునర్వివాహములో విశ్వాసము లేదు. పతితలైన స్త్రీలు వివాహము చేసుకొని ఆ పావిత్ర్యాన్ని కళంకితము చేయటానికి సమ్మతించరు. దురదృష్టవశముచేత కళంకితులయినా ఆ స్త్రీల క్షమ, హృదయ వైశాల్యము అపారమైనవి. ఈ జాతికి చెందిన మహిళ 'శ్రీకాంత' లో దర్శనమిస్తుంది. ఆ స్త్రీల సంభాషణలలో, ఉనికిలో జాతీయత అంతర్వాహినిగా ప్రకాశిస్తూ ఉంటుంది. వారందరూ విద్యతో కాక, అనుభవప్రాప్తితో కాక, జీవనతత్వాన్ని ప్రత్యక్షముగా కళ్లతో చూస్తూ సంభాషిస్తారు; ధర్మాధర్మ విచక్షణ యుక్తాయుక్త జ్ఞానమూ కలవారు; శబ్దాడంబరాలకూ భావాడంబరాలకూ మోసపోని విజ్ఞాన సంపన్నులు. 'తెల్లటి సూర్యకాంతి న్యాయముతో సమానమయితే, అన్ని రంగుల కలయికే తెలుపురంగ' ని ఉద్ఘాటిస్తారు. శరచ్చంద్రుడి దృష్టిలో స్త్రీ సంఘసంస్కారిణి; సంఘ పురోగామిని; దేశానికి నేత్రి; గ్రామానికి మాత; కుటుంబానికి మూల స్తంభము; జాతీయతకూ నాగరికతకూ అటపట్టు; కరుణామయి; త్యాగశీల; ఆనందమయి; ప్రేమమయి; విశ్వజనని.

శరచ్చంద్రుడి స్త్రీ పాత్రలన్నీ సజీవములైనవి. సంఘములో ఎప్పుడు పిలిచినా పలికేవి. ★



బహుమానం

పూర్వం మగధ దేశంలో మణిమంతుడనే గొప్ప ధనవంతుడుండేవాడు. యౌవనంలో అతను చేయని వ్యాపారంలేదు. ఎంత ధనం సంపాదించాడో అతనికే లెక్క తెలియనంత ధనం కూడబెట్టాడు.

అతనికి వృద్ధాప్యం వచ్చింది! ఆణిముత్యాల్లాంటిముగ్గురు కుమారులున్నా రతనికి! ముగ్గురూ యుక్త వయస్కులయారు! ముగ్గురికీ వ్యాపార సరళులు ఏనాడో నేర్పించాడు మణిమంతుడు! ఇక మిగిలిందల్లా వారిని వ్యాపారంలో ప్రవేశింపజేయడమే!

మణిమంతునివద్ద ఒక అమూల్య వజ్రపు టుంగరం వుంది! అలాంటి వుంగరం మగధదేశం యావత్తూ గాలించినా దొరకదు! అది ఎంత విలువ చేస్తుందో ఎవరూ ఖరీదు కట్టి చెప్పలేకపోయారు! చివరకలాంటి వుంగరం రాజుగారికూడా లేదంటే అతిశయోక్తి కాదు. మణిమంతుడు సముద్రవ్యాపారం చేసేటప్పుడు, రత్నాల దీవిరాజు దానిని మణిమంతునకు బహూకరించాడు.

ఒకనాడు మణిమంతుడు ముగ్గురు కుమారులను పిలిచి యిలా అన్నాడు:

"నాయనలారా! నేనెంత కాలమో జీవించను! వృద్ధాప్యం పైబడుతూ వుంది. నా అనంతరం, నాయంతటివారై వ్యాపారాన్ని వృద్ధిచేయండి! మీకు నేర్పవలసిన వ్యాపార మెలికలు లేవు! కాబట్టి యీరోజునే మీరు వ్యాపారానికి సిద్ధంకండి! కావలసిన ఏర్పాట్లతో వెళ్లి నెలరోజులకల్లా తిరుగు ప్రయాణం కట్టి వూరు చేరుకోవాలి! ఎవరెంత లాభం సంపాదిస్తారో చూడాలి!"

శింగంపల్లి అప్పారావు

తండ్రి వ్యాపారానికి సిద్ధం కండనగానే ముగ్గురు యువకులూ సంబరపడ్డారు.

"ఇంకొక సంగతి! యీ నెల రోజుల్లో ఎవరైతే అద్భుత ఘన కార్యం చేస్తారో వారికి నా అమూల్య వజ్రపుటుంగరం బహూకరిస్తాను!" అన్నాడు మణిమంతుడు.

ముగ్గురూ సంతోషిస్తూ కావలసినంత ధనం గ్రహించి మూడు దిక్కులా ఆనాడే వ్యాపారానికి బయలుదేరి వెళ్ళారు!

నెలరోజులు యిట్టే గడిచిపోయాయి...ఒకరోజు యించుమించుగా ముగ్గు రన్నదమ్ములూ స్వగృహం చేరుకున్నారు!

వారు చేసిన వ్యాపారం, వ్యాపారం చేసిన విధానం, ఎంతెంత లాభాలు గడించిందీ వివరించారు!

అది వినగానే మణిమంతుడు, తన కుమారులు ప్రయోజకులై తన పేరు, వ్యాపారం నిలబెడతారని ఎంతో సంతోషించాడు!

ఆ తరువాత ముగ్గురినీ దగ్గరకు పిలిచి "మీరీ నెలదినాల్లో చేసిన అత్యంత, అద్భుత ఘన కార్యమేమిటి!" అని అడిగాడు.

మొదటివాడిలా చెప్పాడు!

"నేను ప్రయాణం చేస్తూ ఒక వూరు చేరుకున్నాను. అక్కడ వ్యాపారం చేస్తుండగా, ఒకనాడు నావద్దకొక అపరిచిత వ్యక్తి వచ్చి, తనవద్దనున్న రెండులక్షల మాడలను నావద్ద దాయబెట్టి, రేపువచ్చి తీసుకువెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు ...కాని రాలేదు. ఆ డబ్బు నేను వ్యాపారంలో వినియోగించాను.

★ బహుమానం ★

పదిహేను రోజుల అనంతరం అతను నాకు కనిపించాడు. వెంటనే అతని రెండులక్షుల మాడలూ...నేను పదిహేను రోజులూ డబ్బు వాడుకున్నందుకుగాను, వడ్డీ కూడ యిచ్చి పంపించివేశాను !...నిజంగా నేను చేసింది ఘనమైన కార్యం! అతను డబ్బు యిచ్చినపుడు నేను దానిని అపహరించవచ్చు! అడిగేవాడెవడూ లేడు! నన్నెవరూ శిక్షించలేరు! కాని అలా చేయలేదు! పైగా వడ్డీతోకూడ అతని డబ్బు భద్రంగా ముట్టచెప్పాను! దీనికన్నా గొప్ప కార్య మేముంటుంది నాన్నా!" అని ముగించాడు.

మణిమంతుడు పెద్దవాడి వంక చూసి చిరునవ్వు నవ్వి యిలా అన్నాడు:

"నీవు చేసింది ఏమంత గొప్ప కార్యం కాదు! నలుగురూ నడిచే పద్ధతిలో నడిచి మంచివాడివనిపించుకున్నావ్! ఆ ధనాన్ని అపహరించ తలచుకుంటే నీవు మానవుల్లో జమకాదగినవాడవు కావు! నీవు చేసిన కార్యానికి వుంగరం సంపాదించే అర్హత లేదు!!

రెండవవాడిలా చెప్పాడు:

"నేను సముద్రంమీద ప్రయాణం చేస్తున్నాను. ప్రయాణీకులమంతా ఓడ పైభాగంమీద చల్లగాలికి తిరుగులాడుతున్నాం! కాని


యింతలో ఒక కుర్రవాడు కాలు జారి ఓడమీదనుంచి సముద్రంలోనికి పడిపోయాడు...ఓడంతా గగ్గోలు పడిపోయింది! అంతా అలా ప్రూన్పడి చూస్తూ వుండిపోయారు. నేను వెంటనే ఆలస్యం చేయకుండా, సముద్రంలోనికి దూకేశాను. ఉక్కిరి బిక్కిరౌతున్న కుర్రవాడిని పైకెత్తి, అతి ప్రయాసమీద ఓడ చేర్చాను. ఓడలో వున్నవారంతా నన్నెంతగానో కొనియాడారు. చాలామంది నా ధైర్య సాహసాలకు బహుమతులు కూడా యిచ్చారు. నిజంగా నేను చేసింది ఘనకార్యం! ఎవడూ తన ప్రాణాన్ని యింకొకరికోసం త్యాగం చేయడు!"

మణిమంతుడు సంతోషంతో "నాయనా! నీవు చేసింది నిజంగా మెచ్చుకోదగిన సాహసకార్యం! ఇతర ప్రాణి రక్షణకోసం, నీ ప్రాణ త్యాగానికి పూనుకోవడం...నిజంగా నేను ఆనందపడుతున్నాను! కాని అది అద్భుతకార్యం కానేరదు! ఒక ప్రాణి బాధపడుతుంటే రక్షించడం, మానవత్వాన్ని నిరూపిస్తుంది! నీవు సరియైన మానవుడవని పించుకున్నావు అంతే? బహుమానం పొందే అర్హతలేదు?" అన్నాడు.

తరవాత మూడవవాడు తన కథ చెప్పాడు.

"ఒకనాడు నేను కాలినడకన బయలుదేరాను! చివరకొక లోయ చేరుకున్నాను. అక్కడొక ఉన్నత ప్రదేశం వున్నది. అక్కడొక గొఱ్ఱెల మంద మేస్తూ కనిపించింది. ఒకతను పడుకొని నిద్ర పోతున్నాడు. క్రిందినుంచి చూశాను. అది చాలా అపాయకరమైన ప్రదేశం! అతను ఏమాత్రం యిటు తిరిగినా, అమాంతం అక్కడనుంచి దొర్లుకుంటూ వచ్చి క్రింది లోయలో పడిపోతాడు! వెంటనే, నేను ఆలస్యంచేయకుండా శ్రమపడి పైకి వెళ్లాను. కానీ తీరా చూద్దును గదా! అతను నా బద్ధశత్రువు! ఎన్నిసార్లో నాకు అపకారం చేశాడు! ఒకసారి నన్ను చంపుదామని కత్తితో పొడిచాడు కూడాను! దైవకృపవల్ల తప్పించుకోగలిగాను! అలాంటివాడిని [illegible]... కాని నా మనసు దయతో నిండిపోయింది. వెంటనే అతన్ని సమీపించి మెల్లగా తట్టి లేపాను. అతను ఉలిక్కిపడి లేచి నన్నుచూసి భయపడిపోయాడు! నేనేమీ చేయనని, అపాయాన్ని వివరించి, జాగ్రతగా వుండమని చెప్పి క్రిందికి దిగి వచ్చేశాను" అన్నాడు మూడవవాడు!

మణిమంతుడు ఆనందంతో లేచి వచ్చి మూడవవానిని కావలించుకొని "నీవు చేసింది నిజంగా అద్భుత



ఎవరు తెలుసుకొని ఎవరు ఎరుకొని

నేమాని వీరభద్రరావు

రామునాయుడు రంగారాయపురానికి మునసబు. గ్రామస్థులందరికీ అతనంటే ఎంతో గౌరవం. అధికారి కదా అని ముందొకమాట, వెనకొకమాట అనిపించుకొనే ప్రవర్తన కాదు, రామునాయుడుది. రంగారాయపురంలో పూర్వ్వ లెప్పుడో కట్టిన దేవాలయం పాడుపడింది. రాము నాయుడు గ్రామాధికారం చేపట్టినప్పటి నుండి అనుకుంటున్నాడు, దేవాలయాన్ని ఎలాగైనా బాగు చేయించాలని. ఒక రాత్రి అందరూ భోజనాలు చేశాక పెద్ద మఱ్ఱి కింద సమావేశ మయ్యారు. గ్రామంలోని దేవాలయం బాగు చేయించగలందులకు గల అవసరాన్ని రాము నాయుడు అందరికీ తెలియజెప్పేడు. తాహతుకు తగినంత విరాళం యివ్వవలసినదిగా అందరినీ కోరాడు. వెంటనే మునసబు రామునాయుడు, కరణం వెంకోబరావు, గ్రామంలో పెద్దని పించుకుంటూన్న నరసునాయుడు యీ కార్యం నడిపించవలసినదిగా నిశ్చయింపబడింది.

మరుచటి దినం పుదయాన్నే రామునాయుడు మొదలైన వారు గ్రామంలో మోతుబరైన కన్నమనాయుడు యింటికి వెళ్లేరు :

"మీ విరాళం అందరికీ ఆదర్శప్రాయంగా వుండాలి" అన్నారు.

"నేను ముందు అనుకున్నట్టుగానే రు 500/- లు యిస్తున్నాను" అని సొమ్ము రామునాయుడు చేతిలో పెట్టేడు నరసునాయుడు.

తరువాత యువకుడు, ఉత్సాహవంతుడు, ఆస్తిపరుడు అయిన రాజారెడ్డి యింటికి వెళ్లేరు: రాజారెడ్డి ఎంతో మర్యాద చేసి రామునాయుడు చేతిలో వెయ్యిరూపాయిలు వుంచేడు.

రామునాయుడు తానుతలపెట్టిన కార్యం సఫలమవబోతూందని మనసులో సంతోషించేడు :

మరుచటి దినంనుంచి విరాళాలు చురుకుగా వసూలు అవడం మొదలు పెట్టేయి. రు. 5/- లు యిచ్చిన వారు కూడా చాలామంది వున్నారు. ఏ ఒక్క యింటికీకూడా దేవాలయ నిర్మాణంలో భాగం వుండకుండా వుండరాదని రాము నాయుడి కోరిక. కడు బీద వాళ్ల యింటికికూడా వెళ్ళి వచ్చేరు.

రంగారాయపురంలో అచ్చమ్మ అని ఒక బీదరాలుంది. ఆమెకు భర్త పోయేడు. పాపం తనను ముగ్గురు పసిపిల్లలను ఆమె పోషించాలి. రోజూ కష్టపడి ఎనిమిదణాలు తెచ్చుకుంటూ, ఏదో గంజికాచి పిల్లలూ తనూ బ్రతుకుతున్నారు. రామునాయుడు అనుకున్న ప్రకారం అచ్చమ్మ దగ్గరకు కూడా విరాళానికి వచ్చేడు. ఆమె వుండే యిల్లు ఆమె పిల్లల పరిస్థితి చూచి రాము నాయుడికి జాలికలిగింది. ఆమెను విరాళం యిమ్మని అడగడమే అతనికి ప్రాణాంతకమైంది. కాని పద్ధతి ప్రకారం అడిగేడు.

"అయ్యా, యీ దినం ఎనిమిదణాల కూలి సంపాదించేను. యీ సొమ్ము దేవాలయ కట్టడంలో వుపయోగ పడాలి." అని అచ్చమ్మ రాము నాయుడికి యిచ్చింది.

"అచ్చమ్మా, యీ పూట భోజనం

బహుమానం

కార్యం! అతను నీకు అపకారి! అక్కడనుంచి అతన్ని క్రిందికి త్రోసి, నీపగ సాధించుకోగలవు! కాని, అలా చేయకుండా అతన్ని అపాయాన్నుంచి కాపాడగలిగావు! ఎవరైతే మనసులోని, నిష్కల్మషాన్ని ప్రకటించి శత్రువుని సైతం ప్రాణాపాయాన్నుంచి రక్షించగలరో, వారు నిజంగా మానవోత్తములు! బహుమానానికి నీ వే అర్హుడవు!" అన్నాడు.

తమ్ముడు బహుమానం పొందాడన్న యీర్ష్యలేకుండా, అంతటి ఘనకార్యం చేసినందుకు పెద్ద వాళ్ళిద్దరూ ఎంతో సంతోషపడి, తమ్ముణ్ణి ఎంతగానో మెచ్చుకున్నారు.

మణిమంతుని అనంతరం, ముగ్గురూ వ్యాపారం చేసి, ఎంతో కీర్తిని గడించారు! ★

చెడగొట్టుకొని, పిల్లలను యిబ్బంది పెట్టి నీవు యీ సొమ్ము యివ్వద్దు నీ మనస్సే ప్రధానం. అదే చాలు" అని రాము నాయుడు సొమ్ముపుచ్చుకోలేదు. కాని అచ్చమ్మ బలవంతం మీద తీసుకోక తప్పిందిగాదు.

ఆ రాత్రే పెద్ద మఱ్ఱిక్రింద సభ జరిగింది. గ్రామస్థులందరూ హాజరయ్యారు. "ఎవరు అందరికన్నా హెచ్చు సొమ్ము యిచ్చేరు" అని వెంకునాయుడు ప్రశ్నించేడు.

"రాజారెడ్డి రు. 1000 లు. యిచ్చేడు" అని చెప్పగానే అందరూ రాజారెడ్డిని అభినందించేరు. "ఎవరు అందరికన్నా తక్కువ సొమ్ము యిచ్చేరు" అని సోమునాయుడు ప్రశ్నించేడు. "అచ్చమ్మ రు 0-8-0 లు యిచ్చింది. కాని యీ సందర్భంలో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ నిర్ణయించవలసిన బాధ్యత మీ అందరిమీదా వుంది. ఎందుచేత ననగా, రాజారెడ్డి ఆగర్భ శ్రీమంతుడు. దానికి తగినట్లుగా దానపరుడు. అతనికున్న అంతులేని లో రు. 1000/- ఒక భాగమేఆస్థి

బాబు

'శాలివాహన'

పాలగిన్నెతోడ అమ్మ
పాలు పిదుక నేగగా,
పాలు త్రాగుచుండె దూడ
బాబు చూచుచుండగా

"అయ్యో, చూచుచుంటి వేర
అబ్బురంబు కల్గెనా?
విప్పుకొనగ లేగదూడ
చెప్పవైతి వేలరా?

"చుక్క మిగులకుండ పాలు
శుభ్రముగా తాగెనే
రేపు చల్దిలోకి ఎట్లు
పెరుగు నీకు వచ్చురా?"

అనుచు నిట్లు బాబుతోడ
అమ్మ నగుచు పల్కగా
బదులు చెప్పె నిట్లు బాబు
మృదు మధుర విధంబుగా

"తల్లివైపు దూడ చూచి
జాలి గొలుపునట్లుగా
పిలువ సన్నగొంతుతోన
నిలువ లేకపోతినే

ఆకలయ్యె నేమొ యనెడి
అనుమానము కల్గె, నే
దూడ త్రాడు విప్పగానె
దుముకుకొనుచు వెళ్లెనే

పెరుగు లేకపోయిన మరి
శేడ పెట్టి కొందుమే
కాని, పాలు లేక దూడ
కాక లెట్లు తీరునే."

అనుచు బాబు పలుక అమ్మ
ఆనందము నొందెను.
ముద్దుబాబు బుగ్గపైన
ముద్దులు కురిపించెను!

అవుతుంది. కాని అచ్చమ్మ రోజుకు రు. 0-8-0 లు మాత్రం సంపాదించి, ఆపూటపస్తుండి దేవాలయం కోసం రు. 0-8-0 లు విరాళం యిచ్చింది. అంటే తనకున్నదంతా యిచ్చిందన్న మాట. యిచ్చినది రు. 0-8-0 లు అయినా వున్నది "అంతా" యివ్వడంలో రాజారెడ్డి కన్న యీమే ఎక్కువ" అని సభలో రామునాయుడు చమత్కరించేడు.

సహృదయుడైన రాజారెడ్డి లేచి సభలోనివారందరికి "రామునాయుడు చెప్పినమాటల్లో ఎంతేనా సత్యం యిమిడివుంది. నిజంగా యిక్కడ వెయ్యిమొదలు అయిదు రూపాయిలు యిచ్చిన వారందరికన్నా అచ్చమ్మవిరాళమే హెచ్చయినది" అని నిరాడంబరంగా చెపేడు.

"భగవంతుని దృష్టిలో "ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ" అన్న ప్రశ్నే లేదు. అని రామునాయుడు సభ చాలించేడు.

★

బ్రతుకు జీవుడా!

పి. శ్రీరాములు

అనగా అనగా ఒక నిరుద్యోగి; నిరుద్యోగే కాదు; పట్టభద్రుడు కూడా. గుక్కెడు గంజికి ఆస్కారమయ్యే ఏ చిన్న ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని కాలికి బలపం కట్టుకొని తిరిగాడు. ఎక్కడికి పోయినా చుక్కెదురే. తాటికాయంత అక్షరాలతో "నో వెకెన్సీ" బోర్డులు ప్రత్యక్షం. తిరిగి తిరిగి విసిగి వేసారాడు, పాపం, ఏం చేస్తాడు? ఆత్మహత్య చేసుకోవడం వినా గత్యంతరం లేదేమోననిపించింది. అయితే, ఆత్మహత్య చేసుకోవడం ఆత్మవిశ్వాసం కోల్పోయినవారు చేసేపని అని ధైర్యం చెప్పుకున్నాడు. జీవన్మరణాలమధ్య పెనుగులాడైనా ఏదో ఒక పని సాధించి తీరాలనుకున్నాడు.

ఇలావుండగా వాళ్ళ వూరు ఒక సర్కస్ కంపెనీ వచ్చింది ఆ కంపెనీ మేనేజరును చూస్తే ఏదైనా ఉద్యోగం ఇస్తాడేమోనని తోచింది అతడికి. వెళ్ళి చూశాడు. మా సర్కస్‌లో పట్టభద్రులు అనవసరమన్నాడు మేనేజరు. జమాఖర్చు లెక్కలు వ్రాసే గుమాస్తాఉద్యోగమైనా ఇప్పించమని కాళ్ళావేళ్ళా పడ్డాడు. లాభం లేదన్నాడు మేనేజరు. ఎంతసేపటికీ ఆ నిరుద్యోగి అక్కడినుంచి కదలకపోతే ఫో పొమ్మని కసిరికొట్టాడు. అయినా అతగాడు కదలలేదు. కొంచంసేపటికి ఆ మేనేజరుకే జాలివేసింది.

"ఒక పని చెబుతా చేస్తావా?" అన్నాడు.

"ఏ పనికైనా సిద్ధమే" అన్నాడు నిరుద్యోగి.

"నిజమేనా? అయితే ఒకమాట విను. మా కంపెనీలో వున్న ఒక పెద్ద పులి చచ్చిపోయింది. పులి పాత్ర నటించాలి. ఇష్టమేనా?"

"అమ్మ బాబోయ్ — పులి వేషమే!"

"భయపడకు. పులి తోలు కప్పుకో-నాల్గు కాళ్ళమీదా నడిచినట్లు నడువు - సింహాన్ని, నిన్నూ కలిపి వేదికమీదకి తెస్తాము. అంతే," అన్నాడు మేనేజరు.

"తలుచుకుంటేనే గుండె గుభెల్లుమంటున్నది. ఆ సింహం నన్ను మింగేస్తే!" అన్నాడు.

"ఏం ఫరవాలేదు; మేమందరం దగ్గిరే చుట్టూ వుంటాము. ఆ ఉద్యోగం ఇస్తాం; ఇష్టమైతే చెప్పు" అన్నాడు మేనేజరు.


మేనేజరు అంతగా అభయం చెబుతున్నందువల్ల ఆ పనికి ఒప్పుకున్నాడు.

ఆ రాత్రి సర్కస్ ప్రదర్శనం జరుగుతున్నది. ఇక కొత్త పులిని, సింహాన్ని మేనేజరు వేదికమీదికి తీసుకొనివచ్చి ప్రదర్శించే సమయం సమీపిస్తున్నది. పులిపాత్ర అభినయించవలసిన పట్టభద్రుడికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నవి!

మేనేజరు ఖుద్దున వుండి ముందు సింహాన్ని వేదికమీదికి తెచ్చాడు. ప్రేక్షకలోకాన్ని అది తీవ్రంగా అవలోకనం చేసింది! తర్వాత "పులి"ని తెచ్చాడు పులిపాత్ర అభినయిస్తున్న పట్టభద్రుడికి ముచ్చెమటలు పోస్తున్నవి! బుద్ధి గడ్డితిని ఈ ఉద్యోగానికి ఒప్పుకున్నానురా భగవంతుడా అనుకున్నాడు తనలో తాను. సింహం తనను మింగివేయడం ఖాయమే ననుకున్నాడు. కాళ్లూ చేతులూ గడగడ వణుకుతున్నాయి పులిచర్మానికి వున్న లొట్టకళ్ళలోనుంచి అతి దీనంగా సింహం ముఖంకేసి చూశాడు. సింహంవద్దకు అడుగువేయలేకపోతున్నాడు. మేనేజరు కొరడాతో ఛెడీమని వీపుమీద ఒకటి చరిచాడు. బుద్ధి వచ్చిందన్నట్టుగా "పులి" రెండడుగులు ముందుకు వేసింది. ఎదురుగావున్న సింహం ఇదంతా గమనిస్తూనేవున్నది. పులి తనవద్దకు రావడానికి భయపడుతున్నదని గమనించి, తానే రెండడుగులు ముందుకు వేసి పులి తలదగ్గరికి వచ్చింది. పులి ప్రాణాలు మింటికెగసిపోతున్నవి; నరవాసన పసిగట్టి అమాంతం తనను మింగివేస్తుందనే భయపడ్డది.

ఇంతలో మరొక అడుగు ముందుకు వచ్చి, సింహం పులి చెవి దగ్గిర మూతిపెట్టి "మిత్రమా ఎందుకింత భయపడతావ్? నేనూ ఒక నిరుద్యోగపట్టభద్రుణ్ణే!!" అన్నది.

★



13. నెల్లూరి నెరజాణ

ఆవాళ శుక్రవారం. న్యాయంగా కొట్టు తెరవకూడదు. కాని నూకయ్య పితృవాక్య పరిపాలనలో రాముణ్ణి మించినవాడు. ఏలోకంలో ఏ కిరాణా కొట్టు పెట్టి ఎలా బతుకుతూ ఎక్కడున్నాడో గాని ఎరకయ్య ఏమని చెప్పేవాడు? 'చూడబ్బాయిలూ, నూకాలూ, ధనసంపత్తికి అంతేమిటోయ్? ఆ మాలక్ష్మితల్లి వస్తానంటే వద్దనడం ఏమయినా బాగుంటుందా?' అని. ఈవిధంగా బోధిస్తూ 'చూడు. శలవుదినమని వారానికో రోజు కొట్టు కట్టెయ్యమంటారు. ఆ రోజే గిరాకీ ఎక్కువ. కాస్త చుట్టుపక్కల పోలీసుల్ని మంచి చేసుకుని ఓ బల్లచెక్క - కాస్త మూలదో పక్కదో ఎవరికీ కనపడకుండా తెరచి అక్కడ కూర్చుంటూండు. ఒకవేళ ఎవరయినా వచ్చి చూసినా మనం ఓ చాయరంగు తక్కువ గనక ఆ చీకట్లో ఆనం. లేదా ఓ కిటికీ తెరిచి ఉంచు ఏమీ ఎరగనట్టు. ఇవన్నీ వ్యాపారం కిటుకులోయ్ వెర్రి తండ్రీ! కిటుకులోనే ఉంది కడుపు నిండా మెతుకూ మన బతుకూ.' ఇవన్నీ జ్ఞాపకం వచ్చి శుక్రవారం కొట్టు తెరిచిన ఆ నూకయ్య కళ్ళమ్మట గిరున నీళ్లు తిరిగేయి. ఆ కన్నీటి తెరలో యిద్దరు కన్యలు తనవైపే రావడం నూకయ్య గమనించాడు. ఆ ముందుది 'జాణ' అని తెలియగానే అతని గుండె అప్రయత్నంగా కొట్టుకోసాగింది. వెనక బెల్లం కొనడానికొచ్చి మూడు చెరువుల నీళ్లు తాగించిన ముగ్ధే కదూ యిది? ఏడిపించడానికింకెవరూ దొరకలేదు కాబోలు. ఇది చాలక దీనివెనక 'తెర వెనక తార'లా యిదెవరో?

'ఏం మావా? కులాసాగా ఉన్నావా?' అంది జాణ నవ్వుతూ.

'ఏదో నీ దయవల్ల' అని నూకయ్య ధైర్యం తెచ్చుకొని, 'నీ వెనక ఆ పిల్లెవరూ?' అన్నాడు.

'అదే చెప్పకోవాలి'

'బాగుంది, నాకేం తెలుస్తుంది?'

'మావాళ్ళ పిల్లే. వరసకి మా పెద్దమ్మ కూతురు. పేరు నెరజాణ. వాళ్ళ ఊరు నెల్లూరులే. నీ కీర్తి విని నిన్ను పలకరించిపోదామని వచ్చింది.'

నూకయ్య చేతిలో విసినకర్ర కింద పడిపోయింది. 'నువ్వు కాక మీ అమ్మ ఒకర్తా?' అన్నాట్ట వెనకటికి భార్య ఆకలి చూసి జడిసిన ఒక భర్త. అలాగ - అసలు ఈ జాణతోనే తన ప్రాణం పోయి ప్రాణం చేతిలో కొస్తోంది. పులి మీద పుట్రలా యీ నెరజాణ ఒకర్తా? కొట్టుయొక్క స్థలం వెంటనే మార్చాలని నూకయ్య నిశ్చయించుకొన్నాడు.

'మీరు గణితశాస్త్రంలో చాలా కృషి చేశారని మా అక్క చెబుతూంటుంది, మీదర్శనం చేసు

అవసరాల రామకృష్ణరావు

కుందామని ఎన్నాళ్ళనుంచో ఉవ్విళ్లూరుతున్నాను.'

చేతులు జోడించి నెరజాణ అతి 'సీరియస్'గా యీ మాటలు అంటూంటే జాణ ఫక్కున నవ్వేసింది. నెరజాణ కూడా నవ్వకుండా ఉండలేకపోయింది. ఎంత బేరసికుడైనా నూకయ్య యీమాత్రం గ్రహించలేనంత అసమర్థుడుకాడు.

'మీకేం మరేం పనీపాటు లేదట్రా, నామీదకొచ్చేరు? నేనెంత చాతకానివాణ్ణయినా మెచ్చుకుంటున్నారో వెక్కిరిస్తున్నారో తెలియనంత వాజమ్మని కాను. మీకు ఊసుపోకపోతే వెళ్ళి ఊరుమీద పడండి. అంతేగాని, అబ్బో, నాదగ్గిరా?'

'అంత కోపమయితే ఎలా మాఁవా? వరస కాబట్టి ఓ మంచి ఉంటుంది, మాటుంటుంది - అంతలోకే అగ్గిరాముడివయిపోతే యిక బతగ్గలమా?' అంది జాణ.

'ఆఁ! అలా దారికి రండి.'

'ఏ దారికీ రాం. మా దార్నిమేం పోతాం. పదవే నెరజాణా, వెర్రిదానివి వెయ్యి ఆశలు పెట్టుకు వచ్చావ్, అయిందా, యిక పద.'

వాళ్ళిద్దరూ అలా వెళిపోతుంటే నూకయ్యకి ఉండబట్టింది కాదు.

'ఏయ్ జాణా, అమ్మాయ్ నెరజాణా-యిలా రండీ-వెళిపోతారేం?'

నూకయ్య చేత పదే పదే బతిమాలించుకుని ఆ పిల్లలిద్దరూ తిరిగి కొట్టుమీదకి వచ్చి కూర్చున్నారు.

ఎవరో బేరానికి వచ్చి అరవీశ చింతపండు తూయించుకుని వెళ్లేరు. వెడుతూ వెడుతూ 'తూకం రాళ్లు సరిఅయినవేనా?' అన్నారు.

'ఇవి ఇక్కడి రాళ్లేం కావు, పైనుంచి వచ్చినవి. తులం తక్కువయితే కొట్టు వదిలేస్తానంతే' అన్నాడు నూకయ్య. అతడు వెళ్లిపోయాడు.

'చూడండి లేకపోతే? నాకు అయిదేళ్లప్పట్నుంచీ మా నాన్న నన్ను కొట్టుకు తీసుకొచ్చేవాడు. అప్పట్నుంచి మా నాన్న తూస్తూంటే అలా త్రాసుముల్లువైపు చూస్తూ ఆడుకొనేవాణ్ణి. ఈనాటి అనుభవమా? తూనికలో నాతో తులతూగేవాడు ఈ దేశం మొత్తంమీద లేడని నా దృఢ విశ్వాసం.'

'అలాగా!?' అంది నెరజాణ. ఆ మాట నూకయ్య వెటకారంగా తోచి ఒళ్లు మండింది. ఎవరి గొప్ప వాళ్లు చెప్పుకోకూడదు గాని తనతో సరి సమానంగా తూచేవాడు లేడని ఘంటాపథంగా చెప్పగలడు. ఈ పిల్ల నెల్లూరునుంచి వస్తే తనకేం? పాలఘాటునుంచి వస్తే తనకేం? తనకేం భయం?

'అంటే నీ ఉద్దేశం?'

అతని ఆత్రుత చూసి నెఱజాణ అటువైపు తిరిగి నవ్వుకొంది.

'తొందరపడకు మాఁవా! మా నెఱజాణ తక్కువదేం కాదు. దాని ముందు ఎంతలేసివాళ్ళూ తలవంచుకున్నారు. నువ్వనగా ఎంత?...ఏది ఏమయినా దానిముందు గొప్పలు చెప్పుకోడం ఏమంత మంచిపని గాదు' అని అందించింది జాణ.

'పోవే జాణా, మరీ చెబుతావు' అంది నెరజాణ. నూకయ్యకి కారం రాసినట్టయింది. పావుగంట యిచూస్తున్నాడు. ఈ అప్పచెల్లెళ్ల వరసేం బాగులేదు. వీళ్లు సుళువుగా వదిలేలా లేరు కూడాను. కోపంగా యిలా అన్నాడు.

'అంటే మీ అభిప్రాయం ఏమిటి? లెక్కల్లో మీ నెరజాణ పాటిది లేదనా?'

ఈసారి నెరజాణ ముందుకి వచ్చి యిలా చెప్పింది.

'అది కాదు నూకయ్యగారూ! తూనికల్లో మీరు చాలా గొప్పవారని విని, తమకు చిన్న సమస్య సమర్పిద్దామని యిలా వచ్చాను. కోప్పడక చెప్పింది శ్రద్ధగా వినండి. నాలాగే మా అన్నకూడా లెక్కలంటే తగని అభిమానం. ఓసారి వాడు వ్యాపారంమీద విదేశం వెళ్ళేడు. అక్కడ ఏదో సందర్భంలో 12 బాతులు కొన్నాడు. అందులో పదకొండు బాతుల బరువూ సమానమే. ఒక బాతుమాత్రం దొంగది. అంటే దాని బరువు తక్కినవాటికంటె కొంచెం ఎక్కువో తక్కువో

ఉందన్నమాట. అదేదో తేల్చుకోవాలి. బాతులన్నీ చూడ్డానికి అచ్చు ఒకలాగే ఉన్నాయి'

'తూస్తే తెలిసిపోదూ?'

'మా యింట్లో త్రాసు ఉంది గాని తూనికరాళ్లు లేవు. అంతేగాకుండా మా అన్నయ్య ఒక షరతు పెట్టేడు. మూడే మూడు కొలతల్లో దొంగబాతు ఏదో, అది తేలికో బరువో కనిపెట్టమన్నాడు. సరిగ్గా మూడుకొలతల్లోనే సుమండీ! అయితే నేను అలా చెయ్యగలిగే ననుకోండి. మీరలా చెయ్యగలరా అని నా అనుమానం!'

నాకయ్య దీనంగా త్రాసువైపు చూశాడు. ఎంత ఆలోచించినా ఎలాగో తెలియలేదు. జాణ నవ్వుకుంది.

పన్నెండు బాతుల్లో మాయబాతు ఒకటుంది. త్రాసు ఉంది. మూడు కొలతల్లో అది ఏదో; బరువో తేలికో చెప్పగలరా?

ఇదే ఈ వారం సమస్య.

గతవారం సమస్యకు జవాబు

మిడిల్టన్ చక్రవర్తి 'పాంగ్ ఫూ' చెవులో చెప్పింది అతనే హంతకుడని.

ఈ సంగతి చక్రవర్తి కెలా తెలిసింది? దానికి ఆధారా లేమిటి?

కథలో యివ్వబడిన ముఖ్యమైన సంగతులే మనకు ఆధారాలు.

1. రాత్రి చంపబడతా డనగా పగలు బావమరదు లిద్దరూ కలసి రెండురోజులవరకూ ఆరని వార్నిష్ కిటికీకి వేశారు. అందులోంచి మనిషి మాశివస్తే వార్నిష్ కొంచెమైనా చెరిగిపోదా? కిటికీ వార్నిష్ కొత్తగా, పచ్చగా ఉందని యివ్వబడిందేం?

2. మేడ రెండంతస్తులది. చింతచెట్టు అంత మీదకీ ఉంది. రోడ్డు మీదికి వచ్చాయని క్రిందకొమ్మలు కొట్టేశారుట. అంచేత అంత మీద నుంచి మనిషి దూకి ప్రాణాలతో పారిపోయాడనడం కేవలం కల్పన.

3. పై సంగతుల్నిబట్టి పాంగ్ ఫూ చెప్పింది అబద్ధం అని తెలుస్తోంది. అతనే హంతకుడు కాకపోతే అబద్ధాలాడవలసిన అవసరం అతనికేం లేదు. పైగా బాగా తెలిసిన మనిషి కాకపోతే ఎదురుగుండా వచ్చి చంపడం కష్టం. అందులో సన్నని మనిషి చంపడం మరీ అసంభవం.

పాంగ్ ఫూ నాటకంవంక పెట్టి వెళ్లి, ఏ యింటర్వల్ లోనో తిరిగొచ్చి బావమరిదితో ఏదో మాటాడినట్టే మాటాడి పొడిచి ఉంటాడనీ, దానికి కారణం తోళ్ల వ్యాపారం పూర్తిగా తనది చేసుకోవాలని అయిఉంటుందనీ చక్రవర్తే కాదు, మనమందరం ఊహించవచ్చు. ★

★ సాగరగర్భంలో సాహస యాత్ర ★

(30వ పేజీ తరువాయి)

తగ్గిపోయింది. అంతలో మళ్ళీ ఆ వింతజంతువుగురించి మరికొన్ని కొత్త వింతలు బయలుపడ్డాయి. ఇంతకాలందాకా అది శాస్త్రచర్చలాగే ఉండిపోయింది గాని తరవాత అది అప్పటికప్పుడు పరిష్కరించవలసిన సమస్యలా తయారయింది. అటుపిమ్మట ఆ జంతువు ఒక్క ద్వీపమో లేక ఒకపెద్దరాయో అయి ఉండవచ్చునని కొంత కొంత మంది ఊహాగానాలు మొదలుపెట్టారు. 1867 మార్చిలో మొరేవియన్ అనే ఓడ సముద్రంలో ఒక కొండ గుట్టతో ఢీకొన్నది. అంతవరకు ఆ గుట్ట అక్కడ ఉన్నదన్న సంగతి సముద్రమార్గాల పటాల్లో ఎక్కడా ఎవరూ సూచించిఉండలేదు. ఆ సమయంలో ఆ ఓడ శరవేగంతో ప్రయాణం చేస్తూంది. ఏదో చూపువాసిలో గండం తప్పిపోయింది. లేకపోతే ఆ ఓడలో ప్రయాణం చేసే 237 గురు ప్రయాణీకులు అక్కడ ములిగిపోవలిసిందే!

ఈ సంఘటన తెల్లతెల్లవారేవేళ జరిగింది. అయినా ఓడ అధికారులంతా ఆ పరిసరాలన్నీ అతి జాగ్రత్తగా పరిశీలించారు. కొంచెం దూరంలో వారికొక పెద్ద సుడిగుండంలాంటిదేదో కనిపించింది. ఆ ప్రాంతంలో కెరటాలన్నీ బాగా ఉవ్వెత్తుగా పైకి లేచాయి. అంతే! అంతకన్న పెద్ద విశేషమేమీ కనిపించలేదు. తరవాత ఆ ప్రాంతం ఆనుపానులన్నీ తెలుసుకున్నారు. అంతగా పెద్ద ప్రమాదమేమీ జరగకుండా మొరేవియస్ అక్కడినించి కదిలిపోయింది. ఏదైనా రాతిగుట్ట సముద్రగర్భంలో తగిలిందా? లేకపోతే ఆ ప్రాంతంలో ఇంతకుపూర్వం మునిగిపోయిన ఓడ ఏదైనా మొరేవియన్‌కు తగిలిందా? ఎంతగా మథనపడీనా ఈ సందేహా లేపీ తీరలేదు గాని, తరవాత మొరేవియన్ ఓడ అడుగుభాగం పరిశీలించగా దానికి కొంచెం పెద్ద దెబ్బే తగిలినట్లు స్పష్టపడిపోయింది.

ఇదికూడా కొంతకాలానికి అంతా మరిచిపోయిఉండేవారే! కాని ఇంకో మూడు వారాల తరవాత అలాంటిదే ఇంకొక పెద్ద అఘాయిత్యం జరిగింది. ఆ ఓడ బాగా పెద్ద పేరుప్రఖ్యాతులున్న కంపెనీకి సంబంధించినది. ఆ అఘాయిత్యం జరిగిన పరిస్థితులు కూడా చాలా విచిత్రంగా కనిపించాయి. దాంతో ఆ వ్యవహారం ఒక్కసారిగా అందరి నోళ్ళలోను పడి గప్పుమంది. ఆ దెబ్బ తిన్న ఓడ పేరు స్కోటియా.

1867 ఏప్రిల్ 13 వ తేదీని స్కోటియా గంటకు సుమారు పద్నాలుగు మైళ్ళవేగంతో నడుస్తూంది.

మధ్యాహ్నం 4 గంటలకు ఓడ ప్రయాణీకులందరు ఫలహారాలు చేసేవేళ ఓడవెనకభాగానికిఒకచిన్న ఆఘాతం తగిలినట్లయింది. ఓడ మాత్రం దేనికీతగలలేదు. కాని ఓడకి అడుగుభాగంలో ఏదో చిన్న దెబ్బ తగిలినట్లయింది. సామాన్యంగా అది ఎవరు పట్టించుకోకుండా మాట్లాడకూరుకునేవారే! కాని ఓడ వడ్రంగి హఠాత్తుగా అక్కడికి పరుగెత్తుకు వచ్చి— "ఓడ మునిగిపోతూంది! ములిగిపోతూంది!" అని గట్టిగా కేకలు పెట్టాడు.

ఓడ కెప్టెన్ వెంటనే కిందికి దిగి పరిశీలించాడు. ఓడకు కన్నం పడిన మాట నిజమే! నీరప్పుడే గబగబా లోపలికి వచ్చేస్తూంది. అదృష్టవశాత్తు ఆ కన్నం పడినభాగంలో బాయిలర్లు లేవు. లేకపోతే ఇంజన్ తక్షణమే ఆగిపోయేదే! కెప్టెన్ వెంటనే ఇంజన్లు ఆపివెయ్యమని ఫర్మానా జారీ చేశాడు. కొంతమంది నావికులు ఓడకు తగిలిన దెబ్బ పరిశీలించడానికి సముద్రంలో మునిగారు. తరవాత కొంతసేపటికి ఓడ అడుగున సుమారు రెండు గజాల మేరవరకు కన్నం పడిందని తెలిసింది. ఆ పరిస్థితుల్లో ఇక ఓడ బాగుజేయించి ప్రయాణం సాగించే అవకాశమేమీ లేదు. అందుచేత ఎలాగో అలాగ ఓడ నడిపించుకుపోవడం తప్ప గత్యంతరమేమీ కనబడలేదు. అక్కడికి దగ్గరలోఉన్న కేప్ క్లియర్ ఐర్లండు తీరంలో ఇంకా 3 వందల మైళ్ళ దూరంలో ఉంది. మొత్తంమీద నానా ఇబ్బందులతోను మూడు రోజులు ప్రయాణం సాగించిన తరవాత స్కోటియా చచ్చిజెడి చాయంగలవిన్నపాలన్న

ట్లుగా కేప్ క్లియర్ లో ప్రవేశించింది.

తరవాత ఓడ ఇంజనీయరులు ఆ ఓడ అడుగుభాగం అంతా అతి జాగ్రత్తగా పరీక్షించారు. ఓడ అడుగున పడిన కన్నం చూచిన తరవాత మరి తమ కళ్ళే నమ్మలేకపోయారు! అడుగున ఇంచుమించుగా రెండు గజాలమేరవరకు త్రిభుజాకారంలో ఒక పెద్ద కన్నం కనిపించింది. ఓడ అడుగున దట్టంగా తాపటం చేసిన ఇనపరేకులగుండా పడిన ఆ రంధ్రం చూడగానే ఇంజనీరులంతా గుండెలు బాదుకున్నారు! అవి ఇంచుమించుగా రెండంగుళాల మందం ఉన్న ఇనపరేకులు. ఆ విధంగా ఓడ అడుగున కన్నం చేసిన జలజంతువేదో మళ్ళీ అతి జాగ్రత్తగా తన కోరలు వెనక్కి లాగివేసి ఉండాలి.

ఈ సంగతి బయలుపడినతరవాత దీనినిగురించిన అలజడి ఇంకా బాగా పెచ్చుపెరిగిపోయింది. ఆతరవాత ఓడల కేవైనా అఘాయిత్యాలు జరిగితే— సామాన్యంగా కారణాలు తెలియనివారి కన్నింటికీ—ఆ పెద్ద జంతువే కారణమై ఉండవచ్చునని అందరూ ఎంతో విడ్డూరంగా చెప్పుకునేవారు. ఓడల కంపెనీల యజమానులు కూడా తమ ఓడలకు వచ్చే కష్టాలన్నీ దానిమూలంగానే వస్తున్నాయని అనడం ఒక పరిపాటిగా తయారయింది. క్రమక్రమంగా సముద్రప్రయాణమే ఒక పెద్ద క్లిష్టసమస్యగా తయారయింది. దానితో జనం ఆ భయంకర ప్రమాదమేదో వెంటనే తొలగించాలనీ, సముద్రప్రయాణం సుఖంగా సాగిపోయే పరిస్థితులు కల్పించాలనీ పెద్ద గందరగోళం లేవదీశారు.

—ఇంకా ఉంది

కవి చక్రవర్తి

(9-వ పేజీ తరువాయి)

"ఔను!"

"తమరు కవీశ్వరులేకదా!"

మాతృగుప్తు డౌననలేదు గాని ఔనన్నట్టుగా శిరఃకంపం చేసి చిరునవ్వు నవ్వాడు. అతనికి వారావిధంగా పరీక్షించడానికి గల కారణమేమో బోధపడలేదు. ప్రశ్నార్థకంగా వారివైపు చూశాడు.

మహామాత్యుడు సవినయంగా అతనిని సమీపించి "ఈక్షణంనుంచీ తమరే కాశ్మీరాధీశ్వరులు!" అన్నాడు.

మాతృగుప్తు డిది విశ్వసించలేదు!

"హర్ష విక్రమాదిత్య చక్రవర్తి తమ స్వహస్త ముద్రాంకితమైన శ్రీముఖంలో తమరిని కాశ్మీర రాజ్యాధీశ్వరులుగా ప్రతిష్ఠించారు!" అన్నాడు కాశ్మీరమంత్రి. వెంటనే కాశ్మీర చక్రవర్తిసన్నిధిని నిలుచున్నట్టుగా మాతృగుప్తుని సన్నిధిని చేతులు జోడించి నిలుచున్నాడు. మిగిలిన దండనాయకులు కూడా లేచి నిలబడి చేతులు జోడించారు. మాతృగుప్తుడా పెనకటి ఆశ్చర్యాఘాతంలోనుంచి ఇంకాబాగా తేరుకోనేలేదు.! అంతలోనే ఇంకొక ఆశ్చర్యాఘాతం! మహామాత్యుడు తిరిగి ఇలాగన్నాడు "ఈక్షణంనుంచి కాశ్మీరం సర్వ స్వతంత్ర రాజ్యంగానే వ్యవహరించవలెననీ ఉజ్జయినీసామ్రాజ్య సామంతరాజ్యంగా వ్యవహరింపరాదనీవారి శ్రీముఖంలో ఆజ్ఞాపిస్తున్నారు."

మాతృగుప్తుని కింకా అనుమానం తీరలేదు! నెమ్మదిగా చక్రవర్తి లేఖకోసం చేయిచాచాడు. మంత్రి సవినయంగా అది మాతృగుప్తుని కందించాడు.

మాతృగుప్తుడా లేఖలో ప్రతి అక్షరము ఎంతో జాగ్రత్తగా పరిశీలించాడు. మహామాత్యుడు చెప్పినదంతా అక్షరాలా యథార్థమే! దానిలో ఎక్కడా ఇక సందేహాని కావకాశమే లేదు!

అటుపిమ్మట మంత్రి మరునాడే శుభముహూర్తం ఏర్పాటుచేయించి శ్రీనగరంలో పట్టాభిషేక మహోత్సవం జరిపించబోతున్నామనీ ఆనాడే శ్రీనగరానికి తరలిపోతున్నామనీ దానికి ఆజ్ఞాముద్ర ఇప్పించవలసిందనీ తిరిగీ సగౌరవంగా విజ్ఞప్తి చేశాడు.

మాతృగుప్తుని కిక దాని కంగీకారముద్ర వేయక తప్పలేదు. చక్రవర్తి ఆ పట్టాభిషేకం జరపవలసిన దివసంకూడా ఆ లేఖలో ఉదహరించి ఉండటంవల్ల అది మార్చడాని కెవరికీ ధైర్యం కలగలేదు.

మరునాడు కాశ్మీర రాజధాని శ్రీనగరంలో మాతృగుప్తునికి యథావిధిగా సామ్రాజ్య పట్టాభిషేకం జరిగిపోయింది. శ్రీనగరమే కాక కాశ్మీరమండలం అంతా ఆనాడు ఉత్సవ కోలాహలంలో తలమునకలయిపోయింది.

మాతృగుప్తుని కా పట్టాభిషేకసమయములో రెండే రెండు ప్రధాన విషయాలు స్ఫురించాయి. వాటిలో మొదటిది హర్ష విక్రమాదిత్య చక్రవర్తి తనయెడల కనబరిచిన అపారమైన ఔదార్యం. అది తలచుకున్నప్పుడు ఆనందభాష్పాలతో కలిసిన అభిషేక జలాలు అవిరళధారలుగా అతని శరీరంమీద ప్రవహించాయి.

రెండవది అతని గృహిణి విషయం. వివాహమైన క్షణంనించీ ఆ సహధర్మచారిణి అనేకమైన కష్టసుఖాలలో అతనికి తోడు నీడగా చేదోడు వాదోడుగా నిలబడింది. ఆమె తనతోపాటుగా కాశ్మీరం వస్తానని ఎన్నెన్నో విధాల కాళ్ళావేళ్ళా బ్రతిమాలింది. అనారోగ్యం వల్ల ఆమెను తనవెంట తీసుకురాలేదు. ఆమె అనారోగ్యం ఎలాగున్నదో తెలియదు. ఏకైక పుత్రుని మరణ దుఃఖంలో ఆమె కుమిలి కుమిలి కృశించిపోతున్నది. ఆమె అతని సరసనకూర్చుని చక్రవర్తినీ గౌరవం పొంది ఆనందించవలసిన సమయమది. ఆమె లేకుండానే హఠాత్తుగా అతడీ చక్రవర్తి గౌరవం పొందడం జరిగింది. అది తలుచుకోగానే అతని ఆనందబాష్పాలు దుఃఖాశ్రుధారలై ప్రవహించాయి. అయినా అతడా శోకం అంతా లోలోపలనే స్తంభింపజేసుకొన్నాడు.

అటుపిమ్మట విక్రమాదిత్యచక్రవర్తికి కృతజ్ఞతా సూచకంగా అమూల్యమైన కానుక లేవేవో పంపించాలని అనుకొన్నాడు. ఆ కానుకలు సమాన గౌరవ ప్రపత్తితోనే పంపించాలిగాని సామంత ప్రభువుగా అవి పంపరాదు! అది చక్రవర్తి ఆజ్ఞ! ఆ విధంగా సమాన సార్వభౌమ గౌరవంతో చక్రవర్తికి కానుకలు పంపించడానికి అతని హృదయం అంగీకరించలేదు. ఆ విషయం తలుచుకోవడమే అతని కెంతో లజ్జాకరంగా పరిణమించింది. వెంటనే ఒక భూర్జపత్రంపై ఒకే ఒక శ్లోకం రచించి అది చక్రవర్తి కాశ్మీర మహామాత్యునికి పంపించిన స్వర్ణపేటికలోనే ఉంచి తత్క్షణమే అది వేగరుల ద్వారా విక్రమాదిత్య చక్రవర్తికి పంపించే ఏర్పాటు చేయించాడు.

"చక్రవర్తీ! నీలోనిఆత్మోత్కర్షసూచనామాత్రంగానైనా స్ఫురించనీయలేదు! నీ

కవిచక్రవర్తి

మహౌదార్యం ఛాయా మాత్రంగానైనా భావించనీయలేదు! మహాప్రభూ! నీ వితరణ నిశ్శబ్ద జలధరవర్షం! నీ అనుగ్రహం ఫలరూపంలోనే ప్రత్యక్షమైనది!" అని ఆ శ్లోక తాత్పర్యం.

అటుపిమ్మట వెంటనే సర్వమంగళకీ శుభవార్త తెలియజెయ్యడానికై జవనాశ్వాలపై పలుగురు వేగయిరులను ఉజ్జనీనగరానికి పరిగెత్తించాడు.

సర్వమంగళకేమాత్రం ఆరోగ్యంగా ఉన్నా వెంటనే ఆమెను కాశ్మీరానికి తోడ్కొనిరావలిసిందని ఆజ్ఞాపించాడు. ఒకవేళ శరీరారోగ్యస్థితి దీర్ఘప్రయాణానికి అనుకూలం కాకపోతే ఆమె చికిత్సకై ఉజ్జయినీ నగరంలో రాజవైద్యుల నేర్పరచవలిసిందని ఆజ్ఞాపించాడు. అటుపిమ్మట పదిహేను రోజుల వరకు నిద్రాహారాలు లేకుండా ఆ వేగరులరాకకోసం ఎదురు తెన్నులు చూచాడు. ఆ పదిహేను రోజులు అతనికొక మహాయుగాలుగా గడిచాయి. చివరికి వేగరులు వచ్చారు.

మాతృగుప్తుడు కాశ్మీరానికి బయలుదేరి వెళ్ళిన మరునాటినించీ సర్వమంగళరోగం మళ్లీ తిరగబెట్టింది. క్రమంగా అది బాగా ముదిరిపోయింది. అందరు ఇక ఆమె జీవించదని నిశ్చయించారు. ఇంతలో వేగరు లతికష్టంమీద ఆ శుభవార్త ఆమె చెవిలో వేశారు. ఆ మాట వినీ వినగానే ఆమె ముఖంలో ప్రత్యణుపు ఒక్కసారిగా తామరపూవులా వికసించింది! మరుక్షణంలో ఆ ఆనందాఘాతం ఆమె హృదయానికొక వజ్రాఘాతంలా పరిణమించింది. వెంటనే ఆమె మరణించింది. వేగరులా వృత్తాంతం అంతా చక్రవర్తికి విన్నవించారు.

మాతృగుప్త చక్రవర్తి ఆ మాట వింటూనే మొదలు నరికిన తరువులా అక్కడే కూలబడిపోయాడు!

—మిగిలిన కథ పైవారం

తెగని బంధం

(26–వ పేజీ తరువాయి)

'సుజాతా, నువ్వు ముందర వెళ్లు...' మధు సుజాత కళ్ళల్లోకి ప్రాధేయ పడుతున్నట్లు చూశాడు.

'మరీ అంతయిదా...మీరు ముందర వెళ్ళండి...పరిస్థితినిబట్టి నేను వస్తాను. ముందర మాత్రం, నేను, పాప, మావగారికి కనిపించకూడదు.....' సుజాత, మధును ముందుకు నెట్టింది.

భార్యదగ్గర కొంచెమన్నా ధైర్యం చూపించాలనుకుని, మనస్సు చిక్కబట్టుకుని, మధు లోపలికి వెళ్లాడు సరాసరి.

'అబ్బాయీ వచ్చావురా నాయనా...' అంటూ అమాంతం మధును కౌగలించుకుని లలితమ్మ ఏడ్చింది.

'ఎవరూ యేమిటి...' వర్మ గబగబ గదిలోంచి వచ్చాడు.

'నాన్నా...' మధు గట్టిగా అరిచాడు.

'నాన్నా...ఛీ...అవతలకు ఫో...మళ్ళీ నీ మొహం చూడటమూ...సిగ్గులేదూ...ఏ మొహం పెటుకు వచ్చావు...' వర్మ గబగబ అనేస్తున్నాడు.

'వూరుకోండీ...అంత కఠినమా!...కన్నకొడుకుమీద ఆ మాత్రం కనికరం చూపకూడదూ....' లలితమ్మ, వర్మను ఆపటానికి ప్రయత్నం చేస్తోంది.

'నీ చనువుమూలానే యింతవరకు వచ్చింది...' నువ్వుకూడా వాడితో వెళ్లిపో, నేను వక్కణ్ణే యీ యింట్లో వుంటా...' వర్మకు ఆవేశం అధికమయిపోతోంది.

మెల్లిగా, సుజాత, పాపను చంకనపెట్టుకుని తలుపు చాటుగా నిలబడింది.

వర్మ కళ్లు అప్రయత్నంగా వీళ్ళిద్దరిమీద పడ్డాయి.

'ఎవరూ...' కంఠం తగ్గించి అన్నాడు వర్మ.

గబుక్కున తలుపుచాటునుంచి సుజాత లోపలికి వచ్చేసింది.

వర్మ, ఆశ్చర్యంగా సుజాత కళ్లల్లోకి చూశాడు. సుజాత చంకలో పాప 'తా..త' అంటూ అక్షరాలు విడివిడిగా అంటున్నాడు.

'అమ్మాయి...ఎవరు...?'

'మీ మనమడు...' పట్టు బలవంతాన దుఃఖము ఆపుకుంటూ సుజాత అంటూ మావగారి కాళ్లమీద వరగబోయింది.

'అయ్యో! పాప పడిపోతాడు...,అంటూ అమాంతం, సుజాత చేతులోంచి పాపను వర్మ తీసుకుని తన గుండె మీదకు తీసుకున్నాడు.

'అమ్మాయీ...రా...వీడు నావాడు...వీడికోసనే నేను ఇంకా బ్రతికివున్నా...' అంటూ గట్టిగా పాపణ్ణి హృదయానికి అద్దుకున్నాడు వర్మ సుజాత తల నిమురుతూ.

సుజాత అమాంతంగా లలితమ్మ వళ్లో పడింది. ★

జూల్స్ వెర్న్

(27 వ పేజీ తరువాయి)

80 రోజులలో ప్రపంచయాత్ర' అనే మరో పుస్తకం రాశాడు. ఆ పుస్తకం పత్రికల్లో సీరియల్ గా ప్రచురించే రోజుల్లో పారిస్ ప్రజ లందరు ఆ పత్రిక కోసం కాచుకొని కూర్చునేవారట!

తరవాత జూల్స్ వెర్న్ 'ట్వంటీ థౌజండ్ లీగ్స్ అండర్ దిసీ' అనే పుస్తకం రాశాడు. గ్రంథకర్త ఆ పుస్తకంలో ఒక జలాంతర్గామి సృష్టించాడు. అటుపిమ్మట ఎంతో కాలందాకా నిజమైన జలాంతర్గామి తయారు చెయ్యడం జరగలేదు.

అతడు రచించిన ఇంకొక చిన్న పుస్తకంలో న్యూయార్కు నగరం ప్రపంచ ప్రధాన నగరంగా పెంపొందగలదని వ్రాశాడు. క్రమక్రమంగా శీతోష్ణస్థితి మార్చే మార్గాలు కనుగొనగలరనీ ఉత్తరధృవం దగ్గరకూడా పంటలు పండించగలరనీ మేఘాలమీద వ్యాపార ప్రకటనలు వెలువడగలవనీ ఆ పుస్తకంలో వ్రాశాడు. దానిలో కథానాయకుడు ఒక 'ప్రపంచ పత్రిక'కు సంపాదకుడుగా పని చేస్తాడు. దానికి రోజుకు 8 కోట్లమంది పాఠకులు. ఆ పత్రికలో అంగారకుడు, బృహస్పతి మొదలైన గ్రహాలనించివచ్చిన వార్తలుకూడా ప్రచురిస్తారు.

పాపం జూల్స్‌వెర్న్ వార్ధక్యం అంతగా సుఖంగా గడవలేదు. పెద్ద పెద్ద మేథావులతన్ని హేళనచేసేవారు. ఆ రోజుల్లో అతని పుస్తకాలే బాగా యెక్కువగా అమ్ముడుపోయేవి. అయినా అతనికి ఫ్రెంచి ఎకడమీ సభ్యత్వం లభించలేదు. క్రమ క్రమంగా అతని జీవితంలో కష్టాలెక్కువయ్యాయి. దృష్టి మందగించింది. అతడు చిట్టచివర వ్రాసిన పుస్తకంలో ప్రపంచంలో క్రమక్రమంగా నియంతల రాజ్యాలేర్పడగలవని జోస్యం చెప్పాడు.

జూల్స్‌వెర్న్ 1905 లో చనిపోయాడు.

బ్రతికి ఉండగా అతన్ని వేళాకోళం చేసినవారందరు ఎంతో గౌరవంగా అతని మృతదేహంవెంట నడిచి వెళ్లారు. ఇంకా రాజప్రతినిధులు మొదలైనవారెందరో ఆనాడక్కడికి వచ్చారు. ★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Patrika Andhra Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



నేనూ, పాపాయీ

—ఫొటో : వి. కేశవశర్మ




LIFEBUOY SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY SOAP